
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 20, ఆగస్టు 2025

ఒకవైపు జోరుగా వర్షాలు.. మరోవైపు సాగర్ నీరు రాక | నిండుకుండలా గుండ్లకమ్మ అదేస్థాయిలో రామతీర్థం | పశ్చిమాన పొంగుతున్న వాగులు, వంకలు గుండ్లకమ్మ, పాలేరు, ముసిల్లోనూ ప్రవాహం

వానలు, సమృద్ధిగా వస్తున్న సాగర్ జలాలతో జిల్లా జలకళను సంతరించుకుంది. పశ్చిమంలో ప్రత్యేకించి నల్లమల అటవీ సమీప ప్రాంతాల్లో వాగులు, వంకలు వర్షపు నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. తూర్పుప్రాంతంలోని గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్లు నిండుకుండలను తలపిస్తున్నాయి. గుండ్లకమ్మ, పాలేరు, ముసిలకూ వరద వస్తుండగా పలుచోట్ల ఆ నదులలో కలిసే అనేక వాగులు, వంకల్లో భారీగా ప్రవాహం కనిపిస్తోంది. మరికొన్ని చోట్ల చెరువుల్లోకి నీరు చేరింది. సాధారణంగా ఈ తరహా వాతావరణం సజావుగా వర్షాలు కురిసి.. అదేస్థాయిలో సాగర్ నీటి సరఫరా జరిగితే సెప్టెంబరు ఆఖరు నుంచి కనిపిస్తుంది. అలాంటిది ఈ ఏడాది ఆగస్టులోనే నెలకొంది.


నిండుకుండలా ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్

జలకళ

గుండ్లకమ్మలో 3.34టీఎంసీల నిల్వ

ఒక వైపు వర్షపునీరు, మరోవైపు సాగర్ జలాలు భారీగా రాకతో గుండ్లకమ్మ రిజర్వాయర్ నిండుకుండలా కనిపిస్తోంది. సుమారు 3.85 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఆ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.34 టీఎంసీల నిల్వ ఉండగా ఎగువ నుంచి 400 క్యూసెక్కులు ప్రవాహం వస్తోంది. మరికొంత వస్తే గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలనున్నారు. వారం క్రితం నీరు వదలడంతో దిగువ ప్రాంతంలో కూడా ప్రవాహం పెరిగింది. మొత్తం మీద జిల్లాలో ప్రస్తుతానికి తాగు, సాగునీటి ఇక్కట్లు పడాల్సిన అవసరం లేనంతగా నీటి వనరులు కనిపిస్తున్నాయి. ఆగస్టులోనే ఇలా జలకళ సంతరించుకోవడంపై ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే కురిసిన వర్షాలు క్రమపద్ధతి లేకుండా అదునులో లేకపోవడంతో పంటలు సాగు ముందుకు సాగక రైతులు మాత్రం నిరాశతో కనిపిస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవలి వరకు సకాలంలో వర్షాలు కురవక పంటల సాగు ఆశించిన మేర ముందుకు సాగలేదు. గత వారం నుంచి ఒకవైపు వర్షాలు, మరోవైపు ముందస్తుగా సాగర్ నీటి రాకతో నీటి వనరులు జలకళను సంతరించుకుంటున్నాయి. పశ్చిమాన కుండపోత వానలతో తొనికిసలాడుతున్నాయి. జిల్లాలో సాధారణంగా జూన్ ఆరంభం నుంచి ఆగస్టు వరకు సుమారు 237.8 మి.మీ వర్షపాతం నమోదవుతుంది. అయితే ఈసారి ఇప్పటివరకు సుమారు 203 మి.మీ మేర వర్షం కురిసింది. ఈనెలలో ఇంకా 10 రోజులు ఉండగా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అయితే జూన్‌లో 35శాతం లోటు, జూలైలో అధికంగా వర్షం పడినప్పటికీ అదునులో కురవకపోవడం, ఈ నెలలో తొలి రెండు వారాలు వాన జాడలేకపోవంతో పంటల సాగు ముందుకు సాగలేదు. దాని వల్ల ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో ఇప్పటి వరకూ 20శాతం మించి పంటలు సాగు చేయలేకపోయారు.

అల్పపీడన ప్రభావంతో..

అల్పపీడన ప్రభావంతో వారం నుంచి పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నీటి వనరులు కళకళలాడుతున్నాయి. ఈనెలలో 92.0 మి.మీ సాధారణ

మిగతా 6వ పేజీలో

రాచర్ల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ



పక్కాగా రేషన్ పంపిణీ

- పలు మార్పులు తెస్తున్న ప్రభుత్వం
- బయోమెట్రిక్ స్థానంలో స్మార్ట్‌మిషన్
- వచ్చేనెల నుంచి కొత్త కార్డులతో సరుకులు
- చర్యలు చేపట్టిన అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. పక్కాగా సరుకుల పంపిణీకి చర్యలు చేపట్టింది. తాజాగా బయోమెట్రిక్ (వేలిముద్రలు వేసే మిషన్) స్థానంలో సాంకేతిక పరిజ్ఞానంతో (లేటెస్ట్ అప్‌డేట్) స్మార్ట్‌మిషన్‌ను అందుబాటులోకి తెస్తోంది. దీని ద్వారా కార్డుదారులు సత్వరమే రేషన్ సరుకులు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బయోమెట్రిక్ మిషన్ ద్వారా వేలిముద్రలు పడక గంటల తరబడి షాపుల వద్దనే పడిగాపులు కాయాల్సివస్తోంది. కొత్త విధానంలో అలాంటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.



కార్డు స్కాన్‌తో సరుకులు

కార్డుదారులు చౌకధరల దుకాణాల వద్దకు వెళ్లాక వేలిముద్రలు పడకపోతే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న

మిగతా 6వ పేజీలో


మహాసభల పోస్టర్లను సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

సీపీఐ సభలకు భారీ ఏర్పాట్లు

- ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో పార్టీ రాష్ట్ర మహాసభలు
- తొలిరోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు రాజా, నారాయణ
- జిల్లావ్యాప్తంగా శ్రేణుల విస్తృత ప్రచారం
- నేటి నుంచి ఒంగోలులో కళా ప్రదర్శనలు

ఒంగోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు వేదికగా ఈనెల 23 నుంచి 25 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర 28వ మహాసభలు జరగనున్నాయి. అందుకు ఆ పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతి మూడేళ్లకు ఒకసారి గ్రామస్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు సీపీఐ, సీపీఎం ఇతర వామపక్షాలు సంస్థాగత నిర్మాణంలో భాగంగా మహాసభలను నిర్వహిస్తుంటాయి. సెప్టెంబరులో పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు జరగనుండగా ఈ లోపు రాష్ట్ర స్థాయిలోనూ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని జిల్లా మహాసభలు పూర్తికాగా ఆయా జిల్లాలు, పార్టీ రాష్ట్ర, కేంద్రం నుంచి సుమారు 550 మంది ప్రతినిధులు ఒంగోలులో జరిగే మహాసభలకు హాజరుకానున్నారు. గత

మిగతా 6వ పేజీలో

ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేధం!

- సింగిల్ యూజ్ వినియోగానికి చెక్
- దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

7





అరవై శాతం మంది అనర్హులే!

- ఆరోగ్య పింఛన్లు పొందుతున్న వారిలో 747 మంది బోగస్
- వీరిలో 495మందికి ఇతర పింఛన్లు
- దివ్యాంగుల కేటగిరీలో 3,340 మంది అనర్హులు
- వారికి వచ్చే నెల నుంచే కట్
- నోటీసులు అందుకున్న వారిలో అర్హులు ఉంటే పునరుద్ధరణ



ఒంగోలు నగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంచానికే పరిమితమయ్యాం..! కాళ్లు కదలటం లేదు.. చేతులు ఆడటం లేదు.. వీల్‌ఛైర్‌లోనే నిత్యం జీవనం సాగిస్తున్నాం..! అంటూ హెల్త్ పింఛన్ల కేటగిరీ కింద నెలవారీ రూ.15వేలు పొందుతున్న వారిలో 60 శాతం మంది అనర్హులు ఉన్నట్లు తేలింది. రాష్ట్రప్రభుత్వం జిల్లాలో ఆరోగ్య పింఛన్లు పొందుతున్న వారి ఇంటింటికీ వైద్య బృందాలను పంపించి తనిఖీ చేయించింది. అందులో భారీగా బోగస్‌లు ఉన్నట్లు తేలింది. జిల్లాలో ఈ ఏడాది జనవరి నాటికి హెల్త్ పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య 1,224గా ఉంది. వైసీపీ ప్రభుత్వ

మిగతా 6వ పేజీలో

మెగా డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ వేగవంతమవుతోంది. ఫలితాలను ప్రకటించిన పాఠశాల విద్యాశాఖ ఖాళీలపై దృష్టి కేంద్రీకరించింది. సోమవారం అన్ని జిల్లాల నుంచి టీచర్ పోస్టుల ఖాళీలను స్వీకరించిన విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం మంగళవారం వాటిని ధ్రువీకరించింది. డీఎస్సీలో ప్రకటించిన ఖాళీలకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టనున్నారు. పాఠశాలల ఎంపికకు కసరత్తు ప్రారంభమైంది. నో టీచర్ స్కూళ్లు, బదిలీ అయి రిలీవర్ లేని కారణంగా అదే పాఠశాలల్లో పనిచేస్తున్న పోస్టులు, 50శాతం లోపు టీచర్లు ఉన్న పాఠశాలలకు కొత్త వారిని కేటాయించనున్నారు.

రేపటి నుంచి డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

- 14 కమిటీల ఏర్పాటు
- కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి



ఒంగోలు విద్య, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీలో ప్రతిభ చూపి అత్యధిక మార్కులు సాధించి మెరిట్ జాబితాలో మొదట నిలిచిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఈనెల 21న నిర్వహించనున్నారు. గతంలో మాదిరి టీచర్ పోస్టులకు ఎంపికైన వారి సర్టిఫికెట్లు కాకుండా మెరిట్‌లో ముందున్న వారిని పరిశీలనకు ఆహ్వానిస్తున్నారు. అందుకు 1:1 నిష్పత్తి ప్రకారం ఒక పోస్టుకు ఒక అభ్యర్థినే ఆయా రిజర్వేషన్ల ప్రాతిపదికగా ఎంపిక చేస్తున్నారు. పరిశీలనలో అన్నీ సక్రమంగా ఉన్నట్లు తేలిన తర్వాత పోస్టులకు అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు డీఎస్సీ దరఖాస్తులో తాము పేర్కొన్న విద్యార్హతలు, రిజర్వేషన్లు, ఇతర వివరాలకు సంబంధించిన

మిగతా 6వ పేజీలో

పోలీసుల తీరు దారుణం

- ఎస్‌ఐ, సిబ్బందిపై దళితుల ఆగ్రహం
- నాగులుప్పలపాడు స్టేషన్ ఎదుట నిరసన

7

మహిళా చైతన్యంతో అభివృద్ధి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి
- కొండపిలో సంఘ జిల్లా మహాసభలు ప్రారంభం

7


విలపిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఉసురు తీసిన సరదా!

చెరువులో ఈతకు వెళ్లి తెప్ప ఎక్కిన ఇద్దరు విద్యార్థులు

- అది బోల్తా పడటంతో మృత్యువాత
- రెండు కుటుంబాలకు కడుపు కోత

కనిగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు స్నేహితుల సరదా వారి ప్రాణాలను బలి తీసుకుంది. రెండు కుటుంబాలకు కడుపు కోతను మిగిల్చింది. ఈ ఘటన కనిగిరి మండలంలోని పునుగోడు వద్ద మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరిలోని నక్కలతిప్ప ప్రాంతానికి చెందిన బొందలపాటి శివప్రసాద్ (19), శంఖవరం గ్రామానికి చెందిన ఏనుగంటి ఎర్రయ్య (18) స్నేహితులు. వీరిరువురూ స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. సీఎస్‌పురంలోని భైరవకోన జలపాతాన్ని చూసేందుకు వెళుతున్నామంటూ ఆదివారం ఉదయం శివప్రసాద్ వాళ్ల నాయనమ్మకు చెప్పి బైక్‌పై వెళ్లారు. కానీ స్నేహితులకు మాత్రం ఈత కొట్టేందుకు వెళ్తున్నామని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పునుగోడు చెరువులో శవాలై తేలారు.

పునుగోడు చెరువులో పడి..

భైరవకోనకు అని బయల్దేరిన

మిగతా 6వ పేజీలో


శివప్రసాద్ (ఫైల్)


ఎర్రయ్య (ఫైల్)


లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి భారతి

అర్హులైన వారికి మరింత చేరువగా న్యాయ సేవలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి
- సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

7

కోర్టుల్లో ఉద్యోగాల భర్తీకి నేటి నుంచి పరీక్షలు

- 6,948 మంది అభ్యర్థులు
- ఐదు కేంద్రాలు, మూడు షిఫ్టులు

6



దోర్నాల ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తీగలేరు

జలకళ

(5వ పేజీ తరువాయి)

వర్షపాతం కాగా ఇప్పటివరకు 53.3 మి.మీ కురవాలి. అలాంటిది 73.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అందులో ఈ వారంలోనే సుమారు 50 మి.మీపైన కురిసింది. మార్కాపురం, గిద్దలూరు కనిగిరి, కొండపి, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల్లోని అత్యధిక మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ప్రత్యేకించి నల్లమల అటవీ సమీప మండల్లోనూ నల్లమల అడవిలోనూ ఇటీవల కుండపోత కురిసింది. దీంతో అటవీ సమీపంలో ఉండే తీగలేరు వాగు, దొంగల వాగు, జంపలేరు, సగిలేరు, ఎమిలేరు వంటి వాటికి భారీగా వరద నీరు వస్తోంది. గుండ్లకమ్మలోనూ భారీగా నీరు ప్రవహిస్తోంది.

కంభం చెరువుకు నీరు

రాచర్ల మండలంలోని రామన్న కత్తువలోకి భారీగానే నీరు చేరగా అక్కడి నుంచి కంభం చెరువుకు, గుండ్లకమ్మ ద్వారా నీరు వస్తోంది. జంపలేరు ద్వారా కూడా కంభం చెరువుకు ప్రవాహం కొనసాగుతోంది. దోర్నాల, పెద్దారవీడు, మార్కాపురం, పొదిలి మండలాలతోపాటు కనిగిరి, కొండపి, దర్శి నియోజవకర్గాల్లోని పలు చెరువులకు నీరు చేరింది. పాలేరు, ముసి నదుల్లోనూ నీటి ప్రవాహాలు కనిపిస్తున్నాయి. దర్శి నియోజకవర్గం ద్వారా గుండ్లకమ్మకు నీరు వచ్చే చిలకలేరు, దోర్నపు వాగుల్లో ప్రవాహం పెరిగింది.

సాగర్ ఆయకట్టు కళకళ

సాగర్ కాలువల నీరు సాధారణం కన్నా ఈ ఏడాది దాదాపు నెల ముందే వచ్చింది. అది కూడా కాలువల సామర్థ్యం మేర సరఫరా జరిగింది. ప్రస్తుతం కూడా కాలువల్లో భారీగానే నీటి ప్రవాహం ఉంది. దీంతో వాటి ఆధారంగా జిల్లాలో దర్శి, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లో ఉన్న 200పైగా నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులు, ఈ ప్రాంతాల్లో ఉండే వాగులు, వంకల్లో నీరు చేరింది. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని పెద్ద ఎస్‌ఎస్ ట్యాంకులు కూడా నిండాయి. సాగర్ కాలువ దిగువన చీమకుర్తి సమీపంలో ఉన్న రామతీర్థం రిజర్వాయర్ నిండుకుండలా మారింది. సుమారు 1.50 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఆ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండటంతో దిగువ కాలువలకు కూడా నీటిని వదిలారు.

పక్కాగా రేషన్ పంపిణీ

(5వ పేజీ తరువాయి)

స్మార్ట్ మిషన్ ద్వారా రైస్‌కార్డును స్కాన్ చేసి రేషన్ ఇస్తారు. దీని వలన రేషన్ పక్కదారి పట్టకుండా నిలువరించడంతోపాటు కార్డుదారులకు సులభతరంగా సరుకులు పొందవచ్చని అధికారులు చెప్తున్నారు. ఇప్పటి వరకు ప్రస్తుతం ఉన్న కార్డులతోనే బియ్యం ఇస్తుండగా వచ్చేనెల నుంచి కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డులు ప్రింట్ చేసిన సంస్థలకు మండలాల వారీ చిరునామాలు కూడా ఇచ్చారు. అవి నేరుగా మండలాలకు చేరిన తర్వాత పంచాయతీల వారీగా విభజించి పౌరసరఫరాల శాఖ అధికారుల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్పులు, చేర్పులకు భారీగా దరఖాస్తులు

రేషన్ కార్డుల్లో చేర్పులు మార్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో జిల్లావ్యాప్తంగా 94,129 దరఖాస్తులు వచ్చాయి. అందులో ప్రస్తుతం ఉన్న కార్డుల్లో సభ్యుల చేర్పుల కోసం అత్యధికంగా 65,737 ఉన్నాయి. వాటిలో 39,722 దరఖాస్తులను అధికారులు ఆమోదించగా 7,002 తిరస్కరించారు. మిగిలినవి విచారణలో ఉన్నాయి. కొత్త రైస్‌కార్డుల కోసం 10, 457 దరఖాస్తులు అందగా 6,717ను ఆమోదించారు. 3,454 తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. అలా ఆమోదించిన దరఖాస్తుల్లో ఈ నెలలోనే సుమారు 20శాతం మందికి సరుకులు తీసుకునేందుకు అవకాశం కలిగింది. ఇప్పటికే ఆమోదించిన దరఖాస్తులకు నంబర్లు కూడా రావడంతో కొత్త కార్డుదారులు ఆయా రేషన్ షాపుల వద్ద బయోమెట్రిక్ వేసి బియ్యాన్ని తీసుకున్నారు. ఇలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పౌరసరఫరాల శాఖలలో అనేక మార్పులు తేవడంతోపాటు కార్డుదారులకు పారదర్శకంగా బియ్యం పంపిణీకి చర్యలు చేపట్టింది.

సీపీఐ సభలకు భారీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

మూడేళ్లుగా రాష్ట్రంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, ప్రస్తుత ప్రభుత్వాల తీరు, ప్రజా సమస్యలు, వాటి పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనతోపాటు రానున్న మూడేళ్ల కాలానికి పార్టీ నూతన నాయకత్వం ఎంపిక ఈ మహాసభల్లో జరగనున్నాయి.

భారీ ర్యాలీ, బహిరంగ సభ

మూడు రోజుల పాటు జరిగే మహాసభల ప్రారంభ సందర్భంగా తొలి రోజైన 23న జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే సీపీఐ శ్రేణులతో నగరంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు బస్టాండు సెంటర్‌లోని మునిసిపల్ స్కూలు నుంచి అద్దంకి బస్టాండు సమీపంలోని కూరగాయల మార్కెట్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ ఉంటుంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగే ఈ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇతర నాయకులు పాల్గొననున్నారు. అనంతరం 24, 25 తేదీల్లో ప్రతినిధుల సభలు జరుగుతాయి. దేశంలో సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రతిష్టాత్మకంగా మహాసభల నిర్వహణతోపాటు యంగ్ కమ్యూనిస్టు కార్యకర్తలతో ర్యాలీలో కవాతు నిర్వహించేలా శిక్షణ ఇస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం

తొలిసారి వామపక్ష పార్టీ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగనుండటంతో జిల్లాలో సీపీఐతోపాటు ఇతర వామపక్ష అభ్యుదయ వర్గాలు ఈ ఏర్పాట్లలో భాగస్వామ్యువుతున్నారు. సీపీఐ శ్రేణులు ఇప్పటికే వివిధ రూపాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రజానాట్యమండలి కళాకారుల బృందం జిల్లా అంతటా ప్రదర్శనలు ఇచ్చింది. ఇదిలా ఉండగా మూడు రోజుల ముందు నుంచే ప్రజా కళా ఉత్సవాల పేరుతో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో సాయంత్రం కళా ప్రదర్శనలు, చర్చాగోష్టిలు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 20 నుంచి 22 వరకు రాష్ట్ర ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాలలో ప్రజా కళాకారులు, కవులుగా గుర్తింపు ఉన్న ప్రముఖులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కళాకారులు, నాయకులు హాజరవుతున్నారు. అలాగే 23న జరిగే ర్యాలీలోనూ కళాకారులు భారీగా పాల్గొననునాన్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత నల్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షుడిగా జిల్లాలోని సీపీఐ ముఖ్యనేతలు, అభ్యుదయవర్గాల వారితో ఏర్పడిన ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వీధి కుక్కలతో ప్రజలు బెంబేలు

- వాహనదారులను వెంబడించి కరుస్తున్న వైనం
- చిన్నారులపై మూకుమ్మడి దాడులు
- కుక్కల దాడులతో పలువురికి గాయాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- అగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పర్చూరు/కారంచేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీధి శునకాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎటు నుంచి శునకాలు మూకుమ్మడిగా దాడులకు పాల్పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో ఏ గ్రామంలో చూసిన వీధికుక్కలు గుంపులు గుంపులుగా వందల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ప్రధాన వీధులు, రహదారుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఆయా మార్గాలలో రాకపోకలు సాగించే వారిపై మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్లపైకి రావాలంటే ప్రజలు వాహన దారులు భయపడుతున్నారు. ఎటు నుంచి వీధి శునకం తనపై దాడిచేస్తుందోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని మరీ రాకపోకలు సాగిస్తునారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఆయా మండలాల పరిధిలో గడిచిన నెల రోజుల్లో 40 మందికి పైగా ప్రజలు వీధి కుక్కల దాడిలో గాయపడ్డారంటే పరిస్థితి ఎంత తీవ్రతరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది పర్చూరుకు చెందిన ఓ వ్యక్తి వీధి శునకం దాడిలో గాయపడి రేబీస్ వ్యాధితో మృతి చెందిన ఘటన కూడా ఉంది. దీంతో వీధి శునకాల దాడిలో తమ ప్రాణాలకు ముప్పు ఉందని ప్రజలు భయపడుతున్నారు.



పర్చూరులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

ఇరువురు చిన్నారులపై దాడి

పర్చూరు పోలీసు స్టేషన్‌వీధిలో పాఠశాలకు వెళుతున్న ఇద్దరు చిన్నారుపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. చుట్టుపక్కలవారు గుర్తించి కేకలు వేసి రక్షించడంతో పెనుప్రమాదం తప్పింది. శునకాల దాడిలో గాయపడిన చిన్నారులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించారు. ఇలాంటి ఘటనలతో చిన్నారులను ఒంటరిగా బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

వాహనదారులపై వెంటాడి మరీ దాడులు

పర్చూరు - చీరాల ప్రధాన రోడ్డులో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ రహదారిలో వీధి శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంటాడి మరీ దాడులకు పాల్పడుతున్నాయి. శునకాల దాడి నుంచి రక్షించుకునే క్రమంలో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇటీవల పర్చూరుకు చెందిన టైలర్ చీరాల నుండి పర్చూరుకు వస్తున్న తరుణంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో శునకాలు వెంటపడ డంతో తప్పించుకోపోయి వాహనం అదుపు తప్పి ప్రాణాలు కోల్పో యారు. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి.

పిచ్చికుక్కలతో పెను ప్రమాదం

వీధుల్లో విచ్చలవిడిగా కుక్కలు పెరిగి పోవడం ఒక సమస్య అయితే ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పిచ్చికుక్కలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో పిచ్చిపట్టిన కుక్కలు సంచరిస్తున్నాయని ఎప్పుడు ఎలాంటి ప్రాణహాని జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి శునకాలు పెరిగిపోయి అవికాస్త వ్యాధుల బారిన పడడంతో ఇలాంటి ప్రమాద కరమైన దుస్థితి నెలకొంది ఆయా గ్రామాల వాసులు వాపోతున్నారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

ప్రైవేటు ఫైనాన్స్ ప్రతినిధులకు అధికారుల హెచ్చరిక

పంగులూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్లు రుణాల రికవరీ విషయంలో చట్టబద్ధంగా వ్యవహరించాలని తహసీల్దార్ సింగారావు, ఎస్ఐ వినోద్‌బాబులు హెచ్చరించారు. మండలం లోని బైటమంజులూరు గ్రామంలో ప్రవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి వ్యవసాయకూలీలు, కౌలు రైతులు రుణాలు తీసుకున్నారు. స్వల్ప వడ్డీపేరుతో రుణాలిచ్చిన ఫైనాన్స్ సంస్థల ఏజెంట్లు వసూళ్ల సమయంలో అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. దీంతో పనులు లేక కొంతకాలంగా ప్రవేట్ ఫైనాన్స్ సంస్థల నుండి తీసుకున్న రుణాల కిస్తీలు చెల్లించక పోవడం తో సంస్థల ఏజంట్లు తమను ఇబ్బందులు పెడుతున్నారని రుణగ్రహీతలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రుణం పొందిన వారి ఇళ్లకు తాళాలు వేయడం, సెల్‌ఫోన్ లాక్కో వడం, ఇంటిగోడలపై తాకట్టులో ఉందని రాయ డం ద్వారా తమను ఇబ్బందులు పెడుతున్నారని రుణగ్రహీతలు ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్పీ ఆదేశాల మేరకు మంగళ వారం ప్రవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు, రుణంతీసుకున్న వ్యక్తులతో తహసీల్దార్ సింగా రావు, ఎస్.ఐ.వినోద్‌బాబులు రెవెన్యూ కార్యాలయంలో విచా రించారు. ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్లు తాము ఇచ్చిన రుణాల రికవరీ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. నివాస గృహాలకు తాళాలు వేయడం, సెల్ ఫోన్లు లాక్కోవడం, ఇళ్లగోడల పై పేర్లురాయడంలాంటి చర్యలు చట్ట విరుద్ధమన్నారు. కిస్తీలు కట్టని ఎడల న్యాయస్థానాలను ఆశ్రయించాలన్నారు ఈ విచారణలో తలపనేని రామారావు, గుడిపాటి మల్లారెడ్డి, ఫైనాన్స్ కంపెనీల ఏజంట్లు, రుణగ్రహీతలు పాల్గొన్నారు.



అద్దంకిలో అమ్మకాలకు సిద్ధంగా వినాయక విగ్రహాలు

ఆందోళన కలిగిస్తున్న వర్షపు జల్లులు

- దగ్గర పడుతున్న వినాయకచవితి
- కొనుగోలుదారులు, అమ్మకందారుల్లో అలజడి

అద్దంకి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల కొనుగోలుదారులు, అమ్మకందారులను, వర్షపు జల్లులు ఆందోళన కలిస్తున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి పండుగ కావడంతో ఇప్పటికే వినాయక విగ్రహాలు అమ్మకాలకు సిద్ధం చేశారు. కొనుగోలుదారులు కూడా ముందుగానే కొనుగోలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే వారం రోజుల నుంచి వర్షపు జల్లులు పడుతుండడంతో మరో నాలుగైదు రోజులు వర్షాలు ఉన్నాయని హెచ్చరికల నేపథ్యంలో ఆందోళన మరింత పెరుగుతోంది. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డు, రామ్‌నగర్‌లలో వినాయక విగ్రహాలను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. చిన్న విగ్రహాలు మొదలు సుమారు 10 అడుగుల విగ్రహాల వరకు వివిధ సైజు లలో విగ్రహాలు ఉన్నాయి. అయితే వర్షాలు పడుతుండటంతో వినాయక విగ్రహా లను ఏర్పాటు చేసే బృందాలు ఒకింత ఆలోచనలో పడ్డారు. భారీ వర్షాలు పడితే విగ్రహాల మండపాల ఏర్పాటు ఖర్చు భారీగా పెరిగే అవకాశం ఉండడంతో ఒకింత వెనుకడుగు వేస్తున్నారు. తయారీదారులు గతం కంటే ఎక్కువ మొత్తంలో విగ్రహాలు తయారు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. అమ్మ కాలు జరగకుండా మిగిలిపోతే వచ్చే ఏడాది వరకు ఉంచాల్సి ఉంటుంది. పండుగ నాటికి వర్షాలు తగ్గితే విగ్రహాలు అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని, లేకుంటే తీ వ్రంగా నష్టపోవాల్సి వస్తుందనే ఆందోళనలో ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు సత్కారం

మార్టూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీడే సందర్భంగా మంగళవారం మార్టూరు లోని రోటరీక్లబ్ వారు ఫొటో స్టూడియోలను నిర్వహిస్తున్న ఐదుగురు ఫొటో గ్రాఫర్లను శాలువా కప్పి సత్కరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు పోలూరి సింగయ్య, భీమవరపు సుబ్బారావు, పులిపాటి సుబ్బారావు, దేవరపల్లి శి వకుమార్, షేక్ నాసర్ వలి లను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, కొర్రపాటి కాజారావు, జాష్టి సాంబశివరావు షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి

ఛైర్మన్‌గా బుచ్చయ్య ప్రమాణస్వీకారం

పంగులూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పంగు లూరు శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా జాగర్ల మూడి బుచ్చయ్య ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. వారి ప్రమాణ స్వీకారం మంగళవారం పంగు లూరులోని ఆలయ ప్రాంగణంలో నిర్వహిం చారు. ఏరియా ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆలయ కమిటీ ఛైర్మన్‌గా జాగర్లమూడి బుచ్చయ్య, సభ్యులుగా కట్టా మల్లేశ్వరి, గుడిపాటి వెంకటేశ్వర్లు, కొల్లాపద్మ, కంకణాలసుందరమ్మ, పోతుగంటి మాలిక్, సాయిదునిషా, దేవరకొండ ముత్యాలమ్మ, తిరుమలవరపు రవీంద్ర, శ్రీరామచంద్రప్రసాద్, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా కె.సాంబశివరావుతో ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, మేడసుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరి కోటయ్య, రోటరీ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ, పార్టీ నాయకులు కేవీ.సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు విశేష పూజలు

- బంతిపూలతో అమ్మవారికి అలంకరణ

మార్టూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని సంపత్‌నగర్ వాసు లు మంగళవారం మహాలక్ష్మమ్మకు విశేష పూజలు చేశారు. శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు చేయడం వారు ఆనవాయితీగా భావిస్తారు. దీనిలో భాగంగా, మంగళవారం నాగరాజుపల్లి కూడలిలోని మహాలక్ష్మమ్మ తల్లి చెట్టువద్ద సంపత్ నగర్ వాసులు ప్రత్యేక పూజలు చేశారు. బంతి పూలతో అలంకరించి, మహిళలు, పురుషులు అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు, వడపప్పు, పానకాన్ని సమర్పించారు. చీర, సారే పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం అమ్మ వారి వద్ద కాలనీ వాసులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పోగొట్టుకున్న గొలుసు అందజేత

అద్దంకి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న బంగారం గొలుసును వెతికి ఆర్టీసీ అధికారులు బాధితుడికి అందజేశారు. ఒంగోలు నగరంలోని సమతానగర్‌కు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ భారతుల సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో కలిసి అద్దంకి నుంచి ఒంగోలుకు మంగళవారం ప్రయాణించారు. ఆ సమయంలో సుబ్రహ్మణ్యం కుమార్తె 16 గ్రాముల బంగారు గొలుసును బస్సులో పోగొట్టుకున్నారు. ఒంగోలులో బస్సు దిగిన తరువాత గొలుసు పోగొట్టుకున్న విషయాన్ని గమనించారు. వెంటనే ఆర్టీసీ అద్దంకి డిపో ఎంక్వయిరీకి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో స్పందించిన డిఎం రామ్మోహనరావు బస్‌డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. బస్సులో వెతకగా బంగారం గొలుసు ఉంది. సుబ్రహ్మణ్యంను అద్దంకి పిలిపించి డీఎం రామ్మోహనరావు గొలుసును అందజేశారు. సీఆర్‌సీ కొండలు, సిబ్బంది ఉన్నారు.

అరవై శాతం మంది అనర్హులే!

(5వ పేజీ తరువాయి)

హయాంలో ఈ కేటగిరీ కింద బోగస్ సర్టిఫికెట్లను సృష్టించుకుని వందల సంఖ్యలో మంజూరు చేయించుకున్నారు. నెలవారీ దర్జాగా రూ.15వేలు లబ్ధి పొందుతున్నారు.

747 మంది అనర్హులు

ప్రస్తుత ప్రజా ప్రభుత్వ ఆదేశాలతో పరిశీలన చేపట్టిన ప్రత్యేక వైద్య బృందాలు 747 మంది ఈ పింఛన్లు తీసుకునేందుకు అనర్హులుగా తేల్చాయి. 85 శాతం వికలత్వం ఉండి పూర్తిగా మంచానికో లేదా వీల్‌చైర్‌కో పరిమితమైన వారు మాత్రమే హెల్త్ పింఛన్ రూ.15వేలు పొందేందుకు అర్హులు. కాగా సాధారణ వికలత్వం, అసలు వైకల్యం లేనివారు కూడా ఈ కేటగిరీ కింద పింఛన్ పొందుతూ ఉన్నారు. దీంతో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య బృందాలు పరిశీలన చేపట్టాయి. 747 మందిని అనర్హులుగా తేల్చాయి. వీరిలో 252 మంది ఏ కేటగిరీ కింద కూడా పింఛన్ పొందేందుకు అర్హులు కారని వైద్యబృందాలు నిర్ధారించాయి. 392 మందికి 40శాతం కంటే ఎక్కువ 85శాతం కంటే తక్కువ వికలత్వం ఉంది కాబట్టి ప్రభుత్వం వీరికి సెప్టెంబరు నుంచి దివ్యాంగుల కేటగిరీ కింద రూ.6వేల పింఛన్ ఇవ్వనుంది. మరో 103 మందికి హెల్త్ పింఛన్ పొందేందుకు ఎలాంటి అర్హత లేకపోయినా వీరికి 60 ఏళ్ల వయసు దాటిన నేపథ్యంలో వృద్ధాప్య పింఛన్ కేటగిరి కింరీ నెలకు రూ.4వేల పింఛన్ అందజేయనుంది. 252 మందికి పూర్తిగా పింఛన్‌ను నిలిపివేయనున్నారు.

దివ్యాంగుల పింఛన్లలో 3,340 మంది అనర్హులు..

జిల్లాలో దివ్యాంగుల కేటగిరీ కింద పింఛన్ పొందుతున్న వారు 32,875 మంది ఉన్నారు. వీరు ప్రస్తుతం ప్రతినెలా రూ.6వేల లబ్ధి పొందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల పింఛన్లలో కూడా భారీగా బోగస్‌లకు చోటు కల్పించారు. చిటికెన వేలు లేకపోయినా 50శాతం వికలత్వం చూపిస్తూ సదరమ్ సర్టిఫికెట్లు జారీచేశారు. దీంతో ఈ కేటగిరీ కింద పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను కూడా రాష్ట ప్రభుత్వం ఫిబ్రవరి మాసం నుంచి తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు మొత్తం 28,965 మందికి వైద్యశాలల్లో పరీక్షలు నిర్వహించగా 3,340 మంది అనర్హులుగా తేలారు. వీరికి సెప్టెంబర్ నుంచి పింఛన్ పంపిణీ నిలిపివేయనున్నారు. కాగా 1,434 మంది పరీక్షలకు హాజరుకాకుండా ముఖం చాటేశారు. ఇప్పటివరకు దివ్యాంగుల కేటగిరీ కింద పింఛన్లు పొందుతున్న వారిలో ఇంకా 6,016 మందికి వికలత్వ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం సదరమ్ పరీక్షలు తిరిగి నిర్వహించి అనర్హులుగా తేలిన వారిలో 567 మందికి 40శాతం కంటే వికలత్వం తక్కువగా ఉండటం వలన ఆ పింఛన్ రద్దుచేసి వారికి 60 సంవత్సరాల వయస్సు నిండి ఉండటంతో సెప్టెంబర్ నుంచి వృద్ధాప్య పింఛన్ నెల వారీ రూ.4వేలు అందజేయనున్నారు. మొత్తం మీద జిల్లాలో బోగస్‌లు గుట్టురట్టయి సెప్టెంబర్ నుంచి 252మంది హెల్త్ పింఛన్ పొందుతున్న వారికి, 3,340 మంది దివ్యాంగుల కేటగిరి కింద పింఛన్ పొందుతున్న వారికి కట్ చేయనున్నారు.

అర్హులు ఉంటే తిరిగి అప్పీలు చేసుకోవచ్చు

అనర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు వారంరోజులుగా సచివాలయాల ద్వారా నోటీసులు జారీచేస్తున్నారు. వారిలో అర్హులు ఉంటే నోటీసు అందుకున్న నెలరోజులలోపు సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌కు అప్పీలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. వారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులు అని నిర్ధారణ అయితే రద్దయిన పింఛన్‌ను వెంటనే పునరుద్ధరించి నగదును అందజేస్తారు.

న్యాయస్థానాల్లో పోస్టుల భర్తీకి

నేటి నుంచి పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు అదేశాల మేరకు వివిధ న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు బుధవారం నుంచి ఈనెల 24వతేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి ఒకప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టులకు 6,948 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అందుకోసం ఐదు పరీక్షా కేంద్రాల్లో మూడు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఒంగోలులోని నేషనల్ కౌన్సిల్ ఫర్‌చర్స్ సొసైటీ యాక్షన్ ఇండియా(ఒంగోలు), బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్ (ఒంగోలు), రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాల (వల్లూరు), కృష్ణచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కాలేజీ (మార్కాపురం)లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి 10.30 గంటలవరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడవ షిఫ్ట్ సాయంత్రం 4నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి పావుగట ముందు వరకే అభ్యర్థులను ఆయా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. ఆ తర్వాత వచ్చే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరగదని ఆమె స్పష్టం చేశారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, కాపీయిస్టులు, డ్రైవర్లు, టైపిస్టులు వారివారి విభాగాలకు నిర్వహించిన పరీక్షల్లో విజయవంతమైన వారిని స్కిల్ టెస్టుకు పిలువడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క విభాగానికి ఇంటర్వ్యూలు ఉండవని తెలిపారు. పరీక్షలు పూర్తిగా మెరిట్ ఆధారితంగా జరుగుతాయని, అందువల్ల ఎలాంటి పుకార్లను నమ్మవద్దని కోరారు.

గేదెల దొంగను పట్టుకున్న గ్రామస్థులు

యద్దనపూడి,(మార్టూరు) ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి 6 గేదెలను తోలుకొని వెళుతుండగా, గ్రామస్థులు అనుమానించి పట్టుకున్నారు. పర్చూరు మండలం కొల్లావారిపాలేనికి చెందిన 6 గేదెలను దొంగిలించిన వ్యక్తి వాటిని అమ్ముకోవడానికి తీసుకువెళుతుండగా అనంతవరం గ్రామస్థులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని కొల్లావారిపాలెం వాసులకు తెలియచేశారు.

జ్వరాలపై నిర్లక్ష్యం వీడాలి

- సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య

పర్చూరు, అగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జ్వరాలపై నిర్లక్ష్యం వీడాలని రెండు రోజులకు మించి జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిటెండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపధ్యంలో మంగళవారం పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలన్నారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వైద్యశాలకు వస్తున్న రోగుల్లో అత్యధికశాతం జ్వరపీడితులు నమోదు అవుతున్నట్లు తెలిపారు. అందులో టైఫాయిడ్ బాధితులు కూడా నమోదు అవుతున్నట్లు పేర్కొన్నారు. విధిగా కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు.

ఉసురు తీసిన సరదా

(5వ పేజీ తరువాయి)

శివప్రసాద్, ఎర్రయ్య పునుగోడు గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లారు. వారి బైక్‌ను, వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లను ఒడ్డున ఉంచి అక్కడే ఉన్న తెప్పను తీసి దానిలో ఎక్కారు. చెరువులో కొంతదూరం వెళ్లాక తెప్ప తిరగబడటంతో చెరువులో పడిపోయారు. ఈత రాకపోవడంతో మృతిచెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా ఒడ్డున ఉన్న సెల్‌ఫోన్లను చెరువును చూడటానికి వచ్చిన సీఎస్‌పురం ప్రాంతానికి చెందిన వ్యక్తులు తీసుకుని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. సీఎస్‌పురం ఎస్ఐ నాయక్ ఇచ్చిన సమాచారంతో కనిగిరి పోలీసులు మంగళవారం చెరువు వద్దకు చేరుకున్నారు. మత్స్యకారులను విచారించగా తమ తెప్ప నీటి మధ్యలో తిరగబడి ఉందని, వెళ్లి తెచ్చుకున్నామని తెలిపారు. దీంతో గజ ఈతగాళ్లను పిలిపించి వెతికించగా విద్యార్థుల మృతదేహాలు దొరికాయి. ఈ ఘటన స్థానికంగా కలకలం రేగటంతోపాటు మృతుల కుటుంబాల్లో విషాదచాయలు అలముకున్నాయి. డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, సీఐ ఖాజావలి, ఎస్ఐ టి.శ్రీరాం, ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రవిశంకర్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

(5వ పేజీ తరువాయి)

సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అన్ని ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో పరిశీలనకు హాజరుకావాలి

14 కమిటీల ఏర్పాటు

జిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు 14 కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి దానిలో ఒక ఎంఈవో, ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, ఒక డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు కంప్యూటర్ నైపుణ్యం ఉన్న ఒక టీచర్‌ను నియమించారు. ఒక్కో కమిటీ 50 మంది టీచర్ల సర్టిఫికెట్లను పరిశీలించనుంది. ఒక అభ్యర్థి ఎన్ని పోస్టులకు దరఖాస్తు చేసి పరీక్ష రాసి మెరిట్ సాధించి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైతే ఆ అభ్యర్థి అన్ని సర్టిఫికెట్లనూ ఆ కమిటీ పరిశీలిస్తుంది. అభ్యర్థులు ఏదైనా సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయకపోతే ఈ కమిటీ పరిశీలన సమయంలో అప్‌లోడ్ చేయిస్తుంది. పరిశీలన పూర్తయిన తర్వాత ఒక అభ్యర్థి రెండు, మూడు పోస్టులకు ఎంపికైతే వారి నుంచి ఆప్షన్ తీసుకొని ఆ పోస్టుకు ఎంపిక చేస్తారు. ఈ బృందాలోని ఎంఈవో, కంప్యూటర్ ఆపరేటర్‌కు బుధవారం విజయవాడ పోరంకిలోని మురళి రిసార్ట్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

కేంద్రం పరిశీలన

సర్టిఫికెట్ల పరిశీలనకు చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలను కేంద్రంగా ఎంపిక చేశారు. అందుకు 30 గదులు అవసరమవుతాయి. ఈ కేంద్రాన్ని మంగళవారం పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్, ఎంఈవో కిషోర్‌బాబులు పరిశీలించారు. ఈ కేంద్రంలోని వసతుల పట్ల ఆర్‌జేడీ సంతృప్తి వ్యక్తం చేశారు.



ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేధం!

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి చెక్

- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ శాఖ కమిషనర్
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో రాష్ట్రంలోని ఇతర దేవాలయాల్లోనూ పూర్తిస్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఉత్వర్వులు జారీ చేసింది. మొదటగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ఈ విధానం అమలు చేయడంతోపాటు, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఈ నిబంధనలు అమలు కానున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇప్పటికే మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ప్లాస్టిక్ కవర్లు వినియోగంపై అధికారులు కన్నెర్ర చేసి, అపరాధ రుసుములు విధిస్తున్నారు. మరోవైపు ప్లాస్టిక్ కవర్లు వినియోగంపైనా అవగాహనలు కల్పిస్తున్నారు. తాజాగా దేవాలయాల్లోనూ ప్లాస్టిక్ నిషేధానికి అవసరమైన చర్యలు చేపట్టింది.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

నిబంధనలు ఇవీ..

- 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన కవర్లు వాడకూడదు. వాటిల స్థానంలో గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులు వాడాలి.
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, బౌల్స్, స్పూన్లు స్థానంలో ఆకులతో చేసిన వస్తువులను వాడాల్సి ఉంటుంది.
- ధర్మాకోల్ కప్పులు, ప్లాస్టిక్ స్ట్రాలు, జెండాలు, బ్యానర్లు, కూడా వినియోగించకూడదు.
- ఆలయాల వద్ద ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నట్లు బోర్డులు ఏర్పాటు చేయాలి.
- అవసరాన్ని బట్టి మైక్‌లో కూడా ప్రచారం చేయాలి.
- ఆలయాల ప్రాంగణంలో ఉండే వ్యాపారులెవరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి.
- ప్రసాదాలను అరిటాకులలో సరఫరా చేయాలి.
- ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగాన్ని తగ్గించేందుకు వీలుగా ఆలయా వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలి.
- ఆలయ పరిధిలో ఆర్వో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి, అక్కడే స్టీలు గ్లాసులను వినియోగానికి అందుబాటులో ఉంచాలి.
- క్యూలైన్‌లో ఉన్న భక్తుల కోసం సహకారం అందించేందుకు వలంటీర్లను సిద్ధంగా ఉంచాలి.

జిల్లాలో చారిత్రాత్మక ఆలయాలెన్నో..

జిల్లాలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆలయాలు వందల్లోనే ఉన్నాయి. వాటిలో ప్రతిరోజూ వేల సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహిస్తుండగా, అందుకోసం ఉపయోగించే పూజా సామాగ్రి, భక్తులకు అందించే అన్న ప్రసాదాలకు ప్రతి నిత్యం ప్లాస్టిక్ వినియోగం తప్పని సరి అయింది. ముఖ్యంగా మార్కాపురంలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి ఆలయం, భైరవ కోన, నెమలిగుండం, మల్లవరం, ఒంగోలులోని ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయం, శివాలయం, శ్రీగిరి, ఆంజనేయ స్వామి ఆలయం, అయ్యప్ప స్వామి గుడి, మహాలక్ష్మమ్మ అమ్మవారి గుడి, పోలేరమ్మ గుడి, కనకదుర్గమ్మ ఆలయం, రామతీర్థం, మాల కొండ నరసింహస్వామి ఆలయం, శ్రీశైలం ఇలా ఒకటేమిటి ప్రకాశం జిల్లాలో వందల సంఖ్యలో ప్రముఖ చారిత్రాత్మక ఆలయాలు వున్నాయి. ప్రతిరోజూ వీటిలో వివిధ రూపాల్లో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వినియోగం జరుగుతుంది. దీంతో కనిపించకుండానే పర్యావకరణంపై ప్రభావం చూపుతుండగా, వీటిని అరికట్టేందుకు ప్రజా ప్రభుత్వం ఆదేశాలతో దేవదాయ శాఖ ప్రత్యేక ఉత్వర్వులు జారీ చేసింది. ఇకపై దేవాలయాల్లో ప్లాస్టిక్ నిషేదంపై నియమ నిబంధనలకు కఠినతరం చేయడంతోపాటు భక్తుల్లో అవగాహన పెంచే దిశగా అడుగులు వస్తోంది.

పటిష్టంగా అమలుకు చర్యలు

దేవాలయాల్లో పాలిథిన్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దేవదాయ శాఖ చెక్ పెట్టింది. అందులో భాగంగా ఆ శాఖ కమిషనర్ చంద్రమోహన్ ఈనెల 8న ఉత్వర్వులు జారీ చేశారు. ఇకపై ఆలయాల్లో ఇలాంటివి వినియోగించవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ కవర్లలో లడ్డూ, పులిహోర, దద్దోజనం, పొంగలి వంటి ప్రసాదాలు, పాలిథిన్ కవర్లలో కొబ్బరి కాయలు, అరటిపండ్లు, తదితర పూజ సామగ్రి వినియోగానికి ఫుల్‌స్టాప్ పడనుంది. దీంతో దేవదాయ శాఖ కార్య నిర్వహణాధికారులు, ఉద్యోగులు, ఆలయాల్లో అర్చకులు, భక్తులు, సహకరించాలని కోరుతుంది.



పోలీసుల తీరు దారుణం

- ఎస్‌ఐ, స్టేషన్ సిబ్బందిపై దళితుల ఆగ్రహం
- స్టేషన్ ఎదుట నిరసన

నాగులుప్పలపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ వివాహం చేసుకొన్న యువకుడి తరఫున వచ్చిన బంధువులపై ఎస్‌ఐ రజియా సుల్తానా, పోలీసు సిబ్బంది అకారణంగా దుర్భాషలాడి, అసభ్య పదజాలంతో దూషించడంతో బాధిత దళితులు పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు పోతవరం గ్రామానికి చెందిన యువకుడు ఇంకొల్లు మండలం కొణికికి చెందిన యువతి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు మేజర్లు కావడంతో ఇరు కుటుంబాల నుంచి రక్షణ కల్పించాలని స్థానిక ఎస్‌ఐ రజియా సుల్తానాను నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. యువకుడి తరపు బంధువులైన బాపట్ల జిల్లా చినగంజాం అంబేడ్కర్ కాలనీకి చెందిన 15 మంది యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు మంగళవారం ఉదయం వచ్చారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న చెక్కలు, ఇతర వస్తువులను తొలగించి పరిశుభ్రం చేయాలని సదరు దళిత యువకులను ఎస్‌ఐ రజియా సుల్తానా, పోలీసు సిబ్బంది ఆదేశించారు. దీంతో వారు ఆ పనిలో నిమగ్నం కాగా వారితో వచ్చిన యువకుడు సూదనగుంట ప్రేమ్‌కుమార్ పని చేయకుండా నిలబడి ఉండటంతో ఎందుకు పని చేయకుండా నిలబడ్డావు అని ఎస్ ప్రశ్నించారు. తనకు ఇటీవలే కాలు ఆపరేషన్ జరిగిందని ఎక్కువ సేపు నిలబడలేనని బరువులు కూడా మోయలేనని చెప్పగా ఆగ్రహించిన ఎస్‌ఐ రజియా సుల్తానా 'ఆడదానిలా ఆపరేషన్ చేయించుకున్నావా సిగ్గులేదా' అని హేళనగా మాట్లాడి అసభ్య పదజాలంతో దూషించి తిడుతూ పోలీస్ జీపులో బయటకు వెళ్లారు. దీంతో కంగుతిన్న యువకులు అక్కడున్న పోలీస్ సిబ్బందిని ఇదేమిటని ప్రశ్నించడంతో ఎక్కువ మాట్లాడితే మీపైనా కేసులు కడతామని బెదిరించారు. తమ బంధువుల యువకుడిని పరామర్శించేందుకు వచ్చిన తమతో పోలీస్ స్టేషన్ ఆవరణ మొత్తం పరిశుభ్రం చేయించింది కాక అమర్యాదగా, బాధించే విధంగా ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది మాట్లాడిన తీరుపై పోలీస్‌స్టేషన్ ఎదుట దళిత యువకులు, మహిళలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడికి వచ్చిన పోతవరం గ్రామానికి చెందిన బంధువులు సర్ది చెప్పి వారిని పంపించారు.



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న దళిత యువకులు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

- వాట్సప్ సందేశం ద్వారా గుర్తించిన స్నేహితులు
- ప్రేమ విఫలమే కారణమని పోలీసులు అనుమానం

ఒంగోలు క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యువకుడు లాడ్జిలో ఉరివేసుకొని మృతి చెందిన ఘటన స్థానిక పాత గుంటూరు రోడ్డులో నవభారత్ థియేటర్ ఎదురుగా ఉన్న ధరణి లాడ్జిలో మంగళవారం వెలుగు చూసింది. లాడ్జిలో ముండ్లమూరు మండలం పసుపుగల్లుకు చెందిన కీర్తి ఆంజనేయులు (25) ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఒంగోలులోని ఓ ప్రవేటు కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఆంజనేయులు ప్రస్తుతం సింగరాయకొండలో ఓ ఇన్సూరెన్స్ సంస్థలో శిక్షణ పొందుతున్నాడు. అయితే తన స్నేహితులు స్థానిక రాజీవ్ కాలనీలో ఓ గదిలో ఉంటున్నారు. మూడు రోజులు క్రితం స్నేహితులతో కలిసి కేటరింగ్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి స్నేహితులకు కనిపించలేదు. బుధవారం ఓ యువతి సెల్‌ఫోన్‌కు వాట్సప్ సందేశం వచ్చినట్లు సమాచారం. తన డెడ్ బాడీ ధరణి లాడ్జిలో ఉందని, తన చావుకు ఎవ్వరూ కారణం కాదని ఆ సందేశం సారాంశం. ఈ సందేశం ఆంజనేయులు స్నేహితుల సెల్‌ఫోన్‌కు చేరడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆంజనేయులు ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రైవేటు కళాశాలలో బికాం డిగ్రీ చదివిన ఆంజనేయులు కొన్ని సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో ఆ సబ్జెక్టులు పూర్తి చేసుకుంటూ కేటరింగ్ పనులకు వెళుతూ ఉంటాడు. అదే సమయంలో ఇన్స్యూరెన్స్ కంపెనీలో కూడా శిక్షణ తీసుకుంటున్నాడు. అతనికి మూడేళ్లుగా ఓ యువతితో పరిచయం ఉందని బంధువులు ఆరోపిస్తున్నారు. అదే సమయంలో ఆంజనేయులు ఉరివేసుకొన్న విషయం కూడా ఆ యువతి సెల్‌ఫోన్‌కే సందేశం పంపించి ఉంటాడని పోలీసులు అనుమానిసున్నారు. ప్రేమ వికటించడం కారణంగా ఆంజనేయులు మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు ఒంగోలు టూటౌన్ ఎస్సై పున్నారావు, రైటర్ వెంకటరావు సంఘటనా స్థలాని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి
- కొండపిలో జిల్లా మహాసభలు

కొండపి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహిళా చైతన్యంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ఆ సంఘ 13వ జిల్లా మహాసభలు స్థానిక పొదిలి రోడ్డులోని కల్యాణ మండపంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రమాదేవి మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు చట్టాలు తేవడంలో ఐద్వా కీలకపాత్ర పోషించిందన్నారు. అయినా మహిళల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. మహిళా చైతన్యంతోనే మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు. మహిళల రక్షణకు చట్టాలు బలంగా ఉండాలన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినా అమల్లోకి రాలేదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్, ఐద్వా నాయకులు సయ్యద్ షర్మిల, నెరసుల మాలతి, ఊసా రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, కె.ప్రసన్నలక్ష్మి, డి.శారా, కొండపి మండల కార్యదర్శి విశ్రాంతి పాల్గొన్నారు. తొలుత ఐద్వా పతాకాన్ని పెరిదేపి గ్రామానికి చెందిన నాయకురాలు ముప్పరాజు మహాలక్ష్మమ్మ ఆవిష్కరించారు. సాయంత్రం కొండపిలో మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్ర అవార్డులకు 21న ఇంటర్వ్యూలు

ఒంగోలు విద్య, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉపాధ్యాయులను ఎంపిక చేసేందుకు జిల్లాలోని టీచర్లకు ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యా డైరెక్టర్ ప్రకటించారు. రాష్ట్ర అవార్డులకు జిల్లా నుంచి 8 మంది టీచర్లను ఎంపిక చేసి రాష్ట్రానికి పంపారు. స్కూలు అసిస్టెంట్లు నలుగురు, ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఇద్దరేసి చొప్పున 8 మందిని జిల్లాస్థాయిలో వారి పనితీరుతో పాటు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపికైన ఉపాధ్యాయులకు వచ్చేనెల 5న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతలు మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందిస్తారు.

ఇసుక రవాణాదారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక రవాణాదారులను ఇసుక డిపో యజమానులు ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి ఫిర్యాదులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం గనుల శాఖ అధికారులలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని అదేశించారు. ఖనిజ అక్రమ రవాణాపై కూడా గట్టిచర్యలు తీసుకోవాలన్నారు కొత్త ఖనిజ నిల్వల ప్రదేశాలను గుర్తించి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని అదేశించారు. ఖనిజాదాయవృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో గనులు, భూగర్భశాఖ అధికారులు టి.రాజశేఖర్, ఎం.విష్ణువర్ధన్, బి.రామచంద్ర తదితరులు ఉన్నారు. అనంతరం బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేసే విధంగా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని అదేశించారు. సమావేశంలో బ్యాంకు అధికారులతో పాటు వివిధశాఖల అధికారులు ఉన్నారు.

నిరక్షరాస్యులకు దిక్సూచి ఉల్లాస్ అక్షర ఆంధ్ర

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులకు ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం ఒక దిక్సూచి లాంటిదని కలెక్టర్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్పందన హాలులో కలెక్టర్ అధ్యక్షతన ఎంపీడీవోలు, ఎంఈవోలు, డీఆర్‌డీఏ, ఏపీఎంలు, డిబ్ల్యూఎం, ఏఏపీవో, నగరపాలక కమిషనర్లు, సిటీ మిషన్ మేనేజర్లకు జిల్లాస్థాయి శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అందుకు సంబంధించి జిల్లా అధికారులందరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. 15 నుంచి 59 ఏళ్ల మధ్య నిరక్షరాస్యులైన వయోజనులకు ఉద్దేశించిన సాంకేతికత, వయోజన విద్య అందుబాటులోకి తెచ్చే కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకట నాయుడు, వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు జగన్మోహనరావు పాల్గొన్నారు.

● జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల సరఫరాలో ఎక్కడా పొరపాట్లు లేకుండా రైతులకు అవసరమైన ఎరువులను సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా అదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ దాని అనుబంధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎరువులను సకాలంలో అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధిరేటే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అందుకు అనుగుణంగా లక్ష్యసాధనకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని తెలిపారు. రైతుకు ఖర్చు తగ్గించి ఉత్పత్తి పెంచేలా వ్యవసాయశాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

నేటి నుంచి ఒంగోలులో కళా ఉత్సవాలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర మహాసభలను పురష్కరించుకొని బుధవారం నుంచి ఈనెల 24 వరకు ఒంగోలులో కళా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, చిన్నం పెంచయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.రామకృష్ణ, విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్షుడు మనోహరనాయుడు తెలిపారు. స్థానిక పీవీఆర్ హైస్కూలు అవరణలో కళా ఉత్సవాలకు కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారుల ఆటపాట, మాట కార్యక్రమం సీవీఎన్ రీడింగ్‌రూం అవరణలో సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వందేమాతరం శ్రీనివాస్, గోరేటి వెంకన్న, నల్లూరి వెంకటేశ్వర్లు, తమ్మారెడ్డి భరద్వాజ, జయరాజు, బాబ్జి, మాదాల రవి, మద్దినేని రమేష్‌తోపాటు పలువురు సినీ రంగ ప్రముఖులు, ప్రజా వాగ్గేయకారుడు ఏపూరి సోమ్మవంటి కళాకారులు పాల్గొంటారన్నారు.

అర్హులైన వారికి న్యాయ సేవలు మరింత చేరువ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారికి న్యాయ సేవలు మరింత చేరువ చేసేందుకు న్యాయసేవాధికార సంస్థ పనిచేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి అన్నారు. స్థానిక జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో మంగళవారం లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాయాధికారి భారతి మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన సైనికులు, సైనిక అధికారులు ఏదైనా న్యాయపరమైన సమస్య ఎదురైనప్పుడు లీగల్‌ఎయిడ్ క్లినిక్‌లో ఉన్న న్యాయవాదిని, న్యాయ సేవా సహాయకులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అర్హులైన వారికి ఉచితంగా న్యాయవాదిని నియమించుకొని న్యాయ స్థానాల్లో కేసును నడిపించుకోవచ్చని తెలిపారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో సభ్యులుగా న్యాయవాది ధనలక్ష్మి, న్యాయ సేవా సహాయకులు శ్రీనివాసరావు ఉంటారన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భారతి



కళా ఉత్సవ్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థుల్లో కళను ప్రోత్సహించాలి

- ఎంఈవో శార్వాణి

తర్లుపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ఉన్న కళలను అందరూ ప్రోత్సహించాలని ఎంఈవో శార్వాణి తెలిపారు. మండలంలోని కలుజువ్వలపాడు గ్రామ పరిధిలో గల జవహర్ నవోదయ స్కూల్‌లో కళాఉత్సవ్ హైదరాబాద్ క్లస్టర్ పరిధిలోని 19 నవోదయ పాఠశాలలకు రెండవరోజు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో శార్వాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రతిబింబించాలని తెలిపారు. నవోదయ స్కూల్‌లలో చదువుకునే విద్యార్థులు అన్ని రంగాలలో తమ ప్రతిభను చూపించి ఉన్నతస్థాయిలో రాణించాలని కోరారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నవోదయ విద్యార్థులు తమ కళానత్యంతో అలరించారు.

స్వామిత్వ వివరాలను తెలియజేయాలి

● డీపీవో వెంకటనాయుడు



ముప్పవరంలో స్థానికుడితో మాట్లాడుతున్న డీపీవో వెంకటనాయుడు

కొండపి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో స్వామిత్వ కింద నమోదు చేస్తున్న కొలతలను ఏరోజుకారోజు జిల్లా పంచాయతీ కార్యాలయానికి తెలియజేయాలని డీపీవో జి.వెంకటనాయుడు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఆయన మండలంలోని వెన్నూరు, చోడవరం, ముప్పవరం గ్రామాల్లో పారిశుధ్య, స్వామిత్వ కార్యక్రమాలను మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. చోడవరం, ముప్పవరం గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో అంజలీదేవి, ముప్పవరం, వెన్నూరు, చోడవరం, కొండపి పంచాయతీ కార్యదర్శులు రత్నప్రభ, కృష్ణ, సాంబయ్య, ఉన్నం రామ్మోహన్ ఉన్నారు.

ఓక్లాండ్ యూనివర్సిటీతో క్విస్ ఒప్పందం



ఒప్పందపత్రాలను ప్రదర్శిస్తున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు విద్య, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని మిచిగాన్ లోని ఓక్లాండ్ యూనివర్సిటీతో ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఓక్లాండ్ యూనివర్సిటీలోని డెసిషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సైమన్‌విభాగం ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ విజయన్‌సుకుమారన్‌లు ఒప్పందం పత్రాలపై సంతకాలు చేసి వాటిని మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో సూర్యకల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలో అధునాతన విద్యను అందించేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. క్విస్ కళాశాల విద్యార్థులు ఓక్లాండ్ యూనివర్సిటీలో జరిగే బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌లలో పాల్గొనేందుకు వీలు కలగడంతో పాటు అంతర్జాతీయస్థాయిలో కోర్సుల సర్టిఫికెట్లు అందజేస్తారని, తద్వారా గ్లోబల్‌లో కూడా గుర్తింపు వస్తుందని కళాశాల ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు జాఫర్ పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మతల్లి తిరునాళ్ల



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలో జరుగుతున్న పోలేరమ్మతల్లి తిరునాళ్లను పురస్కరించుకుని మంగళవారం దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రెండురోజులపాటు జరిగే తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలిరోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పోలేరమ్మతల్లికి పొంగళ్లను సమర్పించిన అనంతరం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరిబాబు, టీడీపీ నాయకులు వివరం గోవిందు, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, కరిచేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవికి ఎమ్మెల్యే పరామర్శ

చీమకుర్తి: చీమకుర్తి పట్టణానికి చెందిన ప్రజాకవి పిన్నిక శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ సతీమణి, మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు విజయమ్మ మృతి చెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ ప్రమాద సంఘటనపై శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు, కమిటీ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక గుప్తాస్ స్క్వేర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మహ్మద్ జహంగీర్, డాక్టర్ కె.వెంకటహరీష్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దగ్గుబాటి వెంకట్రావు, సెక్రటరీ దొడ్డా చంద్రశేఖర్, ట్రెజరర్ నబీరసూల్, గౌరవ సలహాదారు ఉదయ్ హరి, ఉపాధ్యక్షులు ఉప్పుటూరి చంద్రశేఖర్, ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి



ప్రజలకు సూచనలు ఇస్తున్న సీఐ సోమశేఖర్

పొన్నలూరు, ఆగష్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సోమశేఖర్ సూచించారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. మంగళవారం ఆయన పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం, వెంకుపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఉత్సవాలు, ఊరేగింపులకు సంబంధించి కమిటీ సభ్యులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు. హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై అనూక్ కూడా ఉన్నారు.

రాహుల్‌గాంధీకి మద్దతుగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కొండపి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం దొంగ ఓట్లతో గద్దెనెక్కిందని, వెంటనే గద్దె దిగాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా కొండపిలో ఆ పార్టీ కార్యకర్తలు మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ బొమ్మ నుంచి మండల కార్యాలయాల వరకూ ఇది సాగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీలో డీసీసీ ఉపాధ్యక్షుడు కాకర్లపూడి వేణుగోపాలరావు, పార్టీ జరుగుమల్లి, టంగుటూరు మండలాల అధ్యక్షులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, బడుగు శశికుమార్, నాయకులు గంగుల పోలయ్య, కమలాకర్‌రావు, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయం.. గుండెల్లో భయం..!

● అధ్వానంగా శానంపూడి రోడ్డు
● అడుకో గుంత.. గజానికో గొయ్యి
● హడలెత్తిపోతున్న ప్రయాణికులు





గుంతలమయంగా మారిన శానంపూడి రోడ్డు

సింగరాయకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శానంపూడి రోడ్డు అధ్వానంగా తయారైంది. అడుకో గుంత.. గజానికో గొయ్యితో ప్రయాణికులను హడలెత్తిస్తోంది. సింగరాయకొండ జాతీయ రహదారి నుంచి శానంపూడి వరకూ సుమారు 4 కి.మీ ఉన్న తారురోడ్డు పూర్తిగా శిథిలమైంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. రాళ్లపైకి తేలి అత్యంత ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షానికి రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో బారీగా వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆ వెంటనే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిర్మాణ పనులు ప్రారంభించ లేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఆపార్టీ తరఫున పెత్తనాన్ని చెలాయించిన నాయకులు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించారు. వైసీపీ అవలంబించిన నిర్లక్ష్య ధోరణి వలనే అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తా - మంత్రి డాక్టర్ స్వామి

శానంపూడి రోడ్డు నిర్మాణానికి 2018లోనే నిధులు మంజూరు చేయించా. ఆ తర్వాత కొద్ది నెలల్లోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభం కాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణాన్ని పూర్తిగా అటకెక్కించింది. ప్రస్తుత ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత టీడీపీ హయాంలో మంజూరై ఆగిపోయిన రోడ్లను పునఃప్రారంభించాలని కాంట్రాక్టర్లను ఆదేశించింది. త్వరలో శానంపూడిరోడ్డుతో పాటు పెండింగ్‌లో ఉన్న రహదారులకు నిధులు మంజూరు చేయించి త్వరతగతిన పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటాం.

నగర అభివృద్ధి పనులు మూడు నెలల్లో పూర్తి

● ఎమ్మెల్యే దామచర్ల
● పెండింగ్ బిల్లులు మంజూరుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని, ఇందుకోసం కాంట్రాక్టర్లు సహకరించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. మంగళవారం ఒంగోలులోని కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని, అయితే బిల్లులు ఆలస్యం పేరుతో కొందరు పనులు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. టెండర్లు పిలిచి అగ్రిమెంట్ పూర్తయిన వారు కూడా పనులు ఎందుకు చేపట్టడం లేదన్నారు. మూడు నెలలోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తెలిపారు. అందరూ ముందుకొచ్చి పనులు చేయాలని, లెస్ టెండర్లు వేసి ఇంకా పనులు చేయపోవడం పట్ల దామచర్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 415 పనులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. కార్పొరేషన్‌కు రూ.45 బకాయిలు రావాల్సి ఉందని, అలాగే ప్రభుత్వం నుంచి మరి కొన్ని నిధులు రాబడతామని, పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం అద్దంకి బస్టాండ్, ఊరచెరువు, పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను దామచర్ల పరిశీలించారు. త్వరితగతిన నాణ్యత లోపం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎండీ ఐసయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో 10, 23 డివిజన్ శ్రేణులతో దామచర్ల సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు.

డిగ్రీ అడ్మిషన్లకు నేడు నోటిఫికేషన్

ఒంగోలు విద్య, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేయనుంది. దరఖాస్తు విధానం, అడ్మిషన్లకు సంబంధించిన విధివిధానాలను కూడా జారీ చేయనుంది.

పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాలి

● సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల్లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పాసుపుస్తకాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియలో పొరపాట్లు లేకుండా జేసీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, అటవీ భూములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, అధికారులు వరకుమార్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై పోలీస్ నిఘా



వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ రజియాసుల్తానా

నాగులుప్పలపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని ఎస్ఐ రజియాసుల్తానా పేర్కొన్నారు. నిఘాలో భాగంగా మండలంలోని తిమ్మసముద్రంలోని గ్రామంలోని రౌడీషీటర్ల నివాసాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. సదరు వ్యక్తుల జీవన విధానాలను అడిగి తెలుసుకొన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పొన్నలూరు, ఆగష్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. 33 బృందాలుగా ఏర్పడి కనెక్షన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 21 మందిని గుర్తించి రూ.2.68 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతి కన్నా ఎక్కువ కేటగిరీలో కరెంటు వాడుకుంటున్న 12 మందికి రూ.1.05లక్షలు, తక్కువ లోడ్ తీసుకుని ఎక్కువ వినియోగిస్తున్న సర్వీసులకు 1.27లక్షలు జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఈఈ హైమావతి, ఈఈ నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని ప్రకటించాలి



చర్చలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. స్థానిక రిమ్స్ మెడికల్ కాలేజీలో మంగళవారం రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, రంగారెడ్డి, ఎం.శ్రీనివాసరావు, సురేష్‌బాబు, ప్రసన్న, ఏసురత్నం, శ్రీనివాసులు, అంకబాబు, విజయలక్ష్మి, శ్రీనివాసయాదవ్, బాబురావు, రాజేష్, కార్తీక్, దినకర్, ప్రభావతి, చాందిని, రమేష్‌బాబు, లావణ్య, పద్మలత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో సమన్వయంగా పని చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ విషయంలో ఎంపీడీవోలు కీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీవోలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. మండలాల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డ్వామా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, పంచాయతీశాఖల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రతి బుధవారం ఎంపీడీవోల అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన సమావేశ మినిట్స్ వివరాలను తనకు పంపించాలని చెప్పారు. ఎంపీడీవోలు ప్రతివారం నాలుగు సచివాలయాలను తనిఖీ చేయాలన్నారు. తమ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పథకంలో పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చినందున మొక్కలు నాటేందుకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను వినియోగించుకోవాలన్నారు. నీటి సంరక్షణ నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు చిరంజీవి, జోసెఫ్‌కుమార్, వెంకటనాయుడు, బాలశంకరరావు, నారాయణ, నిషాద్ పాల్గొన్నారు.

డిజిటల్ మైక్రోక్రెడిట్ ప్లాన్స్ త్వరగా ఆమోదించాలి

ఒంగోలు(రూరల్): డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్స్ త్వరగా బ్యాంక్‌లు ఆమోదించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం డీఆర్‌డీఏ మహిళా సంఘాలకు రుణాలు మంజూరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ నారాయణ మాట్లాడుతూ గతంలో రుణాలు పొందటానికి గ్రూపులోని సభ్యులు అందరూ సంతకాలు పెట్టిన తరువాత బ్యాంకులు ఇచ్చేవన్నారు. ఇప్పుడు బయోమెట్రిక్ వేలిముద్ర వేయటం ద్వారా గ్రూపు సభ్యులు తమ అంగీకారం బ్యాంక్‌లకు తెలియజేయాలని, దీంతో మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌ను బ్యాంక్‌లు ఆమోదించటంలో కొంత జాప్యం జరుగుతుందన్నారు. దీని నివారణకు వచ్చే నెలలో ఎడిట్ ఆప్షన్లు ఇస్తారని చెప్పారు.

అనంతరం కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ మహిళల రుణాలు ఇవ్వటానికి డిజిటల్ అప్రూవల్‌ను బ్యాంకులు ఇవ్వాలని ఆదేశించారు. డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌పై బ్యాకులు మహిళలకు గురు, శుక్రవారాలలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమేష్, బ్యాంక్ రీజనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ఏర్పాటు అభినందనీయం

● ప్రజా వాగ్గేయకారుడు జయరాజ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయరాజ్, నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో విజయవాడ బుక్ ఫెస్టివల్ పుస్తక ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ ప్రజా వాగ్గేయకారులు జయరాజ్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పీవీఆర్ పాఠశాల మైదానం జరిగిన పుస్తక ప్రదర్శనలో కళా రంగం-ప్రజలపై ప్రభావం అనే అంశంపై చర్చ నిర్వహించారు. అనంతరం మహీధర నళినీ మోహన్ రచించిన రెండు ఖగోళ శాస్త్ర సంబంధ పుస్తకాలైన రాకెట్ కథ, నక్షత్ర వీధుల్లో భారతీయుల పాత్ర అనే పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమానికి చంద్ర నాయక్ అధ్యక్షత వహించగా, ప్రజా నాట్యమండలి నాయకులు చిన్నం పెంచలయ్య, రామకృష్ణ, నూకతోటి శరత్, విశాలాంధ్ర పబ్లిషర్ జనరల్ మేనేజర్ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహన్‌నాయుడు పాల్గొన్నారు. కాగా ఐదవ రోజు పుస్తక ప్రదర్శన వీక్షించేందుకు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, పలు పాఠశాల చిన్నారులు విచ్చేసి తమ భవిష్యత్ విజ్ఞానం కోసం అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేశారు. దీంతో పుస్తక ప్రదర్శన కేంద్రం సందడిగా కనిపించింది.

పెన్షన్ల తొలగింపుపై అప్పీలుకు అవకాశం

నాగులుప్పలపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనర్హులుగా నోటీసులు అందుకొన్న దివ్యాంగ పెన్షన్‌దారులు తాము అర్హులమని భావించినట్లయితే తమ వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు, ఇతర ఆధారాలతో అర్జీలను అందజేయాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు అర్జీలను పరిశీలించిన అనంతరం అర్జీదారులు తమ పత్రాల పరిశీల కోసం హాజరుకావాల్సిన వివరాలతో మరో నోటీసు ద్వారా తెలియజేస్తామన్నారు. వివరాలకు గ్రామ వార్డు సచివాలయాలను సంప్రదించాలని ఆయన కోరారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్ఐ

నాగులుప్పలపాడు, ఆగష్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక మండపాలకు నిర్వాహకులు ముందస్తుగా అన్ని అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ రజియాసుల్తానా సూచించారు. మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ రోడ్లపై మండపాలు ఏర్పాటు చేసి జనజీవనానికి ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేని ప్రదేశంలో మండపాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. విగ్రహాలు నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

అన్నదాత సుఖీభవ నగదు జమకాని వారు రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలి : ఏవో



మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హులై ఉండి నగదు జమకాని వారు ఈ నెల 20వ తేదీలోగా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఏవో పోతినేని వెంకట్రావు సూచించారు. మంగళవారం ఈదుమూడి, ముప్పాళ్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వెంకట్రావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతులకు తొలి విడతగా రూ.7వేల నగదును జమ చేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉండి నగదు జమ కాని వారు అర్జీలను గ్రామ వ్యవసాయ సహాయకునికి అందించాలని చెప్పారు. మండల పరిధిలో ఎరువులు కొరత లేకుండా అన్ని సొసైటీలు, రైతు సేవాకేంద్రాలలో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టించినా, నల్లబజారుకు తరలించి అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని, ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కనిగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని గొల్లపల్లి వద్ద జరిగింది. చినిర్లపాడుకు చెందిన మహేష్(19) డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సీఎస్‌పురంలో పెళ్లి వేడుక ముగించుకుని కనిగిరికి డీజే వాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో వాహనం కుదుపులకు రోడ్డుపై పడటంతో తలకు గాయం కాగా ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరామ్ తెలిపారు.

జగదాంబకు శ్రావణమాసం పూజలు



ప్రత్యేక అలంకరణలో జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జగదాంబ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వరుణ్‌తేజ శర్మ, ఆంజనేయశర్మలు జగదాంబ మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, అర్చనలు చేశారు. శివగౌరి కలశ పూజా కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

గాయత్రీమాత గుడిలో గీతాపారాయణం

గిద్దలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాయత్రీమాత దేవాలయంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా సామూహిక గీతాపారాయణం నిర్వహించారు. మహిళ భక్తులు పెద్ద ఎత్తున హాజరై గీతాపారాయణంలో పాల్గొన్నారు. అనంతరం గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమ కొళాయిలను క్రమబద్ధీకరించుకోవాలి

పొదిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నీటి కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి కోరారు. గతంలో నూతన కనెక్షన్ మంజూరు చేయడానికి రూ.10,500 వేలు ఫీజు ఉండేదన్నారు. కొళాయి ఫీజును తగ్గించాలని పట్టణ ప్రజలు నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుతం కొళాయిల ఫీజును రూ.6వేలకు తగ్గించినట్లు తెలిపారు. క్రమబద్ధీకరించుకోని కనెక్షన్లను తొలగిస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పొదిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కంభాలపాడు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... మల్రిపూడి గ్రామానికి చెందిన బలసాని మల్లికార్జున చినారికట్ల పనిమీద వెళ్లి తిరిగి మోటార్‌బైక్‌పై స్వగ్రామం వస్తున్నాడు. ఈక్రమంలో కంభాలపాడు గ్రామ సమీపంలో ఉన్న స్పీడుబ్రేకర్ వద్ద పెద్దగుంత నీటితో నిండి ఉంది. గమనించని మల్లికార్జున్ బైక్ ముందుటైర్ గుంతలో పడటంతో రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. 108 సిబ్బంది బాధితుడిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు 5 లక్షల రూపాయల ఫీజు, 10వేల రూపాయల ప్రాసెసింగ్ చార్జీలతో కలిపి మొత్తం 5.10 లక్షల రూపాయల చలానా లేదా డీడీ రూపంలో చెల్లించాలని, ఈ మొత్తాన్ని తిరిగి ఇవ్వబోరని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. 28వ తేదీన కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. లైసెన్స్ పొందిన వారు ఏడాదికి 35 లక్షల రూపాయల ఫీజును 6 వాయిదాలలో చెల్లించాలని, ఏటా 10 శాతం మేర లైసెన్సు ఫీజు పెరుగుతుందని, లైసెన్సు కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోసం టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఇ.టి.స్వామిదాస్‌ను గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసినట్లు స్థానిక కల్వరి ప్రసన్న మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ జగన్‌పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవుల సమస్యలను వివరించారని పేర్కొన్నారు.

ఘనంగా అంకాలమ్మ తిరునాళ్ల

కంభం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కంభంలోని తెలుగు వీధిలో శ్రీ మాదాసు అంకాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన అమ్మవారి గ్రామోత్సవంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు.

పొంగిన తీగలేరుతో తిప్పలు

దాని పరివాహక ప్రాంతంలో తగ్గని వరద నీటి ప్రవాహం

మూడురోజుల నుంచి పలుచోట్ల నిలిచిన రాకపోకలు

పెద్దదోర్నాల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు మండలంలోని నీటి వనరులకు చేరుతోంది. అటవీ సమీప గ్రామమైన ఎగువ చెర్లోపల్లి చెరువు పూర్తిగా నిండి అలుగు ద్వారా ప్రవహిస్తోంది.



నిండిన గంటవానిపల్లె చెరువు

అక్కడ నుంచి తీగలేరు వాగులోకి వరదనీరు పోటెత్తడంతో చెర్లోపల్లి బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తోంది. దీంతో రెండు రోజులుగా మూడు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. తీగలేరు వాగు నుంచి గంటవానిపల్లె చెరువుకు పుష్కలంగా నీరు చేరింది. అక్కడనుంచి అలుగు ద్వారా నీటి ప్రవాహం మళ్లీ తీగలేరుకు చేరి అక్కడ్నుంచి గంటవానిపల్లె చప్టాపై ప్రవహిస్తోంది. దీంతో ఆ గ్రామానికి రాకపోకల సమస్య ఏర్పడింది. మళ్లీ ఆ వరద నీరు తీగలేరు వాగు ద్వారా చిన్నదోర్నాల బ్రిడ్జిపై ప్రవహిస్తోంది. దీని కారణంగా మార్కాపురం-దోర్నాలకు కొన్ని గంటలపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలో వాగులు పొంగుతున్నా.. చాలా గ్రామాలలో చిరుజల్లులే కురిశాయి. దీంతో కొందరు పత్తి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఏప్రిల్, మేలో సాగు చేసిన పత్తి తీతల దశలో ఉన్నాయి. వారం నుంచి ముసురు జల్లులు పడుతుండడంతో పత్తి కాయలు కుళ్లిపోతున్నాయని, తీతలకు వచ్చిన పత్తి నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మార్కాపురం-దోర్నాల రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

పరవళ్లు తొక్కుతున్న గుండ్లకమ్మ

రాచర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవుల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ నది పొంగి పరవళ్లు తొక్కుతోంది. నల్లమల అటవీ ప్రాంతంలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. దీంతో గుండ్ల బ్రహ్మేశ్వరం నుంచి నెమలిగుండ్ల రంగస్వామి గుండానికి వరద నీరు భారీగా చేరుతోంది. వరద నీరు అధికం కావడం వలన రంగస్వామి గుండం నుంచి చిన్నగానిపల్లి సమీపంలోని రామన్న కత్తువకు నీరు చేరి పొంగి పొర్లుతోంది. అక్కడ నుంచి వరద నీరు గుండ్లకమ్మ నది ద్వారా చోళవీడు, అక్కపల్లి, సురభేశ్వరకోన, తురిమెళ్ల గ్రామాల మీదుగా కంభం చెరువుకు చేరుతోంది. వరద నీటి ద్వారా కంభం చెరువు కళకళలాడుతోంది. కంభం చెరువుకు నీరు భారీగా చేరుతుండడంతో తాగు, సాగునీరుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు



సప్లై ఛానల్‌ను పరిశీలిస్తున్న డీఈఈ రామారావు

చెరువుల్లో నీటి నిల్వల సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలి

రాచర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : చెరువుల్లో నీటి నిల్వల సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్. రామారావు చెప్పారు. మండలంలోని చిన్నగానిపల్లి, ఆకవీడు, అచ్చంపేట గ్రామాలకు సంబంధించిన చెరువులను మంగళవారం ఆయన పరిశీలించారు. భారీగా కురుస్తున్న వర్షాలకు నీరు చెరువులకు ఉధృతంగా చేరుతోందని, చెరువుల్లో నీటి నిల్వకు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు రైతులకు సూచించారు. చిన్నగానిపల్లె చెరువు సప్లై ఛానల్ తెగిపోయి చెరువు నీరు వృథాగా పోతోందని, కాలువ వెంట చిల్లకంప పెరిగి కాలువకు గండ్లు పడుతున్నాయని రైతులు తెలపడంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆయన వారికి తెలిపారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, రైతులు కరిపిరెడ్డి శివారెడ్డి, రమేష్, రమణ, బాలగురవారెడ్డి, జయసింహ, లక్ష్మిరెడ్డి, జమాల్ పాల్గొన్నారు.

అవీఇవీ

ఫొటోగ్రఫీ జీవితాన్ని చూపే దర్పణం



అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రఫీ అనేది జీవితాన్ని చూపే దర్పణం అని సీఐ సుబ్బారావు చెప్పారు. ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా మార్కాపురం ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్‌లో అన్నప్రసాద వితరణ కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి సీఐ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది ఒక కల అది మన జీవితంలోని ముఖ్యమైన క్షణాలను బంధించి శాశ్వతంగా నిలిపి ఉంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు బొంతా వెంకటేశ్వర్లు, బాబీ, ఓబయ్య, నాగరాజు, నారాయణరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

గిద్దలూరులో...

గిద్దలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మానసిక దివ్యాంగ పాఠశాలలో గిద్దలూరు తాలూకా ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. లూయిస్ డాగోరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి మానసిక దివ్యాంగ విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం బియ్యం, నిత్యవసర వస్తువులను అందజేశారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే లాంటి విద్యలు ఎంతో అవసరం అని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి చెప్పారు. స్థానిక పాఠశాలలో కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థినులను మంగళవారం అభినందించారు. సిద్ధార్థ కరాటే అకాడమీ ఒంగోలులో నిర్వహించిన కరాటే పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని తంగిరాల సౌజన్య, పిన్నిక వెంకట కౌసల్య, వీవీ కళ్యాణి ప్రతిభ చూపారన్నారు. పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర కుమార్, పాల్గొన్నారు.

పాఠశాలలకు క్లీనింగ్ కెమికల్స్ పంపిణీ

కంభం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ క్లీనింగ్ కెమికల్స్ పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో అబ్దుల్ సత్తార్ చెప్పారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్, ఫ్లోర్ క్లీనింగ్, ఎయిర్ ఫ్రెషనర్స్ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలకు అవసరమైన క్లీనింగ్ కెమికల్స్ అందిస్తున్నామని, పాఠశాలల్లో పారిశుధ్య అవసరాలకు వాటిని వినియోగిస్తూ సద్వినియోగం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వీరనారాయణ, సుబ్రహ్మణ్యం, రవి, కిషోర్ రెడ్డి, గోవిందరావు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు గడువు నేటితో ముగింపు

రాచర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు గ్రీవెన్స్ ద్వారా నమోదు చేసుకోవడానికి బుధవారం చివరి తేదీ అని ఏవో షేక్ మహబూబ్ బాషా చెప్పారు. జేపీచెరువు, చిన్నగానిపల్లి గ్రామాలలో మంగళవారం ఆయన రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, వీపీఏలు రమణ, నూర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు పరిశుభ్రతే ముఖ్యం

రాచర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని గిద్దలూరు సబ్ యూనిట్ అధికారి జీ వెంకటేశ్వర్లు చెప్పారు. రాచర్ల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. పాఠశాలలోని సైడ్ కాలువలు, మురికిగుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమల నివారణకు ఎబెట్ ద్రావకాన్ని పిచికారీ చేయించారు. వర్షాకాలం కావడం వలన సీజనల్ వ్యాధులు సోకుతాయని, జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేరీ మంజుల, వైద్య సిబ్బంది ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు బురదజల్లే రాజకీయాలు మానుకోవాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మార్కాపురం, తర్లుపాడు మండలాల పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తల్లికి వందనం అమలు చేయడంలేదని వైసీపీ నాయకులు నానాయాగీ చేశారన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వంకంటే మిన్నగా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ప్రజా ప్రభుత్వం రూ.13 చొప్పున అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. అదే విధంగా అన్నదాత సుఖీభవపైనా దుష్ప్రచారం చేశారని, ఇదే నెలలో అన్నదాత సుఖీభవతోపాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం స్త్రీ శక్తి పథకం ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీకి ఏం విమర్శలు చేయాలో కూడా పాలుపోక ఫేక్ వీడియోలు, వార్తలతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారన్నారు. 75 ఏళ్ల వయస్సులో కూడా సీఎం చంద్రబాబు యువకునిలా రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు మిగిల్చి వెళ్లినా ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతుంటే విమర్శలు చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. అంతేకాక అమరావతి మునిగిపోతోందని, పడవలు తిరుగుతున్నాయని గోబెల్స్ ప్రచారం మొదలు పెట్టారన్నారు. ఈ నెల 25న మార్కాపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉన్నందున రెండు మండలాల నుంచి కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా రావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, మార్కాపురం ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విభిన్నప్రతిభావంతులైన విద్యార్థుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. స్థానిక ఆర్టీటీ ఆడిటోరియంలో మంగళవారం విభిన్నప్రతిభావంతులైన విద్యార్థులకు శారీక పరీక్షలు నిర్వహించేందుకు స్క్రీనింగ్ సెంటరును ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతులైన విద్యార్థుల కోసం నెలకు 6 వేలు పింఛన్ల పంపిణీతో పాటు, వీరికి విద్య కోసం ప్రత్యేక పాఠశాలలు, భవిత సెంటర్లు ఏర్పాటు చేసి ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారన్నారు. వీరికి ఉపకరణాలు పంపిణీ చేసేందుకు స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్క్రీనింగ్‌లో 119 మందికి ప్రత్యేక ఉపకరణాల కోసం పరీక్షించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ఆంజనేయులు అధ్యక్షత వహించగా, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంఈవోలు మస్తాన్‌నాయక్, ఇందిర ప్రసాదు, రాజశేఖరరెడ్డి, డాక్టరు అంకరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఏవో

18.75 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత

ఎర్రగొండపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం పట్టణంలో భవానీ ట్రేడర్స్, వెంకటరమణ ట్రేడర్స్, వెంకటలక్ష్మీ ట్రేడర్సుకు చెందిన ఎరువుల దుకాణాలను మంగళవారం సాయంత్రం మండల వ్యవసాయాధికారి కె. నీరజ ఆకస్మిక తనిఖీచేశారు. స్టాక్ రిజిస్టర్లును పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడంలేదంటూ 18.75 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ స్టాఫ్‌సేల్ విధించినట్లు ఏవో నీరజ తెలిపారు. కంపెనీ ఓ ఫారంలు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అందజేసిన తర్వాత స్టాఫ్ తొలగించి అమ్మకాలకు అనుమతి ఇస్తామని ఆమె చెప్పారు.

ఖరీఫ్‌కు ఎరువుల కొరత లేదు

పెద్దారవీడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల కొరత లేదని ఏవో లక్ష్మీనారాయణ చెప్పారు. మండలంలోని వైడీపాడులో సర్పంచ్ నాగరాజు అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. శ్రీసాయికృష్ణ ఏజెన్సీస్, శ్రీరాఘవేంద్ర ఏజెన్సీస్‌లు ఫారం-ఓ చూపించని కారణంగా సుమారు 18,090 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకట నారాయణరెడ్డి, వీఏఏ రవి, ఏఈవో సునీల్‌నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన 16వ వార్డు ప్రజలు

మార్కాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల నుంచి వెంటాడుతున్న సమస్యను మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పరిష్కరించడంతో స్థానిక 16వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన్ను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. భగత్‌సింగ్ కాలనీలోని చెన్నకేశవస్వామి మాన్యంలో నివాసముంటున్న వార్డు ప్రజలకు సుమారు మూడు దశాబ్దాలుగా ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం కాలేదు. కానీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని మాన్యంలో నివాసముంటున్న వారికి పట్టాలు మంజూరు చేయించారు.

దీంతో ఆ వార్డు ప్రజలు సంతోషంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షితబాబీ, వార్డు ఇంచార్జ్ చల్లగాలి విద్యాసాగర్, నాయకులు కాయకాకుల తిరుపతయ్య, తిరుమలశెట్టి శివ, జానపాటి గంగయ్య, జక్కి వెంకటేశ్వర్లు, పంది శ్రీను, చెవుల పోల్‌రాజు, గోమసాని చిన్నవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముఖాముఖి

ఎరువుల కొరత లేదు!

కె.రాధ, మండల వ్యవసాయాధికారి, దర్శి



ప్రశ్న: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మీ దృష్టికి వచ్చిందా?

జవాబు: ఎరువులు కొరత లేదు. యూరియాను గడ్డిసాగుకు వాడటం వల్ల కొరత ఏర్పడుతుంది. నిబంధనల ప్రకారం యూరియాను పైర్ల సాగుకు మాత్రమే వినియోగించుకోవాలి. సబ్సిడీ పోను బస్తా యూరియా రూ.266కి రైతులకు అందుతుంది. ఈవిషయాన్ని రైతులు గుర్తించి పంటలకు మాత్రమే వినియోగించుకోవాలి.

ప్ర: అన్నదాత సుఖీభవ పథకం రైతులందరికి అందిందా?

జ: మండలంలో 10972 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమ అయింది. ఇంకా 1200 మందికి అందవలసి ఉంది. ఆధార్‌లింక్, మ్యుటేషన్‌లు, ఫ్యామిలీ సర్వేరిపోర్ట్ లేనందున పెండింగ్‌లో ఉంది. రికార్డులు క్రమబద్ధీకరించుకునేందుకు గడువు పొడగించినందున పథకాన్ని వర్తింపు చేసుకోవాలి.

ప్ర: వరి సాగుకు నీటి ప్రణాళిక ఇచ్చారా?

జ: వరిసాగుకు నీటి పంపిణీ ప్రణాళిక ఇరిగేషన్‌శాఖ అధికారుల నుంచి అందలేదు. సాగర్ ఆయకట్టు రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మండలంలో 18వేల ఎకరాల వరి సాగు సాధారణ విస్తీర్ణం ఉంది.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

దొనకొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి సీహెచ్ గురుమూర్తి అన్నారు. మంగళవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న ఒంగోలులో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ .కరుణానిధి, కూరేటి బాలయ్య, బి.మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి



ఆంజనేయులు (ఫైల్)

ముండ్లమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పసుపుగల్లు గ్రామానికి చెందిన కీర్తి శ్రీనివాసులు, కోటేశ్వరమ్మల రెండవ కుమారుడు కీర్తి ఆంజనేయులు(22) డిగ్రీ పూర్తిచేశాడు. మంగళవారం ఉదయం ఒంగోలులోని ఒక లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. సోమవారం ఒంగోలు వెళ్లిన ఆయన లాడ్జిలో ఉరి వేసుకొని మృతి చెందాడు. లాడ్జీ యజయానులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మృతుడి సెల్ ఫోన్‌లో నెంబర్ల ఆధారంగా పోలీసులు పసుపుగల్లులోని తల్లిదండ్రులకు తెలియజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పసుపుగల్లుకు తీసుకువచ్చారు. చేతికి అంది వచ్చిన కుమారుడు చని పోవటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జాబు కార్డుదారులందరికీ పనులు కల్పించాలి

పామూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జాబుకార్డు కలిగి ఉన్న వారందరికి ఉపాధి పనులు కల్పించాలని టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ ప్రధానకార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అన్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ పంచాయతి కార్యాలయంలో మంగళవారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి 2025 మార్చి నెల వరకు జరిగిన ఉపాధి హామీ పనుల ఆడిట్‌కు సంబంధించి ఈసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో బి. మాల్యాద్రి, పంచాయతి కార్యదర్శి కృష్ణమూర్తి, కోటపాటి రాజ, ఫీల్డ్ అసిస్టెంట్ ఆవుల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన ఉప్పలపాటి

పామూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ కామేపల్లి సీతారామయ్యను పామూరు సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు మంగళవారం ఒంగోలులోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉప్పలపాటిని సీతారామయ్య అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో

పడకేసిన పారిశుధ్యం

- స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు తూట్లు
- పట్టించుకోని అధికారులు



దర్శి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో అడవిలా పెరిగిన పిచ్చిచెట్లు



మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పెరిగిన పిచ్చిచెట్లు

దర్శి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్యం లోపించింది. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పిచ్చిచెట్లు దట్టంగా పెరిగి విషపురుగులు సంచరిస్తున్నప్పటికి అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ పేరుతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచిస్తున్నప్పటికి అధికారులకు చెవికెక్కటం లేదు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో పిచ్చి చెట్లు చిట్టడవిని తలపిస్తున్నాయి. అక్కడ మురుగునీరు కుంటలా నిల్వ ఉంది. అలాగే, మండ పరిషత్ కార్యాలయ ఆవరణ, ఎన్ఎస్‌పీ డివిజన్ కార్యాలయం చుట్టూ పిచ్చిచెట్లు దట్టంగా పెరిగాయి. ఎన్ఎస్‌పీ సబ్‌డివిజన్ కార్యాలయాల పరిసరాల్లో కూడా పిచ్చి చెట్లు అల్లుకుపోయాయి. ఆప్రదేశాల్లోకి ప్రజలు వెళ్లేందుకు జంకుతున్నారు. దట్టంగా పెరిగిన పిచ్చి చెట్లల్లో విషపురుగులు సంచరిస్తుండటంతో అక్కడ పనిచేసే సిబ్బంది, ఆ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు నిర్యక్ష్య వైఖరి అవలంబిస్తుండటంతో అధ్వానంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.



ఎన్ఎస్పీ డివిజన్ కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు



ఎన్ఎస్పీ సబ్‌డివిజన్ కార్యాలయంచుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

- **తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్**

దర్శి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రహదారులలో షాపుల యజమానులు ముందు బంకులకు, వాటి ముందు తోపుడు బండ్లు పెట్టించటం వల్ల రోడ్లు కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. 40 అడుగులకు పైగా వెడల్పు ఉండాల్సిన రోడ్డు ఆక్రమణలతో వాహనాల తొలిగే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కొందరు వ్యాపారుల స్వార్థం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. దీంతో మున్సిపల్, పోలీస్ అధికారులతో సంయుక్తంగా రెండు రోజుల్లో ఆక్రణల తొలగింపు చర్యలు చేపడతామన్నారు. చిరువ్యాపారులు స్వచ్ఛందంగా తమ తోపుడు బండ్లను ఇతర ప్రాంతాలకు మార్చుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎస్ఐ మురళి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్. పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు, ఎస్ఐ మురళి

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

దర్శి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రణాళికతో కూడిన ఉత్తమ బోధన అందించాలని షైనంపాడు డైట్ కాలేజీ అధ్యాపకుడు శివప్రసాద్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని తూర్పుచవటపాలెం జడ్పీ హైస్కూల్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందుతున్న తీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించి, వారిలో సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తూర్పుచవటపాలెం హైస్కూల్‌ను పరిశీలిస్తున్న డైట్ కళాశాల అధ్యాపకుడు శివప్రసాద్‌రెడ్డి



లింగాలపాడు-మన్నేపల్లి మార్గంలో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

అధ్వానంగా లింగాలపాడు-మన్నేపల్లి రోడ్డు

తాళ్లూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడు- మన్నేపల్లి రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగడుగుకు గోతులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆగోతుల్లో వర్షపునీరు నిలిచిఉంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వాహనాలు జారి పడుతుండటంతో గాయాలపాలవుతున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలికంగా గుంతలు పూడ్చి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని గుంటిమడుగు కృష్ణంరాజు అన్నారు. మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. అలాగే పాఠశాల పూర్వ విద్యార్థి ముదిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్ఆర్‌కే స్కూల్ అధినేత పి.కృష్ణమూర్తి పదో తరగతిలో మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహంగా నగదు అందజేశారు.

స్త్రీశక్తితో మహిళల్లో ఆనందం



తాళ్లూరులో బస్సు ఎక్కుతున్న మహిళలు

తాళ్లూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రెండు నెలల వ్యవధిలో మహిళలకు రెండు పథకాల ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూర్చటంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. పిల్లల చదువుల కోసం తల్లికివందనం కింద గతనెలలో తల్లుల అకౌంట్‌లకు నిధులు జమ చేశారు. ఈనెలలో స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలుకు శ్రీకారం చుట్టారు. దీంతో మహిళలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల పేద, మధ్యతరగతి మహిళల కుటుంబాలకు ఆర్థికభారం తగ్గుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు గౌరవం పెరిగింది

- పాల్వాది విజయలక్ష్మి, తాళ్లూరు



కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం అందించటం చాలా ఆనందంగా ఉంది. ప్రధానంగా పల్లె ప్రాంత మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. స్త్రీశక్తి పథకం వల్ల మహిళలకు ఎంతో గౌరవం పెరిగింది. పెద్ద వయస్సుగల మహిళలు పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఆర్థికంగా ఖర్చులుకూడా తగ్గుతాయి.



మహిళలకు ఎంతో ఉపశమనం

- చెన్నంశెట్టి సుబ్బులు, శివరాంపురం

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల మాలాంటి మధ్యతరగతి కుటుంబాలకు మేలుజరుగుతుంది. ఇప్పటిదాకా ఎక్కడికి వెళ్లాలన్నా చార్జీల భారం ఎక్కువగా ఉండేఉ. ఇప్పుడు ఖర్చు తగ్గింది. బస్సు చార్జీలు మిగలటంవల్ల ఆడబ్బులు కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కనిగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈఘటన సోమవారం రాత్రి మండలంలోని గొల్లపల్లి వద్ద చోటుచేసుకుంది. చినిర్లపాడు గ్రామానికి చెందిన మహేష్(19) డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సీఎస్‌పురం గ్రామంలో పెళ్ళి వేడుక ముగించుకుని తిరిగి కనిగిరికి డీజే వాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో వాహనం కుదుపులకు రోడ్డుపై పడిపోవటంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు సాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.శ్రీరాం తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు ప్రమాద బీమా మంజూరు



ప్రమాద బీమా పత్రాన్ని అందజేస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు

పామూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనరసాపురంకు చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి ప్రమాదబీమా మంజూరయింది. గ్రామానికి చెందిన నివాస్ వేముల ప్రమాదంలో మృతి చెందాడు. అతను టీడీపీ సభ్యత్వ కార్డు కలిగిఉండటంతో ప్రమాద బీమా కింద ఆయన భార్య వేముల సుజాతకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ప్రమాదబీమా కింద టీడీపీ అందచేసిన ఇన్సూరెన్స్ పత్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు బాధిత కుటుంబానికి మంగళవారం అందచేశారు.

కార్యక్ర మంలో నాయకులు ఏ.ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఇల్లూరి శ్రీనివాసులు, గవిరెడ్డి కొండారెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

ఈక్రాప్ నమోదు చేయించుకోవాలి

ముండ్లమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంటలు సాగుచేసిన రైతులు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు అన్నారు. మంగళవారం పులిపాడు, కెల్లంపల్లి గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా రైతులతో కలసి సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏవో తిరుమలరావు మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతిరైతు పంటల నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందజేస్తున్నట్టు చెప్పారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడవద్దన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయనిర్మల పాల్గొన్నారు.

రోడ్లపై ఆవుల సంచారంతో ప్రమాదాలు



రోడ్లపై తిరుగుతున్న ఆవులు

పామూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో మెయిన్ రోడ్లపై ఆవులు సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా పాత మార్కెట్ సెంటర్, కందుకూరు రోడ్, నెల్లూరు రోడ్ సెంటర్‌లలో ఎక్కువగా సంచరిస్తున్నాయి. మార్కెట్ సెంటర్‌లో అంగళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ ఆవులు ఎక్కువగా సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తూ పాదచారులపైకి దూసుకెళుతుంటాయి. ఈక్రమంలో ద్విచక్రవాహనాలకు తగులతుండటంతో వాహనచోదకులు కిందపడి గాయాలపాలవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నోటీసులతో దివ్యాంగుల్లో దడ

- **పెన్షన్ రద్దు చేస్తారేమోనని ఆందోళన**


దొనకొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వికలత్వంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యాధికారుల బృందం ఇటీవల చేపట్టిన పరిశీలన పూర్తయింది. మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో 790 మంది దివ్యాంగ పెన్షన్లు పొందుతున్నారు. దివ్యాంగ పెన్షన్లు పొందుతున్న 13 సచివాలయాల పరిధిలో 89 మంది లబ్ధిదారులు పెన్షన్లు పొందేందుకు అనర్హులుగా గుర్తించి ఉన్నతాధికారుల నుంచి ఆయా సచివాలయాలకు ఉత్తర్వులు అందాయి. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు సచివాలయాల సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి నోటీసులు జారీ చేస్తున్నారు. అర్హత ఉంటే సంబంధిత వైద్యాధికారుల ధ్రువీకరణ పత్రాలతో తిరిగి అప్పీలు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు అధికారులు తెలుపుతున్నారు. దీంతో ఇప్పటివరకు ప్రతినెలా క్రమంతప్పకుండా రూ.6 వేలు దివ్యాంగ పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు ఆందోళనలు చెందుతున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో వైకల్యం ఉన్నట్లుగా ఇష్టానుసారంగా సర్టిఫికెట్లు తీసుకొని పెన్షన్ పొందుతున్నారు. వీటిపై వచ్చిన ఫిర్యాదులమేరకు కూటమి ప్రభుత్వం పరిశీలన చేపట్టింది. ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి దివ్యాంగ పెన్షన్ పొందుతున్న వారిపై సర్వే చేయించింది. వైద్యాధికారులు చేపట్టిన సర్వే పరిశీలనలో మండలంలో ఆరవల్లిపాడులో ఐదుగురు, మంగినపూడిలో, మల్లంపేటలో పదిమంది చొప్పున అనర్హులుగా తేలారు. అలాగే, పెద్దన్నపాలెంలో నలుగురు, రామాపురంలో ఏడుగురు, వద్దిపాడులో ఇద్దరు, కొచ్చెర్లకోటలో ఎనిమిది మంది, రుద్రసముద్రంలో ఒకరు అనర్హులైన పెన్షన్ పొందుతున్నారు. ఇండ్లచెరువులో 9 మంది, గంగదేవిపల్లిలో ఏడుగురు, చందవరంలో, పోలేపల్లిలో ఐదుగురు చొప్పున దొనకొండ-1, 2లో ఎనిమిది మంది చొప్పున అనర్హులుగా గుర్తించారు. మొత్తం 13 సచివాలయాల పరిధిలో 89 మంది దివ్యాంగ పెన్షన్లు పొందేందుకు అనర్హులుగా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లో పెన్షన్ పొందేందుకు అనర్హులుగా నోటీసులు అందుకున్న వారు ఏంచేయాలో పాలుపోవడంలేదు. రూ.6వేలు పెన్షన్ కోల్పోతామనే ఆందోళనలతో నాయకులతో సంప్రదింపులు జరుపుతూ సతమతమవుతున్నారు.

అభివృద్ధి పనుల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయి అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని కలెక్టర్ అన్సారియా అన్నారు. ఈవిషయంలో ఎంపీడీవోలు కీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీవోలు. ఏపీఎంలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. మండలాల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డ్వామా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, పంచాయతీశాఖల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రతి బుధవారం ఎంపీడీవోల అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన సమావేశ మినిట్స్ వివరాలను తనకు పంపించాలని చెప్పారు. ఎంపీడీవోలు ప్రతి వారం నాలుగు సచివాలయాలను తనిఖీ చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పథకంలో పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చినందున మొక్కలు నాటేందుకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను వినియోగించుకోవాలన్నారు. నీటి సంరక్షణ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు చిరంజీవి, జోసెఫ్‌కుమార్, గొట్టిపాటి వెంకటనాయుడు, బాలశంకరరావు, నారాయణ, నిషాద్ పాల్గొన్నారు.




పెసర్లంకను చుట్టుముట్టిన వరద నీరు

సస్పెన్షన్‌తో సరా?

● సొసైటీల్లో స్వాహాపై చర్యలు శూన్యం
● రికవరీలు లేకపోవడంతో రైతులు లబోదిబో

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
రైతుల కోసం.. రైతులకు లబ్ధి చేకూరేలా.. రైతుల సేవలో.. ఉండాల్సిన సహకార సొసైటీలు స్కాంలకు కేంద్రాలుగా మారుతున్నాయి. రైతుల పేరుతో రూ.లక్షల్లో మొత్తంగా రూ.కోట్లలో దోచేసుకుంటున్నారు. అధికారమే అండగా.. అధికారుల సహకారంతో సొసైటీల్లో కుంభకోణాలు వెలుగుచూస్తున్నాయి. వివిధ సంఘాల్లో నిధులు స్వాహా చేసినట్లు విచారణలో వెలుగుచూసినా కఠిన చర్యలు లేవు. దీంతో రైతుల సొమ్ము స్వాహా పరిపాటిగా మారింది. సకాలంలో బాకీలు చెల్లించినా ఇంకా రుణదాతలుగా చూపిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గత వైసీపీ హయాంలో పెద్దఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అక్రమాలు వెలుగుచూసినా చర్యలు శూన్యంగా ఉన్నాయి. వైసీపీ హయంలో జీడీసీసీబీ, సహకార బ్యాంకులోని కొందరు అధికారుల సహకారంతోనే తాము చెల్లించిన రుణాలను కాజేశారని రైతులు వాపోతున్నారు. రుణాల కుంభకోణాలపై జీడీసీసీబీ విచారణ జరిపినా ఉద్యోగులపై వేటుతో సరిపెడుతుందే కానీ కఠిన చర్యలు తీసుకోవడం లేదు. గత ఐదేళ్లుగా రుణాల పంపిణీ.. వసూళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ పేరుతోనే అధికారులు కాలం వెళ్లదీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రైతుల నుంచి కాజేసిన సొమ్మును సదరు ఉద్యోగుల నుంచి రికవరీ చేసే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు.



జొన్నలగడ్డ సొసైటీ కార్యాలయం

రైతులు చెల్లించిన రుణాల సొమ్మును అనేక సొసైటీల్లో వారి పేర్లపై జమ చేయకుండా ఆయా ఉద్యోగులు జేబుల్లో వేసుకున్నారు. వాయిదాల చెల్లింపులకు సంబంధించి రసీదు అడిగితే ఇస్తానులే అంటూ దాటవేస్తూ వచ్చారు. రుణాలకు సంబంధించిన ఫైళ్లను కూడా మాయం చేసినట్లు సమాచారం. కొందరు బ్యాంకు అధికారుల సహకారంతోనే ఉద్యోగులు ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్కాంపై నిగ్గు తేల్చి బాధిత రైతులకు న్యాయం చేసే దిశగా డీసీసీబీ స్పందిస్తున్న తీరు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితుల్లో న్యాయం చేయాలని బాధిత రైతులు జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావును కోరుతున్నారు.

జొన్నలగడ్డలో రూ.కోటి స్వాహా

పల్నాడు జిల్లా (మిగతా 6వ పేజీలో)


కొల్లూరు: తిప్పలకట్ట వద్ద కోతకు గురవుతున్న భూములు


అరవింద వారధి వద్ద వరద ప్రవాహం

..మహోగ్రం

భారీ వర్షాలు.. ఎగువ నుంచి పోటెత్తుతోన్న వరద.. జలాశయాల నుంచి లక్షల క్యూసెక్కుల నీరు విడుదలతో కృష్ణమ్మ మహోగ్రంగా ప్రవహిస్తోంది. నదిలో గంటగంటకు ప్రవాహ ఉధృతి పెరిగిపోతోంది. కృష్ణమ్మ ఉరకలెత్తుతో సముద్రం దిశగా దూసుకెళ్తోంది. గట్లను తాకుతో ప్రవహిస్తుండటంతో నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. అమరేశ్వరాలయం సమీపంలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి మూడు కి.మీ వెడల్పుతో ప్రవహిస్తుంది. నదీ తీర ఏటి ఒడ్డున పంట పొలాలను ముంచేస్తూ కృష్ణమ్మ పారుతుంది. నీటి ప్రవాహం ఎక్కువయ్యే అవకాశం ఉందని అధికారుల హెచ్చరికలతో నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ఉపద్రవం ఎదురైనా ఆదుకునేలా అధికారులు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు.


పెనుమూడి కృష్ణానదికి పోటెత్తిన వరదనీరు

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

- నదీ తీర గ్రామాల్లో మళ్లీ వరద భయం
- సాగర్ నుంచి 4,09,506 క్యూసెక్కులు విడుదల
- ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 4,68,720 క్యూసెక్కులు
- రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రకాశం బ్యారేజీ
- నదిలో గంటగంటకు పెరుగుతున్న వరద.. అధికారులు అప్రమత్తం
- హార్బర్‌లో కొనసాగుతున్న 3వ నెంబరు ప్రమాద సూచక

కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, తెనాలి ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి 4,10,186 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నాగార్జున సాగర్ జలాశయం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 4,09,506 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల అవుతుంది. ప్రకాశం బ్యారేజికి 4,73,065 క్యూసెక్కుల వరద వస్తుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,68,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగరంలో కలిసేందుకు వల్లపు గ్రామాలు, పొలాలను చుట్టేస్తూ ఉకరకలెత్తుతూ కృష్ణమ్మ పరుగులు పెడుతూ ప్రవహిస్తుంది. సాగర్‌తో పాటు పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా (మిగతా 6వ పేజీలో)

ఈ మండలాల్లో.. హైఅలర్ట్

నదిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ముప్పు ఉన్న మండలాల్లో విపత్తుల శాఖ హైఅలర్ట్ ప్రకటించింది. పల్నాడు జిల్లాలో దాచేపల్లి, గురజాల, మాచవరం, మాచర్ల, రెంటచింతల, అమరావతి, అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు, సత్తెనపల్లి మండలాలున్నాయి. గుంటూరు జిల్లాలో తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలను అప్రమత్తం చేశారు. బాపట్ల జిల్లాలో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, నిజాంపట్నం మండలాలను వరద ముప్పు ప్రాంతాలుగా గుర్తించారు.

భయం గుప్పెట్లో లంకలు

ఉధృతంగా ప్రవహిస్తోన్న నీటితో కృష్ణానదీ పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో ఉన్నారు. నీరు గంట గంటకు పెరుగుతుండటంతో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పెనుమూడి వద్ద మెట్లదాకా నీరు ప్రవహిస్తుంది. కొల్లూరు-కొత్తూరులంక మార్గంలో నది మధ్యలో ఉన్న బాపట్ల జిల్లా చింతర్లంక, గుంటూరు జిల్లాలోని అన్నవరపు లంక మధ్య చప్టాపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పోతార్లంక ఏటి ఒడ్డునున్న పొలాల్లోని అరటి, తమలపాకు, మొక్కజొన్న, పసుపు, కంద పంటలను నీరు ముంచేసింది. అరవింద వారది ఎగువన పడిన గండి నుంచి వరద పెసర్లంక గ్రామాన్ని చుట్టుముట్టింది. పెదపులివర్రు, ఓలేరు, ఘైనేనివారిపాలెం, రాజుకాల్వ, లక్ష్మీపురం, లంకేవానిదిబ్బ, ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు కరకట్టను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్‌సీ అధికారులు ఓలేరు వద్ద 2009లో పడిన గండిప్రాంతాన్ని ఇసుకబస్తాలతో బలపరుస్తున్నారు.


ఓలేరు వద్ద కరకట్టను ఇసుక బస్తాలతో బలపరుస్తున్న దృశ్యం

బోగస్ పింఛన్ల ఏరివేత

◆ అర్హత లేకున్నా 3,853 మంది దివ్యాంగులకు లబ్ధి ◆ అభ్యంతరాలపై అప్పీలుకు అవకాశమిచ్చిన ప్రభుత్వం


అభ్యంతరాలుంటే తెలపాలని చీరాలలో పింఛన్‌దారుడి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇస్తున్న సిబ్బంది

(బాపట్ల, చీరాల - ఆంధ్రజ్యోతి)
గత వైసీపీ హయాంలో నేతల సిఫార్సులే ప్రామాణికంగా అనర్హులకు పెద్దఎత్తున దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక జరిగింది. అర్హులకే పింఛన్లు ఇవ్వాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం జనవరి నుంచే సచివాలయాల వారీగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారి వివరాలను సేకరించి ఇంటింటి సర్వే చేపట్టింది. మూడు దశల్లో జల్లెడ పట్టిన యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా 3,853 మంది అనర్హులను గుర్తించింది. వీరందరికి అధికారులు నోటీసులు జారీ చేశారు. అర్హత ఉన్నా పింఛన్ నిలుపుదల చేస్తే సంబంధిత పత్రాలను అధికారులకు అందిస్తే తిరిగి లబ్ధిదారుల జాబితాలో చేర్చనుంది.

24,660 మందికి దివ్యాంగ పింఛన్

జిల్లాలో దివ్యాంగుల కేటగిరీలో 24,660 మందికి పింఛన్ లబ్ధి చేకూరుతోంది. ఇందులో 3,829 మంది అర్హత లేకున్నా లబ్ధి పొందుతున్నారని పరిశీలనలో తేలినందున పింఛన్ నిలుపుదలకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆరోగ్య పరమైన ఇబ్బందులు లేకపోయినా బోగస్ పత్రాలతో మరో 24 మంది ప్రయోజనం పొందుతున్నారని నిర్ధారించిన ప్రభుత్వం వీరికి రద్దు నోటీసులను జారీ చేసింది. ఎటువంటి వైకల్యం లేకపోయినా కేవలం వైసీపీ నేతల సిఫారసులే ప్రామాణికంగా దివ్యాంగ పింఛన్ అందించింది. ఈ క్రమంలో ఉండాల్సిన వైకల్య శాతాలకు కూడా తిలోదకాలిచ్చి వేల సంఖ్యలో అనర్హులకే ప్రభుత్వ ధనం దోచిపెట్టినట్లు అధికారుల విచారణలో తేలింది. ఇదే సమయంలో తమకు అర్హత ఉన్నప్పటికీ దివ్యాంగ పింఛన్ రావడం లేదనే అర్జీలు దాదాపు 5,300 అధికారుల వద్దకు చేరాయి. ఈ ప్రభుత్వంలో ఇప్పటికే అర్హత కలిగిన దివ్యాంగ పింఛన్ల విషయంలో దాదాపు 1,800 మందికి అదనంగా లబ్ధి చేకూర్చగా, అనర్హుల ఏరివేత ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది.

గతంలోనే పైలట్ ప్రాజెక్టు...

అర్హత లేకున్నా పింఛన్ లబ్ధి పొందుతున్న వారిని ఏరివేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద యద్దనపూడి మండలం పూనూరు-2 సచివాలయాన్ని ఎంపిక చేసి సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టింది. ఈ సచివాలయ పరిధిలో మొత్తం 476 మంది పింఛన్లు అందుకుంటుంగా ఇందులో 22 మందిని అనర్హులుగా గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. పైలట్ సర్వే ఆధారంగా జిల్లాలో అర్హత లేకున్నా పింఛన్ ఫలాలు అందుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో గణనీయంగానే ఉన్నారన్న అంచనాకు ప్రభుత్వం వచ్చింది.

ఆదమరిస్తే.. అంతే

తిమ్మరాజుపాలెం కూడలిలో మృత్యు ఘంటికలు
ప్రమాదకరంగా వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి


వాడరేవు - పిడుగురాళ్ల హైవే రోడ్డులో తిమ్మరాజుపాలెం కూడలి

పర్చూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి 167(ఏ)లో ఆయా గ్రామాల కూడళ్లు మృత్యు ఘంటికలుగా మారాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం వద్ద హైవేను అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ఇటు తిమ్మరాజుపాలెం, అటు చెన్నుంబొట్ల అగ్రహారం నుంచి వాహనాలు హైవేలోకి రావడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరు గ్రామాల కూడలి ప్రమాద భరితంగా మారింది. గడిచిన పక్షం రోజుల్లో పదుల సంఖ్యలో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 15న తిమ్మరాజుపాలెం నుంచి హైవేపైకి వస్తున్న ఆర్టీసీ బస్సును పర్చూరు నుంచి చిలకలూరిపేట వెళ్తున్న లారీ ఢీ కొంది. ఈ ఘటనకు ముందు పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన ముద్దన వెంకట్రావు ఇదే కూడలి వద్ద ప్రమాదానికి గురై మృతి చెందారు. రహదారి పూర్తిగా వినియోగంలోకి రాక ముందే ఇంత పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతుంటే భవిష్యత్‌లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె ఇళ్లపై.. అదనపు భారం

● చిచ్చు పెడుతున్న కరెంటు బిల్లులు ● గతంలో ఎవరో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు చెల్లింపులా?

అద్దంకి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అద్దె ఇళ్లలోని వారిపై విద్యుత్ బిల్లుల భారం పడుతోంది. ఏ నెలకు ఆ నెల కరెంటుకు బిల్లులు చెల్లిస్తున్నా.. గతంలో అదే ఇంట్లో ఉన్న వారు వినియోగించుకున్న కరెంట్‌కు ఇప్పుడు అదనపు చార్జీలు వసూలు చేయడం ఏమిటంటూ అద్దెదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ అదనపు చార్జీలు అద్దె ఇళ్లలో నివాసం ఉండే కుటుంబాలకు, ఇళ్ల యజమానులకు మధ్య చిచ్చు పెడుతున్నాయి. 2014-19 మొదలు గత నెల వరకు వినియోగించిన విద్యుత్‌కు 4 రకాల పేర్లతో ప్రస్తుతం ట్రూఅప్ చార్జీల పేరుతో వసూలు చేస్తున్నారు. తాము కొత్తగా అద్దెకు వచ్చిన ఎప్పుడో ఐదారేళ్ల క్రితం చార్జీలు ఇప్పుడు తాము ఎందుకు చెల్లించాలని అద్దెదారులు యజమానులను ప్రశ్నిస్తున్నారు.

అసలు కంటే కొసరే ఎక్కువ..

2014-19 మధ్యకాలంలో వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ట్రూ అప్‌చార్జీలను 60 నెలలుగా వసూలు చేశారు. ఇది 2025 ఆగస్టు విద్యుత్ బిల్లుతో ట్రూఅప్ నిలిచిపోతుంది. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించి ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కాస్ట్(ఎఫ్‌పీపీసీఏ)-3 అదనపు భారం నవంబరు 2024 నుంచి 18 నెలల పాటు వసూలు చేస్తున్నారు. అప్పట్లో వినియోగించిన విద్యుత్‌కు యూనిట్ 80 పైసలు చొప్పున లెక్కించి అదనపు భారం మోపుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వినియోగానికి సంబంధించి ఎఫ్‌పీపీసీఏ-4గా యూనిట్‌కు 49 పైసలు చొప్పున అదనపు భారం వేస్తున్నారు. ఇంతటితో ఆగకుండా ఎఫ్‌పీపీసీఏ అదర్స్ అంటూ ముందు నెలలో వినియోగించిన కరెంట్‌కు యూనిట్‌కు 40 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా అసలు కంటే కొసరే ఎక్కువ అన్నట్లు విద్యుత్ బిల్లుల భారం పడుతుండటంతో అద్దెదారులు అల్లాడుతున్నారు.


గుండ్లకమ్మ నదిలో తవ్విన ఇసుక గోతులు

గుండ్లకమ్మలో గోతులు

నిషేధిత ప్రాంతంలో ఇసుక తవ్వకాలు ● రాత్రిళ్లు చెలరేగిపోతున్న అక్రమార్కులు

అద్దంకి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇష్టారాజ్యంగా తవ్వకాలతో గుండ్లకమ్మ నది గోతులమయంగా మారింది. నిషేధిత ప్రాంతంలోనూ అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నా అధికారులకు పట్టడంలేదు. వైసీపీ ప్రభుత్వంలో బ్రిడ్జి అంచు వరకు, మంచినీటి ఊటబావుల సమీపంలోనూ యథేచ్ఛగా ఇసుక తవ్వగా ఇప్పుడూ అదే పరిస్థితి కొనసాగుతుంది. గతంలో మంత్రి రవికుమార్ ఆదేశాలతో కొంతవరకు తవ్వకాలకు అడ్డుకట్ట వేసినా మళ్లీ ప్రారంభమయ్యాయి. కొందరు అక్రమార్కులు రాత్రి సమయాల్లో గుండ్లకమ్మ బ్రిడ్జికి సమీపంలో ఎక్సకవేటర్‌తో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. మంచినీటి ఊటబావుల వద్ద కూడా తవ్వకాలు జరపగా మున్సిపల్ అధికారులు కాపలా ఏర్పాటుతో ఆగిపోయాయి. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు జరిగితే పూర్తి గా కూలే ప్రమాదం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి సమీపం లో ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన గుండ్లకమ్మ బ్రిడ్జి

నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలి

జిల్లా స్థాయి సమీక్షలో సీఎండీ పుల్లారెడ్డి ఆదేశాలు

చీరాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సేవలే లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం టెక్నికల్ డైరెక్టర్ మురళీ కృష్ణయాదవ్, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి సీఎండీ చీరాలలో జిల్లాస్థాయిలో విద్యుత్‌పై సమీక్షించారు. బాపట్ల సర్కిల్ పరిధిలో లోవోల్టేజీ, అగ్రికల్చర్ సేవలు, ఓవర్ లోడుపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా పరిధిలో మూడు సబ్‌స్టేషన్ల పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. కొత్త సర్వీసుల ప్రక్రియ పెంచాలన్నారు. సర్వీసుల్లో పెండింగ్‌లు లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆంజనేయులు, డీఈ జాన్ థామస్, డీఫై ఈఈ హరిప్రసాదరావు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి



వెద పైరు మునిగి..

నారు ధర పెరిగి!

బాపట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు వెదపెట్టిన వరి పొలాలు మొత్తం నీట మునిగి పైరు దెబ్బతింది. దెబ్బతిన్న పొలాల్లో తిరిగి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో వరి నారుకు డిమాండ్ పెరిగింది. మళ్లీ నారు పోసి పెంచడానికి ఆలస్యమవుతుందని రైతులు భావిస్తున్నారు. వర్షానికి ముందు సెంటు నారు వెయ్యి రూపాయలకే పీకి బండికి వేసేవారు. ఇప్పుడు రూ.1600 నుంచి రూ.2వేల వరకు తీసుకుంటున్నారు. నల్లమోతువారిపాలెం, ఎం.వి.రాజుపాలెం, కొత్తనందాయపాలెం, పాతనందాయపాలెం, ఏట్రవారిపాలెం, యాజలి, బిడారుదిబ్బ, రాంభొట్లవారిపాలెం, చెరుకుపల్లి పరిసర ప్రాంతాల్లో వరినారు విస్తారంగా పెంచారు.

అవీ..ఇవీ..

నేడు ఉచిత మెగా ఆయుర్వేద వైద్యశిబిరం

ఇంకొల్లు,ఆగస్టు 19,(ఆంధ్రజ్యోతి) : వలివేటి సత్యవాణి 5వ వర్ధంతి సందర్భంగా వంకాయల పాడు మార్కెట్ యార్డు పక్కన ఉన్న వలివేటి సత్యవాణి గార్డెన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు ఉచిత మెగా ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామారావు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యులు డా.పి మురళీకృష్ణ, డా.శ్రీవిష్ణుప్రియ, డా.చైతన్య, డా.సయ్యద్ నజాబ్‌ఉల్లా పాల్గొని రోగులకు ఉచిత వైద్యసేవలిందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాతల సహకారం అభినందనీయం



శ్రీరామచంద్రమూర్తి, శైలజలను సన్మానిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం

అద్దంకి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం అని ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాండవకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా రూ.8వేల విలువైన క్రీడా సామగ్రిని పుట్టంరాజు శ్రీరామమూర్తి, శైలజ దంపతులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో హెచ్‌ఎం పెంట్యాల గంగాధర్, పీడీ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

అద్దంకి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణం, మండలంలోని గ్రామాలలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుకు అనమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అద్దంకి పట్టణ సీఐ సుబ్బరాజు తెలిపారు. మైకొసెట్, విద్యుత్ వినియోగించుకునేందుకు కూడా అనుమతులు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు పూర్తి సమాచారం ముందుగానే ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి వేళలలో విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలో కాపలా ఉండాలన్నారు. నిమజ్జనం రోజు మద్యం సేవించి గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో కొత్త విద్యుత్ టవర్ల నిర్మాణం నేపథ్యంలో భవానిసెంటర్‌లోని వినాయకుడి దేవాలయం నుంచి కమలేశ్వరస్వామి దేవాలయం వరకు నామ్ రోడ్డుకు ఇరువైపులా బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

22న వరలక్ష్మీ వ్రతాలు

అద్దంకి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ గుజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావులు తెలిపారు. పూజా సామగ్రి దేవాలయం తరఫున అందజేయనున్నట్లు తెలిపారు. కలశమునకు వినియోగించే చెంబు మాత్రం భక్తులు తెచ్చుకోవాలన్నారు.

పక్కాగా రేషన్ పంపిణీ

- పలు మార్పులు తెస్తున్న ప్రభుత్వం
- బయోమెట్రిక్ స్థానంలో స్మార్ట్‌మిషన్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. పక్కాగా సరుకుల పంపిణీకి చర్యలు చేపట్టింది. తాజాగా బయోమెట్రిక్ (వేలిముద్రలు వేసే మిషన్) స్థానంలో సాంకేతిక పరిజ్ఞానంతో (లేటెస్ట్ అప్‌డేట్) స్మార్ట్‌మిషన్‌ను అందుబాటులోకి తెస్తోంది. దీని ద్వారా కార్డుదారులు సత్వరమే రేషన్ సరుకులు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బయోమెట్రిక్ మిషన్ ద్వారా వేలిముద్రలు పడక గంటల తరబడి షాపుల వద్దనే పడిగాపులు కాయాల్సివస్తోంది. కొత్త విధానంలో అలాంటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

కార్డు స్కాన్‌తో సరుకులు

కార్డుదారులు చౌకధరల దుకాణాల వద్దకు వెళ్లాక వేలిముద్రలు పడకపోతే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మిషన్ ద్వారా రైస్‌కార్డును స్కాన్ చేసి రేషన్ ఇస్తారు. దీని వలన రేషన్ పక్కదారి పట్టకుండా నిలువరించడంతోపాటు కార్డుదారులకు సులభతరంగా సరుకులు పొందవచ్చని అధికారులు చెప్తున్నారు. ఇప్పటి వరకు ప్రస్తుతం ఉన్న కార్డులతోనే బియ్యం ఇస్తుండగా వచ్చేనెల నుంచి కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డులు ప్రింట్ చేసిన సంస్థలకు మండలాల వారీ చిరునామాలు కూడా ఇచ్చారు. అవి నేరుగా మండలాలకు చేరిన తర్వాత పంచాయతీల వారీగా విభజించి పౌరసరఫరాల శాఖ అధికారుల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్పులు, చేర్పులకు భారీగా దరఖాస్తులు

రేషన్ కార్డుల్లో చేర్పులు మార్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో జిల్లావ్యాప్తంగా 94,129 దరఖాస్తులు వచ్చాయి. అందులో ప్రస్తుతం ఉన్న కార్డుల్లో సభ్యుల చేర్పుల కోసం అత్యధికంగా 65,737 ఉన్నాయి. వాటిలో 39,722 దరఖాస్తులను అధికారులు ఆమోదించగా 7,002 తిరస్కరించారు. మిగిలినవి విచారణలో ఉన్నాయి. కొత్త రైస్‌కార్డుల కోసం 10, 457 దరఖాస్తులు అందగా 6,717ను ఆమోదించారు. 3,454 తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. అలా ఆమోదించిన దరఖాస్తుల్లో ఈ నెలలోనే సుమారు 20శాతం మందికి సరుకులు తీసుకునేందుకు అవకాశం కలిగింది. ఇప్పటికే ఆమోదించిన దరఖాస్తులకు నంబర్లు కూడా రావడంతో కొత్త కార్డుదారులు ఆయా రేషన్ షాపుల వద్ద బయోమెట్రిక్ వేసి బియ్యాన్ని తీసుకున్నారు. ఇలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పౌరసరఫరాల శాఖలలో అనేక మార్పులు తేవడంతోపాటు కార్డుదారులకు పారదర్శకంగా బియ్యం పంపిణీకి చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని ప్రకటించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆ గస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్ర భుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ని ప్రభుత్వం వెంటనే ప్రక టించాలని ప్రభుత్వ ఉద్యో గుల సంఘం నాయకులు కోరారు. స్థానిక రిమ్స్ మెడి కల్ కాలేజీలో మంగళవా రం రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చిం చుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, రంగారెడ్డి, ఎం.శ్రీనివాసరా వు, సురేష్‌బాబు, ప్రసన్న, ఏసురత్నం, శ్రీనివాసులు, అంకబాబు, విజయలక్ష్మి, శ్రీనివాసయాదవ్, బాబురావు, రాజేష్, కార్తీక్, దినకర్, ప్రభావతి, చాందిని, రమేష్‌బాబు, లావణ్య, పద్మలత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీధర్‌నాయక్
- 'సుఖీభవ' గ్రీవెన్స్ అర్జీల దాఖలకు నేడు తుదిగడువు
- ఆవులదొడ్డి గొల్లపాలెం రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ
- పొలం పిలిస్తోంది కార్యక్రమాల్లో రైతులకు అవగాహన



ఆవులదొడ్డిగొల్లపాలెంలో వేరుశనగను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చినగంజాం : ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీధర్‌నాయక్, చీరాల సహాయ వ్యవసాయ సంచాలకులు తన్నీరు రత్నకుమారిలు అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డిగొల్లపాలెంలో జాతీయ ఆహార నూనెల మిషన్-నూనె గింజలు పథకంపై వేరుశనగ రైతులకు శిక్షణ ఇచ్చారు. వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రత్నకుమారి అన్నారు. మండల పరిధి లో 249 మంది రైతులకు 304 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వంద శాతం రాయితీపై టీసీజీఎస్-1694(విశిష్ట రకం) పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు వేసిన వేరుశనగ పంటలను పరిశీలించి, వివిధ రకాల పంట యాజమాజ్య పద్ధతులు, కలుపు నివారణ, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. పూత దశలో జిప్సం వినియోగించాలన్నారు. పంటపై బోరాన్ పిచికారి చేస్తే గింజ పరిమాణం, గింజలో నూనె శాతం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఆర్.చంద్రశేఖర్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



అద్దంకిలో మాట్లాడుతున్న ఏవో సరళ

కొత్తపాలెం(చీరాల), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకంపై ఏవో నిర్మలాదేవి మంగళవారం అవగాహన కల్పించారు. మండల పరిధిలోని కొత్తపాలెం సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకంలోని అభ్యంతరాలకు బుధవారంతో చివరి గడువు ముగుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సాగుపై పలు సూచనలు చేశారు. అన్నదాత సుఖీభవపై అభ్యంతరాలను పీజీఆర్ఎస్ ద్వారా తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో గ్రామ పశు సంవర్ధక సహాయకులు అనూహ్య, వీఏఏ మనీషా, రైతులు పాల్గొన్నారు.

సేంద్రీయ సేద్యం వైపు మొగ్గుచూపండి : ఏవో

పంగులూరు : రైతులు పంటసాగులో సేంద్రీయ సాగు పద్ధతులు పాటించడం లాభదాయకమని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రసాయన రహిత సేద్యానికి ప్రతిరైతు సన్నద్ధం కావాలన్నారు. రసాయన రహిత ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర లభిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ నగదుపడని రైతులు ఈ నెల 20వ తేదీలోగా తిరిగి ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకు నర్సరీలను పెంచవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ బెల్లంకొడ శ్రీదర్, మురకొండ సుబ్బారావు, కాజాస్వామి, వేణు, వీఏఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై శిక్షణ

ఇంకొల్లు : పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగు రైతులు దృష్టి సారించాలని పర్చూరు ఏడీఏ జీబీ ప్రవీణ సూచించారు. మండలంలోని కొణికి గ్రామంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ నిర్వహించారు. పొగాకు బదులుగా మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేసుకోవాలన్నారు. పొగాకు నారుమళ్లు వేయవద్దని సూచించారు. 2005-26 సంవత్సరంలో పొగాకు అసలు సాగు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమం లో ఏవో మేరమ్మ, శాస్త్రవేత కామాక్షి, వ్యవసాయ సహాయకులు జమీమా రైతులు పాల్గొన్నారు.

అద్దంకి : మొక్కజొన్నలో ఇనుపధాతు లోపాన్ని నివారించుకోవాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సరళ అన్నారు. మండలంలోని వెంపరాల, చక్రాయపాలెంలలో మంగళవారం పొలంపిలు స్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్నలో ఇనుపధాతు లోపం గుర్తించినట్లు తెలిపారు. ఫెర్రస్ సల్ఫేట్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాల న్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు ఖచ్చితంగా చేయించుకో వాలన్నారు. బర్లీ పొగాకు సాగు చేయవద్దన్నారు. ఉద్యాన అధికారి దీప్తి మాట్లాడుతూ ఎస్సీ రైతులకు కూరగాయల సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

మహోగ్రం

(5వ పేజీ తరువాయి)

అధికారులకు దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారానికి వరద ప్రవాహం 5.5 లక్షలకు చేరే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలకు కలెక్టర్ల ఆదేశాలు జారీ చేశారు. ముంపుతో బాపట్ల జిల్లాలో అత్యధిక నష్టం ఏర్పడే పరిస్థితి ఉండటంతో కలెక్టర్ వెంకటమురళి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రధాన ఘాట్ల వద్ద సిబ్బందిని కాపలా ఉంచారు. వరద ఉధృతికి పంట భూములు భారీగా కోత పడుతున్నా యి. గ్రామాలకు వెళ్లే రోడ్లపైగా, చప్టాలను ముంచేస్తూ కృష్ణమ్మ ప్రవాహంతో కొన్ని లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎక్కడికక్కడ పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు నదిలో నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కరకట్ట పొడవునా గండ్లుపడే ప్రమాదం ఉన్న చోట్ల అధికారులు ఇసుక మూటలు సిద్ధం చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాత్రి పూట గస్తీని పెంచారు. లంక భూముల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారానికి రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో బ్యారేజీ వద్ద ప్రవాహం పెరిగే పరిస్థితి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో 3వ రోజు మంగళవారం 3వ నెంబరు ప్రమాదసూచిక కొనసాగుతుంది.

ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి అనగాని

వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎవరూ ఆందోళన చెందొద్దని, సోషల్ మీడియాలో జరిగే వదంతులను నమ్మవద్దని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఎటువంటి విపత్తులనైన ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చెయ్యాలని అధికారులకు సూచించారు. కరకట్ట వెంబడి ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే లోతట్టుప్రాంతాల ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలన్నారు. గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

అరవై శాతం మంది అనర్హులే!

- పింఛన్ల లబ్ధిదారుల్లో భారీగా బోగస్‌లు
- వారికి వచ్చే నెల నుంచే కట్

ఒంగోలు నగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంచానికే పరిమితమయ్యాం..! కాళ్లు కదలటం లేదు. చేతులు ఆడటం లేదు.. వీల్‌ఛైర్‌లోనే నిత్యం జీవనం సాగిస్తున్నాం..! అంటూ హెల్త్ పింఛన్ల కేటగిరీ కింద నెలవారీ రూ.15వేలు పొందుతున్న వారిలో 60 శాతం మంది అనర్హులు ఉన్నట్లు తేలింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఆరోగ్య పింఛన్లు పొందుతున్న వారి ఇంటింటికీ వైద్య బృందాలను పంపించి తనిఖీ చేయించింది. అందులో భారీగా బోగస్‌లు ఉన్నట్లు తేలింది. జిల్లాలో ఈ ఏడాది జనవరి నాటికి హెల్త్ పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య 1,224గా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేటగిరీ కింద బోగస్ సర్టిఫికెట్లను సృష్టించుకుని వందల సంఖ్యలో మంజూరు చేయించుకున్నారు. నెలవారీ దర్జాగా రూ.15వేలు లబ్ధి పొందుతు న్నారు.

747 మంది అనర్హులు

ప్రస్తుత ప్రజా ప్రభుత్వ ఆదేశాలతో పరిశీలన చేపట్టిన ప్రత్యేక వైద్య బృందాలు 747 మంది ఈ పింఛన్లు తీసుకునేందుకు అనర్హులుగా తేల్చాయి. 85 శాతం వికలత్వం ఉండి పూర్తిగా మంచానికో లేదా వీల్‌ఛైర్‌కో పరిమితమైన వారు మాత్రమే హెల్త్ పింఛన్ రూ.15 వేలు పొందేందుకు అర్హులు. కాగా సాధారణ వికలత్వం, అసలు వైకల్యం లేనివారు కూడా ఈ కేటగిరీ కింద పింఛన్ పొందుతూ ఉన్నారు. దీంతో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య బృందాలు పరిశీలన చేపట్టాయి. 747 మందిని అనర్హులుగా తేల్చాయి. వీరిలో 252 మంది ఏ కేటగిరీ కింద కూడా పింఛన్ పొందేందుకు అర్హులు కారని వైద్యబృందాలు నిర్ధారించాయి. 392 మందికి 40శాతం కంటే ఎక్కువ 85 శాతం కంటే తక్కువ వికలత్వం ఉంది కాబట్టి ప్రభుత్వం వీరికి సెప్టెంబరు నుంచి దివ్యాంగుల కేటగిరీ కింద రూ.6వేల పింఛన్ ఇవ్వనుంది. మరో 103 మందికి హెల్త్ పింఛన్ పొందేందుకు ఎలాంటి అర్హత లేకపోయినా వీరికి 60 ఏళ్ల వయసు దాటిన నేపథ్యంలో వృద్ధాప్య పింఛన్ కేటగిరి కింరీ నెలకు రూ.4వేల పింఛన్ అందజేయనుంది. 252 మందికి పూర్తిగా పింఛన్‌ను నిలిపివేయనున్నారు.

దివ్యాంగులలో 3,340 మంది అనర్హులు..

జిల్లాలో దివ్యాంగుల కేటగిరీ కింద పింఛన్ పొందుతున్న వారు 32,875 మంది ఉన్నారు. వీరు ప్రస్తుతం ప్రతినెలా రూ.6వేల లబ్ధి పొందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల పింఛన్లలో కూడా భారీగా బోగస్‌లకు చోటు కల్పించారు. చిటికెన వేలు లేకపోయినా 50శాతం వికలత్వం చూపిస్తూ సదరమ్ సర్టిఫికెట్లు జారీచేశారు. దీంతో ఈ కేటగిరీ కింద పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి మాసం నుంచి తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు మొత్తం 28,965 మందికి వైద్యశాలల్లో పరీక్షలు నిర్వహించగా 3,340 మంది అనర్హులుగా తేలారు. వీరికి సెప్టెంబర్ నుంచి పింఛన్ పంపిణీ నిలిపివేయనున్నారు. కాగా 1,434 మంది పరీక్షలకు హాజరుకాకుండా ముఖం చాటేశారు. ఇప్పటివరకు దివ్యాంగుల కేటగిరీ కింద పింఛన్లు పొందుతున్న వారిలో ఇంకా 6,016 మందికి వికలత్వ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం సదరమ్ పరీక్షలు తిరిగి నిర్వహించి అనర్హులుగా తేలిన వారిలో 567 మందికి 40శాతం కంటే వికలత్వం తక్కువగా ఉండటం వలన ఆ పింఛన్ రద్దుచేసి వారికి 60 సంవత్సరాల వయస్సు నిండి ఉండటంతో సెప్టెంబర్ నుంచి వృద్ధాప్య పింఛన్ నెల వారీ రూ.4వేలు అందజేయనున్నారు. మొత్తం మీద జిల్లాలో బోగస్‌లు గుట్టురట్టయి సెప్టెంబర్ నుంచి 252మంది హెల్త్ పింఛన్ పొందుతున్న వారికి, 3,340 మంది దివ్యాంగుల కేటగిరి కింద పింఛన్ పొందుతున్న వారికి కట్ చేయనున్నారు.

అర్హులు ఉంటే తిరిగి అప్పీలు చేసుకోవచ్చు

అనర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు వారంరోజులుగా సచివాలయాల ద్వారా నోటీసులు జారీచేస్తున్నారు. వారిలో అర్హులు ఉంటే నోటీసు అందుకున్న నెలరోజులలోపు సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌కు అప్పీలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. వారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులు అని నిర్ధారణ అయితే రద్దయిన పింఛన్‌ను వెంటనే పునరుద్ధరించి నగదును అందజేస్తారు.

సీపీఐ సభలకు భారీ ఏర్పాట్లు

- ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో పార్టీ రాష్ట్ర మహాసభలు
- తొలిరోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు రాజా, నారాయణ
- జిల్లావ్యాప్తంగా శ్రేణుల విస్తృత ప్రచారం
- నేటి నుంచి ఒంగోలులో కళా ప్రదర్శనలు



మహాసభల పోస్టర్లను సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

ఒంగోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు వేదికగా ఈనెల 23 నుంచి 25 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర 28వ మహాసభలు జరగనున్నాయి. అందుకు ఆ పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతి మూడేళ్లకు ఒకసారి గ్రామస్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు సీపీఐ, సీపీఎం ఇతర వామపక్షాలు సంస్థాగత నిర్మాణంలో భాగంగా మహాసభలను నిర్వహిస్తుంటాయి. సెప్టెంబరులో పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు జరగనుండగా ఈ లోపు రాష్ట్ర స్థాయిలోనూ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని జిల్లా మహాసభలు పూర్తికాగా ఆయా జిల్లాలు, పార్టీ రాష్ట్ర, కేంద్రం నుంచి సుమారు 550 మంది ప్రతినిధులు ఒంగోలులో జరిగే మహాసభలకు హాజరుకానున్నారు. గత మూడేళ్లుగా రాష్ట్రంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, ప్రస్తుత ప్రభుత్వాల తీరు, ప్రజా సమస్యలు, వాటి పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనతోపాటు రానున్న మూడేళ్ల కాలానికి పార్టీ నూతన నాయకత్వం ఎంపిక ఈ మహాసభల్లో జరగనున్నాయి.

భారీ ర్యాలీ, బహిరంగ సభ

మూడు రోజుల పాటు జరిగే మహాసభల ప్రారంభ సందర్భంగా తొలి రోజైన 23న జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే సీపీఐ శ్రేణులతో నగరంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు బస్టాండు సెంటర్‌లోని మునిసిపల్ స్కూలు నుంచి అద్దంకి బస్టాండు సమీపంలోని కూరగాయల మార్కెట్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ ఉంటుంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగే ఈ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇతర నాయకులు పాల్గొననున్నారు. అనంతరం 24, 25 తేదీల్లో ప్రతినిధుల సభలు జరుగుతాయి. దేశంలో సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రతిష్టాత్మకంగా మహాసభల నిర్వహణతోపాటు యంగ్ కమ్యూనిస్టు కార్యకర్తలతో ర్యాలీలో కవాతు నిర్వహించేలా శిక్షణ ఇస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం

తొలిసారి వామపక్ష పార్టీ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగనుండటంతో జిల్లాలో సీపీఐతోపాటు ఇతర వామపక్ష అభ్యుదయ వర్గాలు ఈ ఏర్పాట్లలో భాగస్వామ్యువుతున్నారు. సీపీఐ శ్రేణులు ఇప్పటికే వివిధ రూపాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రజానాట్యమండలి కళాకారుల బృందం జిల్లా అంతటా ప్రదర్శనలు ఇచ్చింది. ఇదిలా ఉండగా మూడు రోజుల ముందు నుంచే ప్రజా కళాఉత్సవాల పేరుతో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో సాయంత్రం కళా ప్రదర్శనలు, చర్చాగోష్టిలు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 20 నుంచి 22 వరకు రాష్ట్ర ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాలలో ప్రజా కళాకారులు, కవులుగా గుర్తింపు ఉన్న ప్రముఖులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కళాకారులు, నాయకులు హాజరవుతున్నారు. అలాగే 23న జరిగే ర్యాలీలోనూ కళాకారులు భారీగా పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత నల్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షుడిగా జిల్లాలోని సీపీఐ ముఖ్యనేతలు, అభ్యుదయవర్గాల వారితో ఏర్పడిన ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మార్కెట్‌ను సందర్శించిన ఏఎంసీ చైర్మన్



మార్కెట్‌ను పరిశీలిస్తున్న వెంకట్రావు

మార్టూరు, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని పచ్చిమిర్చి కూరగాయల మార్కెట్‌ను మంగళవారం పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్‌లో రైతులకు అవసరమైన వసతులపై రైతులతో మాట్లాడారు. అంతేగాకుండా కొత్తగా నిర్మిస్తున్న గదుల కోసం స్థలాన్ని పరిశీలించారు. రైతులు కూరగాయలను మార్కెట్‌కు తీసుకువచ్చిన తర్వాత వారి వాహనాలును పార్కింగ్ చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. కూరగాయల వ్యర్థాల కోసం షెడ్ నిర్మించి, వర్మీకంపోస్టు తయారీపై ఆయన అధికారులతో చర్చించారు. దేగరమూడి రోడ్డు వద్ద చెక్‌పోస్టును ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సుగాలి కాలనీకి వెళ్లే రోడ్డులోని మార్కెట్ యార్డు వారు నిర్మించిన గొడౌన్ ప్రాంగణాన్ని, కొణిదెన రోడ్డులో మార్కెట్ యార్డును ఆయన పరిశీలించారు.

న్యాయస్థానాల్లో పోస్టుల భర్తీకి పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు వివిధ న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు బుధవారం నుంచి ఈనెల 24వతేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి ఒకప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టులకు 6,948 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అందుకోసం ఐదు పరీక్షా కేంద్రాల్లో మూడు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఒంగోలులోని నేషనల్ కౌన్సిల్ ఫర్‌చర్స్ సొసైటీ యాక్షన్ ఇండియా(ఒంగోలు), బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్ (ఒంగోలు), రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాల (వల్లూరు), కృష్ణచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కాలేజీ (మార్కాపురం)లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి 10.30 గంటలవరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడవ షిఫ్ట్ సాయంత్రం 4నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి పావుగట ముందు వరకే అభ్యర్థులను ఆయా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, కాపీయిస్టులు, డ్రైవర్లు, టైపిస్టులు వారివారి విభాగాలకు నిర్వహించిన పరీక్షల్లో విజయవంతమైన వారిని స్కిల్ టెస్టుకు పిలవనున్నట్లు తెలిపారు. ఏ ఒక్క విభాగానికి ఇంటర్వ్యూలు ఉండవన్నారు. పరీక్షలు పూర్తిగా మెరిట్ ఆధారితంగా జరుగుతాయని, అందువల్ల ఎలాంటి పుకార్లను నమ్మవద్దని చెప్పారు.

సస్పెన్షన్‌తో సరా?

(5వ పేజీ తరువాయి)

పరిధిలోని జొన్నలగడ్డ సొసైటీలో రుణాల కుంభకోణంపై జీడీసీసీబీ విచారణ చేపట్టగా రూ.కోటి స్వాహా అయి నట్లు సమాచారం. రైతులు చెల్లించిన రుణా లు బ్యాంకు జమ చేయకుండా సొసైటీ కార్యదర్శి నంద్యాల వీరారెడ్డి, ఉద్యోగి తనుబుద్ధి కృష్ణారెడ్డి స్వాహా చేసినట్లు విచారణలో అధికారులు తేల్చారు. సదరు ఉద్యోగులను సస్పెండ్ చేసి జీడీసీసీబీ అధికారులు చేతులు దులుపుకున్నారే కానీ మోసపోయిన రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవన్న విమర్శలున్నాయి. విచారణ నివేదికను గోప్యంగా ఉంచడంపై అనుమానాలకు తావిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

సహకార సంఘాల ద్వారా రైతులకు ఏటా రుణాలు పంపిణీ చేస్తారు. ఇందుకు సంబంధించిన జాబితా డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఉంటుంది. ఏటా సొసైటీ రుణాలపై అడిట్ చేయాలి. రికార్డులు, రసీదు పుస్తకాలను తనిఖీ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో నిర్వహిస్తే రుణాల పంపిణీ, వసూళ్లలో అక్రమాలకు తావు ఉండదు. ఇలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో సొసైటీ రుణాలలో అక్రమాలు జరుగుతున్నాయి. సొసైటీల వారీగా ఉన్న బకాయిలపై ప్రత్యేకంగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాలి

- సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల్లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పాసుపుస్తకాల పంపిణీలో ఎలాం టి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియలో పొరపాట్లు లేకుండా జేసీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, అటవీ భూములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవా లని చెప్పారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, అధికారులు వరకుమార్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ వివరాలను తెలియజేయాలి

- డీపీవో వెంకటనాయుడు

కొండపి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో స్వామిత్వ కింద నమోదు చేస్తున్న కొలతలను ఏరోజుకారోజు జిల్లా పంచాయతీ కార్యాలయానికి తెలియజేయాలని డీపీవో జి.వెంకటనాయుడు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశిం చారు. ఆయన మండలంలోని వెన్నూరు, చోడవరం, ముప్పవరం గ్రామాల్లో పారిశుధ్య, స్వామిత్వ కార్యక్రమాలను మంగళవారం పరిశీలించారు. గ్రామా ల్లో చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమివ్వా లని సూచించారు. చోడవరం, ముప్పవరం గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమా న్ని పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో అంజలీదేవి, ముప్పవ రం, వెన్నూరు, చోడవరం, కొండపి పంచాయతీ కార్యదర్శులు రత్నప్రభ, కృష్ణ, సాంబయ్య, ఉన్నం రామ్మోహన్ ఉన్నారు.

అవీ..ఇవీ..

శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి

ఛైర్మన్‌గా బుచ్చయ్య ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న బుచ్చయ్య

పంగులూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పంగులూరు శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా జాగర్లమూడి బుచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారి ప్రమాణ స్వీకారం మంగళవారం పంగులూరులోని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఏరియా ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆలయ కమిటీ ఛైర్మన్‌గా జాగర్లమూడి బుచ్చయ్య, సభ్యులుగా కట్టా మల్లేశ్వరి, గుడిపాటి వెంకటేశ్వర్లు, కొల్లాపద్మ, కంకణాలసుందరమ్మ, పోతుగంటి మాలిక్, సాయిదునిషా, దేవరకొండ ముత్యాలమ్మ, తిరుమలవరపు రవీంద్ర, శ్రీరామచంద్రప్రసాద్, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా కె.సాంబశివరావుతో ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, మేడసుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరి కోటయ్య, రోటరీ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ, పార్టీ నాయకులు కేవీ.సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు విశేష పూజలు

- బంతిపూలతో అమ్మవారికి అలంకరణ


అమ్మవారికి సమర్పించేందుకు తీసుకెళుతున్న బంతిపూలు

మార్టూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని సంపత్‌నగర్ వాసులు మంగళవారం మహాలక్ష్మమ్మకు విశేష పూజలు చేశారు. శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు చేయడం వారు ఆనవాయితీగా భావిస్తారు. దీనిలో భాగంగా, మంగళవారం నాగరాజుపల్లి కూడలిలోని మహాలక్ష్మమ్మ తల్లి చెట్టు వద్ద సంపత్ నగర్ వాసులు ప్రత్యేక పూజలు చేశారు. బంతి పూలతో అలంకరించి, మహిళలు, పురుషులు అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు, వడపప్పు, పానకాన్ని సమర్పించారు. చీర, సారే పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం అమ్మ వారి వద్ద కాలనీ వాసులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

జ్వరాలపై నిర్లక్ష్యం వీడాలి

- సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య


డాక్టర్ సౌమ్య

పర్చూరు, అగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జ్వరాలపై నిర్లక్ష్యం వీడాలని రెండు రోజులకు మించి జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిటెండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మంగళవారం పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలన్నారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వైద్యశాలకు వస్తున్న రోగుల్లో అత్యధికశాతం జ్వరపీడితులు నమోదు అవుతున్నట్లు తెలిపారు. అందులో టైఫాయిడ్ బాధితులు కూడా నమోదు అవుతున్నట్లు పేర్కొన్నారు. విధిగా కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు.

బోగస్ మస్టర్లపై విచారణ


బోగస్ మస్టర్లపై మల్లాయపాలెంలో విచారిస్తున్న అధికారులు

బల్లికురవ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ ం ండ లం లో ని వ ం ల్లా య ం పా లె ం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ తమ గ్రామంలో ఉపాధి పనులలో బోగస్ మస్టర్లు వేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని కలెక్టర్‌కు ప్రజావిజ్ఞప్తుల దినంలో ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం ఇన్‌చార్జ్ ఎపీవో రమాదేవి మల్లాయపాలెం గ్రామంలో ఫిర్యాదులో పేర్కొన్న కూలీల ఇంటికి వెళ్లి విచారించారు. పనులకు వచ్చారా..? లేదా..? అని లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. అయితే విచారణ సక్రమంగా చేయకుండానే అధికారులు అవకతవకలు జరగన్నట్లు నమోదు చేయించి కూలీల కుటుంబ సభ్యులతో సంతకాలు చేయించుకొని వెళ్లారని ఫిర్యాదిదారుడు బాలకృష్ణ ఆరోపించారు. దీనిపై తాను పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ప్రజావిజ్ఞప్తుల ఫిర్యాదును కూడా స్థానిక అధికారులు పక్కదారి పట్టించి ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు పంపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సంచార జాతులు సదాచార వారసులు

- బీజేపీ ప్రతినిధులు


స్ఫూర్తి కరపత్రం ప్రదర్శిస్తున్న బీజేపీ ప్రతినిధులు

బుర్లవారిపాలెం(చీరాల), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సంచార జాతులు, సదాచార వారసులు సంస్కృతికి వారధులని, దేశభక్తులకు వీరే స్ఫూర్తి అని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బుర్లవారిపాలెం, బేరీపురం కాలనీలో సంచార జాతుల విముక్తదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. చరిత్ర మరచిన ఆధునిక సమాజానికి గతాన్ని గుర్తుచేస్తూ భారతీయ మూలాలను తెలియచెప్పేది వీరేనని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

444 బంగారు కుటుంబాలు గుర్తింపు

ఇంకొల్లు,ఆగస్టు 19,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండల పరిధిలో పీ-4 సర్వేలో భాగంగా 444 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్ తెలిపారు. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయితీలు ఉండగా పీ-4 సర్వే నిర్వహించగా ఇప్పటి వరకు 444 కుటుంబాలను గుర్తించామన్నారు.

వీధి కుక్కలతో ప్రజలు బెంబేలు

- వాహనదారులను వెంబడించి కరుస్తున్న వైనం
- చిన్నారులపై మూకుమ్మడి దాడులు
- కుక్కల దాడులతో పలువురికి గాయాలు
- పట్టించుకోని పంచాయితీ అధికారులు
- అగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


పర్చూరులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

పర్చూరు/కారంచేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వీధి శునకాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎటు నుంచి శునకాలు మూకుమ్మడిగా దాడులకు పాల్పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో ఏ గ్రామంలో చూసిన వీధికుక్కలు గుంపులు గుంపులుగా వందల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ప్రధాన వీధులు, రహదారుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఆయా మార్గాలలో రాకపోకలు సాగించే వారిపై మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్లపైకి రావాలంటే ప్రజలు వాహనదారులు భయపడుతున్నారు. ఎటు నుంచి వీధి శునకం తనపై దాడిచేస్తుందోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని మరీ రాకపోకలు సాగిస్తునారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఆయా మండలాల పరిధిలో గడిచిన నెల రోజుల్లో 40 మందికి పైగా ప్రజలు వీధి కుక్కల దాడిలో గాయపడ్డారంటే పరిస్థితి ఎంత తీవ్రతరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది పర్చూరుకు చెందిన ఓ వ్యక్తి వీధి శునకం దాడిలో గాయపడి రేబీస్ వ్యాధితో మృతి చెందిన ఘటన కూడా ఉంది. దీంతో వీధి శునకాల దాడిలో తమ ప్రాణాలకు ముప్పు ఉందని ప్రజలు భయపడుతున్నారు.

ఇరువురు చిన్నారులపై దాడి

పర్చూరు పోలీసు స్టేషన్‌వీధిలో పాఠశాలకు వెళుతున్న ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. చుట్టుపక్కలవారు గుర్తించి కేకలు వేసి రక్షించడంతో పెనుప్రమాదం తప్పింది. శునకాల దాడిలో గాయపడిన చిన్నారులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించారు. ఇలాంటి ఘటనలతో చిన్నారులను ఒంటరిగా బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

వాహనదారులపై వెంటాడి మరీ దాడులు

పర్చూరు - చీరాల ప్రధాన రోడ్డులో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ రహదారిలో వీధి శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంటాడి మరీ దాడులకు పాల్పడు తున్నాయి. శునకాల దాడి నుంచి రక్షించుకునే క్రమం లో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇటీవల పర్చూరుకు చెందిన టైలర్ చీరాల నుండి పర్చూరుకు వస్తున్న తరుణంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో శునకాలు వెంటపడ డంతో తప్పించుకోపోయి వాహనం అదుపు తప్పి ప్రాణాలు కోల్పో యారు. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి.

పిచ్చికుక్కలతో పెను ప్రమాదం

వీధుల్లో విచ్చలవిడిగా కుక్కలు పెరిగి పోవడం ఒక సమస్య అయితే ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పిచ్చికుక్కలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో పిచ్చిపట్టిన కుక్కలు సంచరిస్తున్నాయని ఎప్పుడు ఎలాంటి ప్రాణహాని జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి శునకాలు పెరిగిపోయి అవికాస్త వ్యాధుల బారిన పడడంతో ఇలాంటి ప్రమాద కరమైన దుస్థితి నెలకొంది ఆయా గ్రామాల వాసులు వాపోతున్నారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

ప్రైవేటు ఫైనాన్స్ ప్రతినిధులకు అధికారుల హెచ్చరిక


ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పంగులూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్లు రుణాల రికవరీ విషయంలో చట్టబద్ధంగా వ్యవహరించాలని తహసీల్దార్ సింగారావు, ఎస్ఐ వినోద్‌బాబులు హెచ్చరించారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో ప్రవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి వ్యవసాయకూలీలు, కౌలు రైతులు రుణాలు తీసుకున్నారు. స్వల్ప వడ్డీపేరుతో రుణాలిచ్చిన ఫైనాన్స్ సంస్థల ఏజెంట్లు వసూళ్ల సమయంలో అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. దీంతో పనులు లేక కొంతకాలంగా ప్రవేట్ ఫైనాన్స్ సంస్థల నుండి తీసుకున్న రుణాల కిస్తీలు చెల్లించక పోవడంతో సంస్థల ఏజంట్లు తమను ఇబ్బందులు పెడుతున్నారని రుణగ్రహీతలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రుణం పొందిన వారి ఇళ్లకు తాళాలు వేయడం, సెల్‌ఫోన్ లాక్కో వడం, ఇంటిగోడలపై తాకట్టులో ఉందని రాయ డం ద్వారా తమను ఇబ్బందులు పెడుతున్నారని రుణగ్రహీతలు ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ప్రవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు, రుణంతీసుకున్న వ్యక్తులతో తహసీల్దార్ సింగారావు, ఎస్.ఐ.వినోద్‌బాబులు రెవెన్యూ కార్యాలయంలో విచా రించారు. ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్లు తాము ఇచ్చిన రుణాల రికవరీ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. నివాస గృహాలకు తాళాలు వేయడం, సెల్ ఫోన్లు లాక్కోవడం, ఇళ్లగోడలపై పేర్లురాయడంలాంటి చర్యలు చట్ట విరుద్ధమన్నారు. కిస్తీలు కట్టని ఎడల న్యాయస్థానాలను ఆశ్రయించాలన్నారు ఈ విచారణలో తలపనేని రామారావు, గుడిపాటి మల్లారెడ్డి, ఫైనాన్స్ కంపెనీల ఏజంట్లు, రుణగ్రహీతలు పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో రక్షణగా శక్తి యాప్

విద్యార్థులకు అవగాహన కల్పించిన బృందం


శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

చినగంజాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లనవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ ఏ.హరిబాబు అన్నారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం జల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శక్తి యాప్‌పై, గుడ్, బ్యాడ్ టచ్‌లు, సోషల్ మీడియా, ఆత్మరక్షణ, సైబర్ నేరాలు, మత్తుపదార్థాలపై శక్తిబృందం సభ్యులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసైన వారు తేలికగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని మోసపోతున్నారన్నారు. ఏపీకే ఫైల్స్ ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేసుకోవద్దని హెచ్చ రించారు. మహిళలు సెల్‌ఫోన్‌లో యాప్ డౌన్లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. పోలీసు సేవలను మహిళలకు మరింత చేరువ చేసేందుకు శక్తి వాట్సాప్ నెంబరు 7993485111ను కూడా అందుబాటులోని తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఐ శీలం రమేష్, శక్తి బృందం సభ్యులు కె.సుబ్బారావు, బి.ధనలక్ష్మి, సునీత, చినగంజాం పోలీసుస్టేషన్ పోలీసు సిబ్బంది, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్.ఎం.నర్రా సోమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారం గొలుసు అందజేత


గొలుసును అందజేస్తున్న డీఎం రామ్మోహన్‌రావు

అద్దంకి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న బంగారం గొలుసును వెతికి ఆర్టీసీ అధికారులు బాధితుడికి అందజేశారు. ఒంగోలు నగరంలోని సమతానగర్‌కు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ భారతుల సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో కలిసి అద్దంకి నుంచి ఒంగోలుకు మంగళవారం ప్రయాణించారు. ఆ సమయంలో సుబ్రహ్మణ్యం కుమార్తె 16 గ్రాముల బంగారు గొలుసును బస్సులో పోగొట్టుకున్నారు. ఒంగోలులో బస్సు దిగిన తరువాత గొలుసు పోగొట్టుకున్న విషయాన్ని గమనించారు. వెంటనే ఆర్టీసీ అద్దంకి డిపో ఎంక్వయిరీకి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో స్పందించిన డిఎం రామ్మోహనరావు బస్‌డ్రైవర్‌కు పోన్ చేసి విషయం చెప్పారు. బస్సులో వెతకగా బంగారం గొలుసు ఉంది. సుబ్రహ్మణ్యంను అద్దంకి పిలిపించి డీఎం రామ్మోహనరావు గొలుసును అందజేశారు. సీఆర్‌సీ కొండలు, సిబ్బంది ఉన్నారు.

నైట్‌హాల్ట్ సేవలను పునరుద్ధరించండి

బల్లికురవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగపడే అద్దంకి చిలకలూరిపేట నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరిం చాలని రెండు మండలాలకు చెందిన ప్రయాణికులు వేడుకుంటున్నారు. మూడు దశాబ్దాల నుంచి అద్దంకి నుండి అద్దంకి మండలం కలవకురు, శంకరవప్పాడు,. ధర్మవరం, బల్లికురవ మండలం వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, కొణిదెన, కె. రాజుపాలెం గ్రామాల మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సు సర్వీసు ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వం ఈ రూట్‌లో ఉన్న రెండు సర్వీసులలో ఒకటి రద్దు చేసింది. గతంలో రెండు సర్వీసులు ఒకటి నైట్ హాల్ట్ అద్దంకిలో మరోకటి చిలకలూరిపేటలో ఉండేవి. ఉదయం 5 గంటలకు వచ్చే ప్రయాణికులకు ఇవి ఎంతో ఉపయోగపడేవి. ఆర్టీసీ అధికార్ల అనాలోచిత నిర్ణయంతో చిలకలూరిపేట నైట్‌హాల్ట్ సర్వీసును రద్దు చేశారు. దీంతో రెండు మండలాల పరిధిలోని ప్రయాణికులు పట్టణ ప్రాంతాలకు ఉదయం వెళితే రాత్రి వరకు తిరిగి వచ్చే సౌకర్యం లేదు. ఎంతో కాలం నుండి ప్రజలు ఈ సమస్యపై గగ్గోలు పెడుతున్న ఎవరు పట్టించుకోలేదు. ప్రభుత్వం రద్దు చేసిన ఈ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ప్రైవేటు పాఠశాలలో అడ్మిషన్లకు అవకాశం

అద్దంకి,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీఈ యాక్ట్ 12(1)సీ ప్రకారం అద్దంకి మండలంలోని ప్రవేట్ పాఠశాలలలో 1,2 తరగతులలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంఈవో-1 గంగాధరరావు తెలిపారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు 19, 20 తేదీలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థుల వివరాలను 25వ తేదీన ప్రకటించనున్నట్లు తెలిపారు.

శరవేగంగా పైపులైన్ ఏర్పాటు పనులు


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న డీఈ, ఏఈ, నక్కబొక్కలపాడు ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్

బల్లికురవ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి శుద్ధ జలాన్ని కుళాయిల ద్వారా అందించే ప్రక్రియలో భాగంగా మండలంలోని అంబడిపూడి రక్షిత స్టోరేజ్ చెరువు నుంచి నక్కబొక్కలపాడు గ్రామం వరకు ప్రత్యేక పైపులైన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గతంలో ఉన్న పైపులైన్ మరమ్మత్తులకు గురి కావడంతో తరచు తాగునీరు అందటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. దీంతో టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజల విన్నపం మేరకు ప్రత్యేక కృషితో జల జీవన్ మిషన్ ద్వారా రూ. 1.84 కోట్ల నిధులను మంజురు చేయించారు. ఈ నిధులతో వారం రోజుల నుండి నక్కబొక్కలపాడుకు ప్రత్యేక పైపులైన్ పనులు చేస్తున్నారు. పైపులైన్‌తో పాటు ఓవర్ హెడ్ ట్యాంకు, ఇంటింటికి కుళాయిలను అందించే పనులు చేపట్టనున్నారు. ఈ పైపులైన్ పనులు పూర్తి అయితే నక్కబొక్కలపాడు గ్రామానికి మంచి నీరు సక్రమంగా అందుతుందని అధికారులు అంటున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న తాగు నీటి సమస్య త్వరలో తీరుతుందని వారు తెలిపారు. అంబడిపూడి గ్రామంలో ఉన్న చెరువు నుండి 5. 5 కిలోమీటర్ల దూరం రోడ్డు వెంబడి పైపులైన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ గిరినాయక్‌లు పరిశీలించారు. తాగు నీరు ఇంటింటికి అందించే చర్యలను ప్రభుత్వం చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న వర్షపు జల్లులు

- దగ్గర పడుతున్న వినాయకచవితి పర్వదినం
- కొనుగోలుదారులు, అమ్మకందారులలో ఆందోళన


అద్దంకిలో అమ్మకాలకు సిద్ధంగా వినాయక విగ్రహాలు

అద్దంకి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల కొనుగోలుదారులు, అమ్మకందారులను, వర్షపు జల్లులు ఆందోళన కలిస్తున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి పండుగ కావడంతో ఇప్పటికే వినాయక విగ్రహాలు అమ్మకాలకు సిద్ధం చేశారు. కొనుగోలుదారులు కూడా ముందుగానే కొనుగోలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే వారం రోజుల నుంచి వర్షపు జల్లులు పడుతుండడంతో మరో నాలుగైదు రోజులు వర్షాలు ఉన్నాయని హెచ్చరికల నేపథ్యంలో ఆందోళన మరింత పెరుగుతోంది. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డు, రామ్‌నగర్‌లలో వినాయక విగ్రహాలను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. చిన్న విగ్రహాలు మొదలు సుమారు 10 అడుగుల విగ్రహాల వరకు వివిధ సైజులలో విగ్రహాలు ఉన్నాయి. అయితే వర్షాలు పడుతుండటంతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే బృందాలు ఒకింత ఆలోచనలో పడ్డారు. భారీ వర్షాలు పడితే విగ్రహాల మండపాల ఏర్పాటు ఖర్చు భారీగా పెరిగే అవకాశం ఉండడంతో ఒకింత వెనుకడుగు వేస్తున్నారు. తయారీదారులు గతం కంటే ఎక్కువ మొత్తంలో విగ్రహాలు తయారు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. అమ్మకాలు జరగకుండా మిగిలిపోతే వచ్చే ఏడాది వరకు ఉంచాల్సి ఉంటుంది. పండుగ నాటికి వర్షాలు తగ్గితే విగ్రహాలు అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని, లేకుంటే తీ వ్రంగా నష్టపోవాల్సి వస్తుందనే ఆందోళనలో ఉన్నారు.

చీరాలను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

- ప్రజాసంఘాల నేతల డిమాండ్


నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాలను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, అలాగే జిల్లాకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరును చేర్చాలని పలు సంఘాల నేతలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మసీదు కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 29న కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరించాడానికి జిల్లాల పునర్విభజన మంత్రుల కమిటీ హాజరవుతున్నట్లు వివరించారు. ప్రజలంతా ఏకతాటిపై నిలబడి జిల్లా సాధనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధి దేవరాజ్, ఏఐటీయూసీ ప్రతినిధి బత్తుల శామ్యూల్, ప్రజా సంఘాల నేత మేడా వెంకటరావు, రవి, జనసేన ప్రతినిధి గూడూరి శివరామప్రసాద్, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ నాయకులు చిట్టిబాబు, సీనియర్ సిటిజన్ హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు సత్కారం


ఫొటో గ్రాఫర్లను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, ఆగసు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీడే సందర్భంగా మంగళవారం మార్టూరులోని రోటరీక్లబ్ వారు ఫొటో స్టూడియోలను నిర్వ హి స్తు న్న ఐదుగురు ఫొటో గ్రాఫర్లను శాలువా కప్పి సత్కరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు పోలూరి సింగయ్య, భీమవరపు సుబ్బారావు, పులిపాటి సుబ్బారావు, దేవరపల్లి శి వకుమార్, షేక్ నాసర్ వలి లను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, కొర్రపాటి కాజారావు, జాష్టి సాంబశివరావు షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గేదెల దొంగను పట్టుకున్న గ్రామస్థులు

యద్దనపూడి,(మార్టూరు) ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి 6 గేదెలను తోలుకొని వెళుతుండగా, గ్రామస్థులు అనుమానించి పట్టుకున్నారు. పర్చూరు మండలం కొల్లావారిపాలేనికి చెందిన 6 గేదెలను దొంగిలించిన వ్యక్తి వాటిని అమ్ముకోవడానికి తీసుకువెళుతుండగా అనంతవరం గ్రామస్థులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని కొల్లావారిపాలెం వాసులకు తెలియచేశారు.

చోరీ కేసులో పురోగతి

బల్లికురవ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో ఈ నెల 6న గుంటుపల్లి గురుమూర్తి అనే రైతు ఇంట్లో జరిగిన చోరీపై కేసు విచారణ పురోగతి సాధించినట్లు సమాచారం. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దొంగ ఇంట్లోకి వెళ్లి బీరువా తీసి అందులో ఉన్న బంగారు, వెండి వస్తువులతో పాటు కొంత నగదు కూడా తస్కరించుకెళ్లాడు. దీంతో పోలీసులు ఈ కేసుపై విచారణను మరింత లోతుగా చేశారు. చోరీకి పాల్పడిన వ్యక్తి నర్సారావుపేట ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించి దొంగను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది. చోరీ కేసును చేధించేందుకు పోలీసులు పలు కోణాలలో విచారించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో కేసు వివరాలు పూర్తిగా వెల్లడయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



సోమశిలలో 50.550 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 28,161 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. దీంతో డ్యాంలో 50.550 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 330, వరద కాలువకు 8,600 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

బోగస్ పింఛన్ల
లెక్క తేలింది!

జిల్లాలో దొంగ పింఛన్ల లెక్క తేలింది. అన్నీ అవయవాలు బాగున్న సకలాంగులు కూడా తాము దివ్యాంగులమంటూ నెల నెలా ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్నట్లు తేటతెల్లమైంది. వైసీపీ పాలనలో అక్రమాలతో ఒకరు... ఇద్దరు కాదు 5065 మంది అనర్హులు ఇన్నాళ్లు పింఛను పొందినట్లు నిర్ధారణ అయింది. వీటన్నింటినీ రద్దు చేయడంతో ప్రభుత్వానికి నెలకు రూ 3.03 కోట్లు మిగిలింది. ఇవికాక తీవ్ర అనారోగ్యం లేకపోయినా ఆ కోటాలో కొందరు పింఛను పొందుతున్నట్లు గుర్తించి వాటిని దివ్యాంగ పింఛన్లుగా మార్చారు. తద్వారానూ ప్రభుత్వ ఖజానాకు మరికొంత ఆదా కానుంది.

- సకలాంగులకూ సదరం ధ్రువపత్రాలు
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- అధికారుల పరిశీలనలో బహిర్గతం
- 5,065 పింఛన్ల రద్దు
- ప్రభుత్వానికి నెలకు రూ.3.03కోట్ల ఆదా
- అనారోగ్య పెన్షన్లు 597కి కుదింపు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్య, వితంతు వంటి సామాజిక పింఛన్లతోపాటు దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి ప్రభుత్వం ప్రతీ నెలా పింఛను ఇస్తోంది. అయితే వైసీపీ పాలనలో ఇవి దుర్వినియోగమయ్యాయి. అప్పట్లో సదరం ధ్రువపత్రాల జారీలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు స్పష్టమైంది. కాలు వంకర, చేయి వంకర అని, చెవులు వినిపించటం లేదని, కళ్లు సరిగా కనిపించటం లేదని, మానసిక వైకల్యమంటూ చాలా మంది సకలాంగులు సదరం ధ్రువపత్రాలు పొందినట్లు నిర్ధారణ అయింది. ఇలాంటి వాటి వడపోతకు కొన్ని నెలల క్రితం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులతో సదరం పత్రాల పునఃపరిశీలన కార్యక్రమం చేపట్టింది.

● అనర్హులు 5065 మంది

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికల హామీలో భాగంగా పింఛన్ల మొత్తాన్ని భారీగా పెంచింది. దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, అనారోగ్యంతో బాధపడేవారికి వారి పరిస్థితికి తగ్గట్టు రూ.5వేలు, రూ10వేలు, రూ. 15వేలు చొప్పున పింఛను అందిస్తోంది. ఇదే సమయంలో అనర్హులు కూడా పెద్ద సంఖ్యలో పింఛన్లు పొందుతూ రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నట్లు గుర్తించింది. ఈ క్రమంలో వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో 32,205 మంది దివ్యాంగ పింఛన్లు పొందుతుండగా వారిలో 4215 మంది వైకల్యం



లేకపోయినా పింఛను పొందుతున్నట్లు తేలింది. మరో 850 మంది దివ్యాంగుల వివరాలు తెలియలేదని అధికారుల సమాచారం. మొత్తంగా ఈ 5065 మంది అనర్హులు ప్రతీ నెల రూ.6వేల చొప్పున దివ్యాంగ పింఛను పొందుతున్నట్లు గుర్తించారు. వాటిని రద్దు చేయడంతో ప్రభుత్వానికి రూ.3.03కోట్లు ఆదా అయింది.

● అనారోగ్య పింఛన్ల కుదింపు

జిల్లాలో రూ.5వేలు, రూ10వేలు, రూ. 15వేలు తీసుకుంటున్న ఆరోగ్య పింఛనర్లు 1907 మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ. 2.41కోట్లు చెల్లిస్తున్నారు. వారందరినీ విచారించి 597 మంది పింఛన్లను దివ్యాంగ పింఛన్లుగా మార్పు చేశారు.



అప్పీలు చేసుకోవచ్చు

ఏదైనా కారణాలతో అర్హులైన లబ్ధిదారులు అనర్హులుగా జాబితాలో వచ్చినట్లయితే వారు స్థానిక వెల్ఫేర్ సిబ్బందిని సంప్రదించాలి. నివేదిక తీసుకున్న 90 రోజుల్లోగా మళ్లీ సదరం పత్రానికి ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అప్పీలు చేసుకోవచ్చు.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్

కడలిపుత్రుల్లో
కల్లోలం

గంగపుత్రులకు కడలి కన్నతల్లిలాంటిది. అందులో దొరికే మత్స్య సంపదను వేటాడి జీవనోపాధి పొందుతారు. అయితే, ఈ సంపదను పొరుగు రాష్ట్రమైన తమిళ మత్స్యకారులు కొల్లగొడుతున్నారు. మెటనైజ్డ్ హెవీ మోటరు వంటి బోట్ల సహాయంతో వేటాడి దోచుకోవడమేగాక అడ్డొచ్చిన మనవారిపైనా దాడులకు పూనుకుంటున్నారు. వారి ఆగడాలకు చెక్ పెట్టాలని ఇటు పాలకులు, అటు అధికార యంత్రాంగాన్ని మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇక చేసేదిలేక తమిళ మత్స్యకారులకు చెక్‌పెట్టేందుకు ఏపీలోని నాలుగు జిల్లాల్లో మత్స్యకార కాపులు, పెద్దలు ఏకమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం లేదా తమిళ మత్స్యకారులను కడలిలోనే ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నారు.

- ఏపీలోకి చొరబడుతున్న తమిళ మత్స్యకారులు
- మెటనైజ్డ్ బోట్లతో మత్స్యసంపద దోపిడీ
- అడ్డుకున్న మనవారిపైనా దాడులు
- ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా చర్యలు శూన్యం
- ఏకమైన 4 జిల్లాల మత్స్యకార కాపులు
- పొరుగు జాలర్లను ఎదుర్కొనేందుకు తీర్మానం



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న కడలూరు బోటు

బిట్రగుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : 2010 సంవత్సరం ముందు తమిళనాడులోని కడలూరు, కారైకల్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు రామేశ్వరం మీదుగా శ్రీలంక సముద్ర తీరంలో చేపలవేట సాగిస్తుండేవారు. అక్రమంగా మత్స్యసంపదను దోచుకుపోతున్న వారిపై శ్రీలంక తీరప్రాంత వాసులు తిరగబడి దాడులు చేయడం ప్రారంభించారు. ఇక తమ ఆటలు సాగవని 2010లో తమిళ మత్స్యకారులు ఏపీలోకి అడుగుపెట్టారు. ఇక్కడ సమృద్ధిగా మత్స్య సంపద దొరకడంతో తిరుపతి, నెల్లూరు జిల్లాల తీరంలో జోరుగా వేట కొనసాగించారు. ఇందుకు ప్రధాన కారణం రూ.1.2 కోట్ల నుంచి 4 కోట్ల విలువైన మెటనైజ్డ్ బోట్లు తమిళ జాలర్ల వద్ద ఉండటమే. మత్స్యసంపదను దోచుకుపోతున్న తమిళులను ఎదుర్కొనేందుకు ప్రయత్నించిన ఏపీ మత్స్యకారులపై వారు దాడికి దిగారు. వారిని ఎదుర్కోలేక బతుకు జీవనం కోసం గంగపుత్రులు కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాలతోపాటు కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వలస వెళ్లారు.

బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో సమావేశమైన 4 జిల్లాల మత్స్యకారులు (ఫైల్)



● తమిళ మత్స్యకారుల దాడులు

ఆంధ్ర తీర ప్రాంత మత్స్యకారుల వద్ద మెటనైజ్డ్ బోట్లను ఎదుర్కొనే శక్తి లేదని తెలుసుకున్న కడలూరు, కరైకల్, నాగపట్నం ప్రాంతాల మత్స్యకారులు ఏపీ తీరంలోకి చొరబడ్డారు. ఒకటీ రెండు బోట్లు కాకుండా ఏకంగా 10 నుంచి 15 బోట్లలో ఏక కాలంలో మన తీరంలోకి చొరబడ్డారు. తమిళ బోట్ల ఆగడాలను చూసిన అల్లూరు మండలం ఇస్కపల్లి మత్స్యకారులు 2023, ఏప్రిల్‌లో కట్టడి చేసేందుకు ఉపక్రమించారు. ఫైబర్ బోట్లతో వెళ్లిన మనవారిపై రాళ్ళు, గాజుసీసాలతో తమిళ మత్స్యకారులు దాడులు చేశారు. దాదాపు తీరం దాక వచ్చి దాడిచేస్తున్నా మెరైన్ పోలీసులు సైతం ఏం చేయలేని పరిస్థితి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కడలిపుత్రుల్లో కదలిక మొదలై 2023లోనే తీరప్రాంత నాలుగు జిల్లాల మత్స్యకారులు సమావేశమయ్యారు. కడలూరు, కారైకల్ హెవీబోట్లను ఎదుర్కోవాలంటే అంతటి సామర్థ్యం ఉండే బోటును కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. దాని విలువ కోటి రూపాయల పైచిలుకు కావడంతో 164 గ్రామాల మత్స్యకారులు చందాలు వేసుకునేందుకు పూనుకున్నారు. ఇది మత్స్యకారులకు ఆర్థిక భారంగా మారింది. మెటనైజ్డ్ బోటును ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన బోటు కొనుగోలుకు రాయితీ ఇప్పించాలని 2024, జనవరి 1వ తేదీన జువ్వలదిన్నెలో పర్యటించిన కేంద్ర మత్స్య, జంతు, పాడి పరిశ్రమల సంయుక్త మంత్రి పరుషోత్తమ రూపాల దృష్టికి మత్స్యకారులు తీసుకుపోయారు. ఇప్పటికీ అతీగతీ లేదు.

● విరుచుకుపడిన కృష్ణాపురం గంగపుత్రులు

తమిళ మత్స్యకారులు తరచూ ఆంధ్ర తీరంలోకి చొరబడి చేపల వేట సాగించడమే కాకుండా ఫైబర్ బోట్లపై దాడి చేయడం, వలలను ధ్వంసం చేయడాలు పెరిగిపోయాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోవడంతో విసిగివేశారిన కృష్ణాపురం మత్స్యకారులు గత నెల 31వ తేదీన కడలూరు బోటును అడ్డగించారు. తీరప్రాంతాల గంగపుత్రులు సమావేశమై పట్టుకున్న హెవీబోటును జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాంగణానికి చేర్చాలని నిర్ణయించుకున్నారు. అదుపులో ఉన్న మెటనైజ్డ్ బోటు విషయమై నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన 160 గ్రామాలకు చెందిన మత్స్యకార గ్రామ కాపులు, పెద్దలతో ఈ నెల 6వ తేదీన బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో సమావేశమయ్యారు. కడలూరు, కారైకల్ హెవీబోట్లను కలిసి కట్టుగా కట్టడి చేసేందుకు మత్స్యకారులు ఏకమయ్యారు.

● పట్టించుకోని ప్రభుత్వాలు

సంవత్సరాల తరబడి తమిళ మత్స్యకారులు ఏపీలోకి చొరబడి మత్స్యసంపద దోచుకుపోతున్నారని మొత్తుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని గంగపుత్రులు ఆవేదన చెందుతున్నారు. పాలకులను నమ్ముకోవడం వృథా ప్రయాస అని భావించిన 4 జిల్లాల మత్స్యకార కాపులు, గ్రామపెద్దలు నిర్ణయించుకున్నారు.

కూలిపనులకు వెళ్లాల్సిందే!



సముద్రంలో మత్స్యవేటే మాకు జీవనాధారం. అలాంటిది తమిళనాడుకు చెందిన మత్స్యకారులు చొరబడి సంపదను దోచుకెళుతున్నారు. తమిళ హైపర్‌బోట్లను ఆంధ్రాలోకి రావడాన్ని అడ్డుకోలేకపోతే మాకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. సముద్రంలో చేపలవేట మాని కూలి పనులకు వెళ్లాల్సిందే.

- సున్నపుగుంట గోవిందయ్య, ఇస్కపల్లి

విజయోత్సాహం



వెంకటాచలంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ విజయోత్సవ ర్యాలీ మంగళవారం ఉత్సాహంగా సాగింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలం ఇసుక డంపింగ్ యార్డు నుంచి ఎర్రగుంట వరకు సుమారు 900లకుపైగా ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు. - వివరాలు 8లో..

సూర్య, చంద్రప్రభలపై
వెంకయ్యస్వామి వైభోగం



సూర్యప్రభవాహనంపై కొలువుదీరిన వెంకయ్య స్వామి

వెంకటాచలం, ఆగస్టు 19 : గొలగమూడిలో జరుగుతున్న వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై దర్శనమించారు. వేకువజాము నుంచే స్వామివారికి వివిధ రకాల సేవలను చేసిన అర్చకులు ఉదయం 10 గంటల నుంచి సూర్యప్రభ వాహన సేవకు ఉత్సవమూర్తిని సిద్ధం చేశారు. ఆదిత్యుడిపై కొలువుదీరిన స్వామివారిని గొలగమూడి పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రికి వెంకయ్య స్వామికి చంద్రప్రభ వాహన సేవ వైభవోపేతంగా జరిగింది. సన్నాయి వాయి ద్యాలు మోగుతుండగా భక్తులు ఓం నారాయణ, ఆదినారాయణ అంటూ భజనలు చేస్తుండగా స్వామివారు గ్రామంలో విహరించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

● ఉత్సవాల్లో నేడు

ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం వెంకయ్య స్వామికి హనుమంత, రాతి హంసవాహన సేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.



చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

కావలి ఎమ్మెల్యే కుటుంబీకుల
క్వారీపై డ్రోన్ చక్కర్లు!

- ఇద్దరిని పట్టుకున్న సిబ్బంది, ఒకరు పరారీ !
- పట్టుకున్న వారిలో ఒకరు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి సహాయకుడు
- డ్రోన్, కత్తితో సహా పోలీసులకు అప్పగింత
- ఎమ్మెల్యేను హతమార్చేందుకే రెక్కీ అంటూ కూటమి నాయకుల ఆందోళన

జలదంకి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కుటుంబానికి చెందిన క్వారీపై మంగళవారం డ్రోన్ చక్కర్లు కొట్టడం కలకలం రేగింది. దానిని ఎగరేస్తున్న వారిలో ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిలో ఒకరు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి (వైసీపీ) అనుచరుడు కావడం గమనార్హం. జలదంకి మండలం అన్నవరంలో ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి కుటుంబానికి చెందిన ఓ క్వారీ ఉంది. మంగళవారం మధ్యాహ్నం క్వారీ పరిసరాల్లో డ్రోన్ ఎగురుతుండటం గమనించిన అక్కడి సిబ్బంది ముగ్గురు వ్యక్తులను పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిలో ఒకరు పరారవగా, మరో ఇద్దరిని పట్టుకున్నారు. వీరిలో ఒకరు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు వేణు, మరో వ్యక్తి డ్రోన్ ఆపరేటర్ వినోద్‌గా గుర్తించి జలదంకి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్ రిమోట్‌తోపాటు ఓ కత్తి కూడా ఉన్నట్లు గుర్తించిన క్వారీ సిబ్బంది వాటిని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. తప్పించుకుని పారిపోయిన వ్యక్తి శ్రావణ్‌గా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనపై క్వారీ ఉద్యోగులు జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా, ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డిని హత మార్చేందుకే ఆయన కదలికలపై డ్రోన్ ద్వారా రెక్కీ నిర్వహించారని, దీని వెనుక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి హస్తం ఉందంటూ కూటమి శ్రేణులు ఆందోళన చేపట్టాయి. మంగళవారం పొద్దుపోయాక కావలి బ్రిడ్జి సెంటర్‌లలో నిరసన, అల్లూరు, బిట్రగుంట, దగదర్తిలలో నిరసన ర్యాలీ చేపట్టారు.

అంగన్‌వాడీల్లో ఆన్‌లైన్ ప్రక్రియకు బ్రేక్!

- సీడీపీవోలకు మొబైళ్ల అప్పగింత
- అవన్నీ వైసీపీ ప్రభుత్వం ఇచ్చినవే!
- త్వరలో 5జీ ఫోన్లు ఇస్తాం : పీడీ

ఉదయగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆన్‌లైన్ కార్యకలాపాలు బంద్ అయ్యాయి. మొబైల్ ఫోన్ పనితీరు సక్రమంగా లేకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఎదుట నిరసన చేపట్టి వాటిని సీడీపీవోలకు అప్పగించారు. పోషణ్ ట్రాకర్, బాలసంజీవని యాప్‌లలో ప్రతిరోజు వివిధ రకాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే, వివరాల నమోదుకు ఫోన్ల వేగం సరిపోలేదంటూ కార్యకర్తలు గగ్గోలు పెట్టి, ఈ నెల 4వ తేదీన సీడీపీవోలకు వెనక్కి ఇచ్చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నాణ్యత లేని 2జీ నెట్‌వర్కు కలిగిన ఈ ఫోన్లను ఇవ్వడంతో అప్పట్లో అంగన్‌వాడీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పటికే జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో 4జీ, మరికొన్ని ప్రాంతాల్లో 5జీ నెట్‌వర్కు కొనసాగుతోంది. ఈ తరుణంలో ఫోన్లన్నీ మొరాయిస్తూ వచ్చాయి. అంగన్‌వాడీల రోజువారీ విధులకు ఆటంకం కలిగిస్తున్నాయి. మరోవైపు ఇంటింటా సరుకుల పంపిణీ (టీహెచ్‌ఆర్), పిల్లల హాజరు, బరువు, ఎత్తు కొలతల నమోదు తదితర ప్రక్రియ నిలిచిపోయింది.



మొబైళ్లు వద్దంటూ ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

● 80 శాతం మంది అప్పగింత

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 229 మినీ, 2,705 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలోని సుమారు 80 శాతం మంది కార్యకర్తలు తమ సెల్‌ఫోన్లను సీడీపీవో కార్యాలయాల్లో అప్పగించారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల కార్యాకలాపాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. 5జీ ఫోన్లను సరఫరా చేస్తేనే యాప్‌లో వివరాలు నమోదుకు ఏ ఆటంకాలు ఉండవని అంగన్వాడీలు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ ఫోన్లను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్రాల నిర్వహణ రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం దుకాణాల్లో ఇక పర్మిట్ రూమ్‌లు

- ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- నగరంలో రూ.7 లక్షలు, రూరల్‌లో రూ.5 లక్షలు

నెల్లూరు (క్రైం) (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల పక్కనే మందుబాబులు మద్యం సేవించేందుకు వీలుగా శాశ్వత గదుల (పర్మిట్ రూమ్స్) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 200 మద్యం దుకాణాలు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు కానుండగా, నగర ప్రాంతాల్లో రూ.7 లక్షలు, రూరల్ ప్రాంతాల్లో రూ.5 లక్షలు చెల్లించాలని ఎక్సైజ్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

● ఇప్పటికే అనధికారికంగా..

మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోకూడదని, మద్యం మాత్రమే అమ్మాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిబంధనలు తెచ్చింది. అయితే, ఇందుకు విరుద్ధంగా జిల్లావ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల్లో రూమ్‌లు ఏర్పాటు చేసి కుర్చీలు, టేబుళ్ల వంటి ప్రత్యేక ఏర్పాటు చేసి మందుబాబులతో మద్యం తాగిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పర్మిట్ రూమ్‌లను కేటాయించి, ప్రతి సంవత్సరం నగదు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

బిల్లులేవి సార్!?

- ఇరిగేషన్ శాఖలో నిలిచిన బిల్లుల చెల్లింపు
- ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు
- ఓఅండ్‌ఎం బిల్లులు అప్‌లోడ్ చేసేందుకూ లేని బడ్జెట్
- డీఆర్సీలోనూ ప్రస్తావించిన ఎమ్మెల్యేలు
- రానున్న సీజన్‌పై పడనున్న ప్రభావం



ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇరిగేషన్ శాఖలో ఓఅండ్‌ఎం పనులు వేగంగా చేయించారు.. కానీ ఇంత వరకూ ఒక్క రూపాయి బిల్లు విడుదల చేయలేదు. ఈ ఏడాది రెండో పంట సమయంలోనూ అదే మాదిరిగా నీటి సంఘాల చేత ఓఅండ్‌ఎం పనులు చేయించారు.. కానీ ఇప్పటికీ ఆ బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు బడ్జెట్ లేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రానున్న సీజన్ మాటేమిటి..? అప్పుడు ఓఅండ్‌ఎం పనులు ఎలా? అన్నది ఇప్పుడు రైతాంగంలో ఆందోళన రేకెత్తిస్తోంది. ఇరిగేషన్ శాఖను బిల్లుల సమస్య వేధిస్తోంది. చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారు. దీంతో కొత్తగా వీరి చేత పనులు చేయించుకోవడం అధికారులకు ఇబ్బందిగా మారింది.

- వివరాలు 8లో..

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 520

వర్షానికి పగిలిన విద్యుత్ లైన్ ఇన్సులేటర్లు

లింగసముద్రం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు లింగసముద్రం-1 సచివాలయం సమీపంలోని పొలాల్లో గల 33/11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సబంధించిన ఇన్సులేటర్లు పగిలిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇన్సులేటర్లు రెండు పగిలి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో విషయం తెలసిన వెంటనే మండల ఏఈ షేక్ ఫిరోజ్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన కదిలి సమస్య ఎక్కడ వచ్చిందో గుర్తించి, సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి ఇన్సులేటర్లు బిగించి సాయంత్రం 6.30 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అక్రమార్కుల అడ్డా.. 'బస్టాండ్'!

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా
- ఆక్రమిస్తాం.. అద్దెలకిస్తాం.. అడ్డొచ్చేదెవరు?
- పంచాయతీ ఆదాయానికి గండి
- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రోడ్లు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


వలేటివారిపాలెం ప్రధాన బస్టాండ్ ప్రాంతం

వలేటివారిపాలెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వలేటివారిపాలెం బ స్టాండు ప్రాంతం అక్రమార్కులకు అడ్డాగా మారింది. ఈ సెంటర్లో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రైవేట్ స్థలాల యజమానులు చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి రేకుల షెడ్లు వేసి దుకాణదారులకు అద్దెకిస్తున్నారు. సర్కారు స్థలాలు కబ్జా చేసి అద్దెల రూపంలో రూ.లక్షల సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. బ స్టాండు సెంటర్లో రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడ సెంటు భూమి రూ.10 లక్షలకు పైగానే ధర ఉంది. ఎకరా దాదాపు రూ.10 కోట్లకు పైమాటే. రోడ్డుకు రెండు వైపులా సుమారు 5 ఎకరాలకు పైగానే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. వీటి విలువ రూ.50 కోట్లకు పైనే ఉంటుంది. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను సుమారు వంద మందికి పైగానే దుకాణదారులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు.

● ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రోడ్లు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి రేకులషెడ్లు వేసి దుకాణదారులకు అద్దెలకివ్వడంతో రోడ్లు ఆక్రమణలతో కుంచించుకపోతున్నాయి. దీంతో వివిధ పనులపై వచ్చే వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసే స్థలం లేక రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. అంతేగాకుండా దుకాణదారులు తమ దుకాణాలు ముందు ఎత్తు పెంచుకునేందుకు మట్టి తోలుకుంటున్నారు. దీంతో వర్షం నీరు పోయే అవకాశం లేక రోడ్లపైనే నిలబడుతున్నాయి. దీంతో బస్టాండు సెంటరు బురదబురదగా మారుతొంది. ప్రయాణీకులు బస్సుల కోసం ఆ బురదలోనే నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది.

● ట్రాఫిక్‌కు అంతరాయం...

రోడ్లు ఆక్రమణకు గురవడంతో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండు సెంటరు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఈ ప్రాంతీయులు హైదరాబాద్, చెన్నై, విజయవాడ, బెంగళూరు తదితర పట్టణాలకు వెళ్లాలంటే వలేటివారిపాలెం బస్టాండు సెంటరుకు వెళ్లి బస్సులు ఎక్కాల్సిందే. అంతేగాకుండా ప్రతి శనివారం మాలకొండ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులతో బస్టాండు సెంటరు కిటకిటలాడుతోంది. వ్యవసాయ పనుల సీజన్లో కూడా బస్టాండు సెంటరు రద్దీగా ఉంటుంది. దీంతో ప్రయాణికులకు నిరంతరం ట్రాపిక్ ఇక్కట్లు తప్పడంలేదు.

● పంచాయతీ ఆదాయానికి గండి..

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారులు పంచాయతీకి పైసా కూడా చెల్లించడంలేదు. దీంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. స్థలాలు ఆక్రమించి, వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారుల నుంచి పంచాయతీ అధికారులు రుసుం వసూలు చేయవచ్చు. రుసుం చెల్లించని వాళ్లకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వ స్థలాల్లోని దుకాణాలను తొలగించే అధికారం పంచాయతీకి ఉంది. అయితే ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఒక్కో దుకాణదారు నుంచి రోజుకు రూ.10ల చొప్పున నెలకు రూ.3 వందలు రుసుం వసూలు చేయవచ్చు. అలా వంద దుకాణదారుల నుంచి నెలకు రూ.30 వేలు చొప్పున ఏడాదికి రూ.3లక్షల 60 వేలు రుసుం వసూలు అవుతోంది. ఈ ఆదాయాన్ని పంచాయతీలో అబివృద్ధి పనులకు వినియోగించవచ్చు. కానీ ఆ దిశగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు.

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

బస్టాండు సెంటరులో కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు అక్రమణలకు గురవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా పంచాయతీ ఆదాయానికి గండిపడుతోంది. దీంతో పంచాయతీల్లో అబివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులుతోపాటు ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, పంచాయతీకి ఆదాయాన్ని చేకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే హత్యకు మాజీ ఎమ్మెల్యే కుట్ర

● టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల ఆందోళన


కావలి బ్రిడ్జి సెంటర్‌లో ఆందోళన చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

కావలి/అల్లూరు/బిట్రగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని హత్య చేసేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుట్రపన్ని పథకం రూపొందించారని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం కావలి బ్రిడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రతాప్‌రెడ్డికి, వైసీపీ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అలాగే అల్లూరులో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలదంకి మండలం అన్నవరంలో ఎమ్మెల్యేకి సంబంధించిన గురురాఘవేంద్ర మెటల్ క్వారీలో ఎమ్మెల్యేను హత్య చేయాలనే ఉద్దేశంతో మారణాయుధాలు, డ్రోన్‌తో కొందరు క్వారీ వద్దకు చేరుకున్నారన్నారు. క్వారీ వ్యూ, అక్కడ ఆయన కార్యాలయం ఆయన ఎలా వచ్చి ఎలా వెళ్లతారో తదితరాలు తెలుసుకునేందుకు డ్రోన్‌తో చిత్రీకరించటంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వారిలో ఇద్దరిని పట్టుకోగా వారి వద్ద కత్తి ఉందన్నారు. దీంతో ఎమ్మెల్యే అక్కడకు వస్తే ఆయనను హత్యచేయాలనే ఉద్దేశ్యంతోనే వెళ్లారని వారు ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, జనసేన నేత సిద్దూ తదితరులు ఉన్నారు.

● అల్లూరు మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిపై మండిపడ్డారు. అల్లూరు ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి టీడీపీ కార్యాలయం నుంచి పాతబస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, ఎందేటి హరికృష్ణ, బీజేపీ ప్రతినిధులు కత్తుల కిరణ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.


అల్లూరు ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

● బోగోలు టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎల్.సుధీర్‌బాబు, కే.వెంకటేశ్వరరెడ్డి, బీ.ప్రభాకర్, ఏ.ఆదిశేషయ్య, వీ.మహేష్‌రెడ్డి, జీ.సంజయ్, ఫిలిప్, రఫీ, ఎస్ఎస్ యాదవ్, బీజేపీ జిల్లా నేత ఎస్ఎస్‌యాదవ్, మండల కన్వీనర్ వీ.శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


బిట్రగుంట : వెలుపోడు కూడలిలో టీడీపీ నేతలతో కలసి నిరసన తెలుపుతున్న పమిడి రవికుమార్ చౌదరి

● దగదర్తి మండలం వెలుపోడు కూడల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నీచమైన రాజకీయాలను ప్రజలు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఏ.హనుమంతరావు, నేతలు జీ.హరికిశోర్‌రెడ్డి, వీ.కొండపునాయుడు, మురళీమోహన్, వడ్డేవినయ్‌కుమార్, కే.సురేష్, పులిశీనయ్య, టీ.సుధాకర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలి

● కందకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రజా (కూటమి) ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి అండగా నిలబడాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని కరేడులో తారురోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే యుద్ధప్రాతిపదికన గుంతలు లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అందులో భాగంగా కరేడు ర్యాంపు నుంచి చేవూరు వరకు రూ.2.45 కోట్ల నాబార్డు నిధులతో తారురోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. లింగసముద్రం మండలం చీమలపెంట రోడ్డుకు కూడా మరో రూ.5 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలోని ఏ మండలంలో కూడా గుంతలు పడిన రోడ్లుకు గంపడు మట్టి వేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నారని, మరోవైపు రాష్ట్రాభివృద్ధికి దోహదపడే పరిశ్రలు, ఐటీ రంగంపై దృష్టి సారించారన్నారు. అనంతరం కార్యకర్తలు, ప్రజల నుంచి వితనతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, టీడీపీ నాయకులు రాచగల్లు సుబ్బారావు, నేలటూరి ఆదాము, పోలుబోయిన శ్రీనివాసులు, మెట్టా శ్రీనివాసుల రెడ్డి, జెట్టి సుబ్బరామిరెడ్డి, బాలమురళి, వాయిల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

కావలి(టౌన్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాలపై విద్యార్థి సంఘాలు చేసిన పోరాటాలకు టీడీపీ, బీజేపీ, జనసేన మద్దతు పలికాయని, తమ ప్రభుత్వ వస్తే విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరిస్తామన్న హామీ విస్మరించడమేకాక మరింత దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమం తలపెట్టామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి 15నెలలు పూర్తయినప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గు చేటన్నారు. జీవో 77ను రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్‌తో ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమ కార్యచరణ రూపొందించి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు అభిలాష్, సభ్యులు వెంకటబాలు, రాహుల్, జయంత్, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

'వయ్యారి భామ' నిర్మూలనపై అవగాహన


కలుపు మొక్కల నిర్మూలనపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న కేవీకే డైరెక్టర్ ప్రసాద్‌బాబు, శాస్త్రవేత్తలు

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వయ్యారి భామ కలుపు మొక్కలు (పార్థీనియం) నిర్మూలనపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే) డైరెక్టర్ ప్రసాద్‌బాబు కోరారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కేవీకే ఆధ్వర్యంలో వయ్యా రిభామ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కలుపు మొక్కల తీవ్రత, వ్యాప్తి గురించి ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో వయ్యారిభామ కారణంగా పంట ఉత్పత్తుల దిగుబడిపై 30 శాతం వరకు ప్రభావం పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో ఉన్న పార్థీనియం కలుపు మొక్కలను తొలగించా రు. తొలగించిన మొక్కలను ఒకచోట చేర్చి తగులబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, వృక్షశాస్త్ర విభాగం ఇన్‌చార్జి ఎస్.తిరుపతి స్వామి, అధ్యాపకులు ఐ.అనూష, పీ.రాజగోపాలబాబు, ఎం.బాలునాయక్, కె.కరుణరత్నకుమార్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతూ ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో కేవీ శేషారెడ్డి సూచించారు. అంకభూపాలపురంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సజ్జ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు** : వేరుశనగ పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో విజయ్‌కుమార్ తెలిపారు కరేడులోని రైతు సేవా కేంద్రాలు 1, 3 పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వేరుశన పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్, వీహెచ్ఏ మసూద్‌బాషా పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సబ్ కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టరుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దామెర హిమ వంశీని మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ కలెక్టరును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలోని పలు విషయాలపైన. కరేడు భూసేకరణ తదితర అంశాలపై ఎమ్మెల్యే సబ్ కలెక్టరుతో చర్చించారు.

48 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

లింగసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-శోళ్లపాడు భారీ మంచినటి పథకం నుంచి మంచినీటి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం తెల్లవారుజామున ఈ మంచినీటి పథకానికి చెందిన విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో ఈ పథకం నుంచి సుమారు 48 గ్రామాలకు నీటి సరఫరా నిలిచి పోయింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని నీటి సరఫరాను పునర్ధురించాలని ప్రజలు కోరుతున్నారు.

రథం నిర్మాణానికి నేడు పూజలు

ఉలవపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులో వెలసియున్న వేణుగోపాల స్వామి ఆలయ నూతన రథం నిర్మాణానికి బుధవారం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వీ.శ్రీనివాస్ మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీలకు ఒకే యాప్ పెట్టాలి

కావలి(టౌన్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలకు ప్రస్తుతం ఉన్న యాప్‌లన్నింటిని రద్దు చేసి ఒకే యాప్ విధానం తీసుకురావాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహానాబేగం డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన అంగన్వాడీల 5వ మహాసభలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పనికి రాని ఫోన్ల స్థానంలో 5జీ కొత్త ఫోన్లను ఇవ్వాలని కోరారు. ఈనెల 23న నెల్లూరులో జరిగే అంగన్వాడీల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయంతి కుమారి, గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, రుక్మిణి, సుభాషిణి, విజయలత తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు అందుకున్న లబ్ధిదారులు అప్పీల్ చేసుకోండి

కొండాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పింఛన్ రద్దు, మార్పు కోసం నోటీసులు అందుకున్నలబ్ధిదారులు అప్పీల్ చేసుకునేందుకు వెసులుబాటు ఉందని ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 250 మందికి నోటీసులు ఇచ్చారన్నారు. నోటీసులు అందుకున్న వారు నోటీసుతోపాటు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్లు (పాతవి, కొత్తవి) అలాగే వైద్యశాలలో చికిత్స పొందిన, పొందుతున్న సర్టిఫికెట్లు ఎంపీడీవో కార్యాలయంలో అందచేస్తే ఎంపీడీవో లాగిన్ నుంచి మరోసారి నోటీసులు అందజేస్తారన్నారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి నిర్దేశిత తేదీతో ఈ నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు సూచించిన వైద్యశాలకు మరోసారి పునఃపరిశీలకు వెళ్లాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

నేడు చేవూరులో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

గుడ్లూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా నిర్మాణం జరుగుతున్న ఇండోసోలార్ కంపెనీ ప్రాంతాన్ని కలెక్టర్ ఓ. ఆనంద్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమ వంశీ బుధవారం పర్యటిస్తారని ఇండోసోలార్ పీఆర్‌వో లక్ష్మీనాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండోసోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా స్థానిక యువతకు, ప్రాజెక్టుకు భూములు సమకూర్చిన వారికి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చిన కుంటేబాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

కల్లయ్య మృతికి టీడీపీ నేతల సంతాపం

కలిగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఇంగ్లే కల్లయ్య(72) మంగళవారం అకాలమరణం చెందాడు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, పలువురు నాయకులు కల్లయ్య భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊసా మాల్యాద్రి, పుల్లా కామేశ్వరరావు, చల్లా వెంకటేష్, బైరిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక మంగళగౌరీ వ్రతం

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దబజారులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా మంగళగౌరీ వ్రతం నిర్వహించారు. ఆలయ పూజారి రాజాస్వామి అమ్మవారిని కనుల పండువగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన మంగళగౌరీవ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కోట వెంకటనరసింహం, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలి

బిట్రగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులు పంటకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాని పెంచాలని జిల్లా ఆత్మ పీడీ మురళి అన్నారు. బోగోలు మండలం తాళ్లూరులో ఏవో శైలజ ఆధ్వర్యంలో మంగళవారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ పీడీతో పాటు కావలి ఏడీఏ నాగరాజు పాల్గొన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. అలాగే యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, వాడకం వలన కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఏవో పౌలు, వీఏఏ ప్రతాప్ పాల్గొన్నారు.

ఈ వర్షాలతో జాగ్రత్త సుమా!

- వరి, వేరుశనగ, నిమ్మ పంటలకు తెగుళ్లు ఆశించే అవకాశం
- మందులు పిచికారీ చేస్తే మంచిది
- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ప్రధానంగా వరి, వేరుశనగ పంటలు సాగులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా పంటలు తెగుళ్ల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. చిరుపొట్ట దశ నుంచి కంకి దశలో ఉన్న వరికి ఆకునల్లి, నల్లనొక్కు, పొట్టకుల్లు తెగుళ్లు సోకే అవకాశం ఉంది. అదేవిధంగా వేరుశనగకు తిక్క మచ్చ, త్రుప్పు తెగులు, నిమ్మలో బంక తెగులు, వేరుకుళ్లు, గజ్జి తెగుళ్లు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. వీటి నుంచి పంటలను రక్షించుకునేందుకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ విజయ కుమార్‌నాయక్ పలు సూచనలు అందిస్తున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతావరణ పరిస్థితులు పొట్టకుళ్లు, మానిపండు తెగుళ్లకు అనుకూలం. పొలాల్లో ఈ రెండు తెగుళ్లను గుర్తించారు. రైతులు ముందు జాగ్రత్తగా ప్రొపికొనజోల్ 200మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలి. వరిలో ప్రధానంగా ఆకు, కంకినల్లి తెగుళ్లను కూడా గుర్తించారు. అయితే కురుస్తున్న వర్షాలకు ఆకునల్లి తీవ్రత తగ్గుతుంది. అయినా వర్షం ఆగిన తరువాత నల్లి తీవ్రతను అక్కడక్కడా గుర్తిస్తే ప్రొఫెనోఫాస్ 400మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే స్పైరోమెసిఫెన్ 200మి.లీ పిచికారీ చేయాలి. అదేవిధంగా నల్లనొక్కు గుర్తిస్తే ప్రొఫెనోఫోస్ 400మి.లీ ఇంకా ప్రొపికొనజోల్ 200మి.లీ కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి. పంటలో ఎక్కడైనా సుడిదోమ ఉంటే ప్రొఫెనోఫాస్ పిచికారీ చేయాలి.

● వేరుశనగకు కుళ్లు తెగుళ్లు

వేరుశనగ పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తిక్క మచ్చ, త్రుప్పు తెగులు అనుకూలం. దీన్ని గుర్తిస్తే వర్షం ఆగిన తరువాత టేబుకొనజోల్ 200మి.లీ లేదా టేబుకొనజోల్ 160గ్రాములు, ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ (నేటివో) రెండు కలిపి లేదా క్లోరోథలోనిల్ 400గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలి. వర్షం ఆగిన తరువాత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటే కాండం, వేరుకుళ్లు తెగుళ్ల తీవ్రత పంటకు ఎక్కువయ్యే అవకాశం ఉంది. పూతదశలో ఉన్న వేరుశనగ పంటలో ట్రైకొడెర్మ పొడిని పశువుల ఎరువులో కలుపుకుని పొలంలో తేమ ఉన్నప్పుడు చల్లుకోవాలి. 5-7రోజుల తరువాత ఎకరాకు సాఫ్ 400గ్రాముల పొడిని నేల తడిచేటట్లు పిచికారీ చేస్తే కొంతమేర ఈ తెగులును అరికట్టవచ్చు. జిప్సం ఇంకా వేయని రైతులు పూతదశలో ఎకరాకు 200కేజీలు వేసుకోవడం వల్ల కుళ్లు తెగుళ్ల తీవ్రత తగ్గించుకోవడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చు.



ఇందుకూరుపేట మండలం నరుకూరులో తెగుళ్లు ఆశించిన వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

● నిమ్మలో బంక, వేరుకుళ్లు తెగులు

ఈ వాతావరణంలో నిమ్మ పంటకు బంక తెగులు, వేరుకుళ్లు, గజ్జి తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ట్రైకోడెర్మ అనే జీవనియంత్రణ నాశినిని పశువుల ఎరువు, వేప పిండిలో 15రోజులు మగ్గనిచ్చి పాదులు, చెట్ల మొదళ్ల దగ్గర కొద్దిగా మట్టి తీసి వేసుకోవాలి. తరువాత మట్టితో కప్పి నీళ్లు ఇవ్వాలి. బంక కారి కుళ్లిన బెరడును పూర్తిగా గోకి బోర్డోపేస్ట్ లేదంటే కాపర్ ఆక్సీక్లోరడ్ లేదంటే మాంకోజెబ్ పేస్టు పూయా లి. లీటరు నీటికి 1గ్రాము కర్బం డజిం మందు ద్రావణాన్ని చెట్టు మొత్తం తడిచేటట్టు 15రోజుల వ్యవధిలో 2-3సార్లు పిచికారీ చేయాలి. అదేవిధంగా లీటరు నీటికి 3గ్రాముల మాంకోజెబ్ కలిపిని 20-25లీటర్ల మందు దావ్రణాన్ని చెట్టు పాదుల్లో పోయాలి. నిమ్మలో గజ్జి తెగులు ఆశించిన కొమ్మలను కత్తిరించి 10లీటర్ల నీటిలో స్ట్రెప్టోటమైసిన్ సల్ఫేట్, 30గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు ద్రావణాన్ని 15రోజుల వ్యవధిలో 2-3సార్లు కొమ్మలపై పిచికారీ చేయాలి. కొమ్మలు కాండంపైన బెరడు గోకిన తరువాత బోర్డోపేస్ట్ ద్రావణాన్ని పూయాలి.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవాణి

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రం-1లో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాకు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. జామాయిల్ తోటలు సాగు చేసే రైతులకు యూరియా పంపిణీ చేయరని, కాంప్లెక్సు ఎరువులు వాడుకోవాలని ఆమె సూచించారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి అవసరమైన వారికి యూరియా అందించాలన్నారు. పంట సాగు చేసిన ప్రతిరైతు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం అందని రైతులు సమీపంలోని రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయగిరి ప్రాంత రైతులకు కందులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మినుములు కూడా వస్తాయన్నారు. వ్యవసాయరంగంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీ రావు, లక్ష్మీమాధవి, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారులు చెన్నారెడ్డి, మదన్ మోహన్, వెంకటసుబ్బారెడ్డి, విజయభాస్కర్, సునీల్, ఏఈవోలు, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమాధికారికి ఉద్యోగోన్నతి



పరిమళ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా పని చేస్తున్న పీటీకే పరిమళకు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ప్రస్తుతం ఆమె ఆ శాఖాంశాలపై శిక్షణలో ఉన్నారు. శిక్షణ తరువాత నెల్లూరుకు వచ్చి రిలీవ్ అవుతారు. పాడేరులో డీడీగా బాధ్యతలు స్వీకరిస్తారు.

కాకాణి విడుదలల్లో జాప్యం

- బెయిల్ పత్రాల సమర్పణ ఆలస్యం
- నేడు జైలు నుంచి విడుదల

నెల్లూరు(క్రైం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ కారాగారం నుంచి ఆయన విడుదల మరోరోజు ఆలస్యమవుతోంది. మాజీ మంత్రి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదలవుతారని అందరూ భావించారు. అయితే బెయిల్ పత్రాలను సెంట్రల్ జైలుకు సాయంత్రం 5 గంటల్లోపు అందించక పోవడంతో కాకాణి విడుదల నిలిచిపోయింది. బుధవారం ఉదయం 10 గంటల పైన కాకాణి విడుదలయ్యే అవకాశం ఉంది. కాగా, గోవర్ధన్‌రెడ్డికి భారీగా స్వాగతం పలికేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే కోర్టు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాట్లు చేయడంతో పోలీసులు బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించారు.

ఇదో రకం బ్లాక్‌మెయిల్ !

- ఆకాశరామన్న ఉత్తరాలతో బెదిరింపులు
- పంచాయతీ నిధులపై సమాచారం కోసం దరఖాస్తు
- ఆపై నగదు పంపాలని డిమాండ్


మర్రిపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు వస్తున్న ఆకాశ రామన్న ఉత్తరాలతో ఆయా పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. స్థానిక పంచాయతీలకు, మండలానికి సంబంధం లేనివారు పంచాయతీ నిధులు, జమాఖర్చుల వివరాలు కావాలని. ఎంబుక్‌లు, క్యాష్‌బుక్, పంచాయతీ తీర్మాణాల సమాచారం ఇవ్వాలని దరఖాస్తు చేస్తూ రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఉత్తరాలు పంపుతున్నారు. సమాచారం ఇవ్వాల్సిన గడువు దగ్గరయ్యేకొద్దీ, సమాచారం కోరినవారు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా, ఫోన్ ద్వారా పంచాయతీ కార్యదర్శులను బెదిరిస్తున్నారు. అంతేకాక నగదు కోసం బేరసారాలాడుతున్నారు.

● స.హ.చట్టాన్ని అడ్డుపెట్టుకుని..

మర్రిపాడు మండలంలో గత 7,8 నెలల నుంచి ఇలాంటి ఘటనలు అధికమయ్యాయి. త్వరగా ఆ లెటర్‌ను ఏదో ఒకటి చేసి ముగించండి.. అంటూ వారికి మద్దతుగా కోరస్ పలుకుతూ కార్యాలయంలో కొందరు అధికారులు ఉంటున్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి సమాచారహక్కు చట్టం ఉపయోగకరంగా ఉంది. కానీ కొందరు అక్రమార్జనే ధ్యేయంగా ఆ చట్టాన్ని అడ్డం పెట్టుకొని దందాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చట్టాన్ని వినియోగించుకుని ప్రతీ సామాన్యుడు ఏ కార్యాలయానికి వెళ్లినా పనిచేయించుకోవడం, తనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైంది.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని 2005లో అమలులోకి తెచ్చింది. కానీ మండలంలోని పలు కార్యాలయాలకు నెల్లూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన సుమారు ఆరుగురి చిరునామాలతో ఉత్తరాలు వస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శులు పేర్కొన్నారు. ప్రతీ కార్యదర్శి ఒక్కొక్క ఉత్తరానికి కనీసం రూ. 5 నుంచి రూ. 10వేలు నగదును తప్పక పంపించాల్సి ఉంది. నెల్లూరు ఏసీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి గతనెల 7న సమాచారం కోరుతూ డీసీ పల్లి పంచాయతీకి ఉత్తరం పంపారు. సమాచారం ఇవ్వటానికి గడువు ముగుస్తుండటంతో ఏదో ఒకటి తేల్చమని పంచాయతీ కార్యదర్శికి వాట్సాప్ మెసేజ్ పెట్టాడు. అదేపనిగా ఉత్తరాలు రాస్తూ నగదు వసూళ్లకు పాల్పడుతున్న టీమ్ కూడా ఒకటి ఉన్నట్లు, ఆ టీమ్‌కు ప్రతీ మండలంలోని ఎవరో ఒక అధికారితో సంబంధాలు కలిగి ఉన్నట్లు మండల ప్రజలు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



డీసీపల్లి పంచాయతీ నిధుల వివరాలు కావాలని కోరుతూ నెల్లూరుకి చెందిన వ్యక్తి చేసుకున్న దరఖాస్తు



సమాచార హక్కు చట్టం ప్రకారం సమయానికి కచ్చితమైన సమాచారం ఇవ్వాలని పంపిన వాట్సాప్ మెసేజ్

దూర విద్యావిధానంలో పది, ఇంటర్

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారు దూర విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబరు 15వతేదీ వరకు రూ.200 అపరాధ రుసుముతో అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన ఉద్యోగులు, గృహిణులు, వివిధ వృత్తులు, వ్యాపార రంగాలవారు, ఆర్థికంగా వెనుకబడినవారు, ప్రజాప్రతినిధులు, బడి మధ్యలో మానేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వాం సచివాల యాల్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 89194228319 నెంబరునుగానీ సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ భవనం కూల్చివేతపై విచారణ

కావలి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలంచర్లలో పాడుబడిన పంచాయతీ భవనం కొంతభాగం తొలగింపుపై కలెక్టర్ ఆనంద్‌కు ఓ వ్యక్తి పిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మంగళవారం ఎంపీడీవో శ్రీదేవి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ భవనం కూల్చివేతపై గ్రామానికి చెందిన తల్లిబోయి సురేష్ ఈనెల 11వ తేదీ పీజీఆర్ ఎస్‌లో కలెక్టర్‌కు పిర్యాదు చేశారని దానిపై గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టామన్నారు. గ్రామ సభ పెట్టి ఆస్థలం తీసుకుని ఉంటే మాకు ఎలాంటి అభ్యంతరం ఉండేది కాదని, టీడీపీ నాయకులు తమ ఇష్టాను సారం తొలగించారని పిర్యాదు దారుడు తెలిపాడు. స్థానిక టీడీపీ నాయకులు మాత్రం 4నెలల క్రితం పంచాయతీరాజ్ ఏఈ ఈ భవనాన్ని పరిశీలించి నివాసయోగ్య మైనది కాదని, తొలగించవచ్చని సర్టిఫికెట్ ఇవ్వడంతో పంచాయతీ తీర్మానం పెట్టి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రాములవారి గుడి అవసరాల కొసం కొంత భాగాన్ని తొలగింపునకు గ్రామానికి చెందిన 150 మంది సంతకాలతో సచివాలయంలో అర్జీ కూడా ఇచ్చామని తెలిపారు. ఎమ్పీడీవో శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలు తొలగింపు పంచాయతీ తీర్మానంతో పాటు అధికారుల అనుమతి ఉండాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కార్యదర్శి శ్యామ్‌ను ఆదేశించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

ఉప ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే గుణపాఠం చెప్పారు

● 'అన్నదాత సుఖీభవ'తో రైతుల్లో రెట్టింపు సంతోషం ● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తుండడంతో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్పారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలో మంగళవారం వందలాది ట్రాక్టర్లతో 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలం ఇసుక డంపింగ్ యార్డు నుంచి ఎర్రగుంట వరకు సుమారు 900పైగా ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు. తొలుత సోమిరెడ్డి ఎడ్ల బండిపైన, ఆ తర్వాత ట్రాక్టర్ ఎక్కి ఉత్సాహంగా విజయోత్సవంలో పాల్గొన్నారు. ఎర్రగుంట వద్ద కమ్యూనిటీ హాలులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.9300 కోట్లతో అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ' పథకంతో రైతుల్లో సంతోషం రెట్టింపయిందన్నారు. చంద్రబాబు హయాంలో వ్యవసాయానికి పూర్వవైభవం వచ్చిందన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకాలకు మహిళల నుంచీ విశేష స్పందన లభిస్తోందన్నారు. కేవలం నాలుగు రోజుల్లో 19 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి గ్రహణం పడితే ఇప్పుడు పోలవరం, అమరావతి రాష్ట్రాభివృద్ధికి ఐకాన్‌గా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నేతలు రావూరి రాధాకృష్ణమ నాయుడు, బొమ్మి సురేంద్ర, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, జనసేన సమన్వయకర్త సురేష్ నాయుడు, టీడీపీ మండలాధ్యక్షులు, సొసైటీ, ఇరిగేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



రైతు రథాన్ని నడుపుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

సోమిరెడ్డి పిలుపుతో రోడ్డెక్కిన వందలాది రైతు రథాలు

సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో చేప ట్టిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ విజయోత్సవ ట్రా క్టర్ల భారీ ర్యాలీ గ్రాండ్ సక్సెస్ అయింది. సంప్రదాయ పంచె కట్టుతో సోమిరెడ్డి విచ్చేశారు. అన్నదాతలు ఉత్సాహంగా ర్యాలీలో భాగ స్వాములయ్యారు. సోమిరెడ్డి ఇచ్చిన పిలుపుతో 900కుపైగా రైతు రథాలు రోడ్డెక్కాయి. జాతీయ రహదారిపై జాతరలా సాగింది. సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్.. సర్వేపల్లి విజయోత్సవ ర్యాలీ డబుల్ సక్సెస్ అయిందంటూ సోమిరెడ్డి రైతులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

బిల్లులేవి సార్!?

- ఇరిగేషన్ శాఖలో నిలిచిన బిల్లుల చెల్లింపు
- ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు
- ఓఅండ్ఎం బిల్లులు అప్‌లోడ్ చేసేందుకూ లేని బడ్జెట్
- డీఆర్సీలోనూ ప్రస్తావించిన ఎమ్మెల్యేలు
- రానున్న సీజన్‌పై ప్రభావం

నెల్లూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి కాలువలను నిర్వీర్యం చేశారు. పనులు చేయకుండానే చేసినట్లుగా చూపి బిల్లులు తినేశారు. ఆ ప్రభావంతో కాలువల్లో నీరు పారడం కూడా కష్టంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గతేడాది మొదటి పంట సమయంలో ఓఅండ్ఎం పనులు చేపట్టారు. ఓఅండ్ఎం హెడ్ కింద నిధులు లేకపోయినప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎస్‌డీఎంఎఫ్ (రాష్ట్ర విపత్తుల నిధి) నుంచి నిధులను కాలువల నిర్వహణ పనులను అనుమతులు ఇచ్చారు. రూ.26 కోట్లతో కాలువలను బాగు చేయడంతో మొదటి పంట సాఫీగా జరిగింది. జరిగిన పనులన్నింటినీ ఫొటోలు, వీడియోలు తీసి ప్రభుత్వానికి పంపారు. ఈ పనులకు సంబంధించిన బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయగా, అవి ఇంకా విడుదల కాలేదు. ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్నాయి. అయితే ఈ ఏడాది రెండో పంటకు గానూ ఏప్రిల్, మే నెలల్లో నియోజకవర్గానికి రూ.2 కోట్లు చొప్పున ఓఅండ్ఎం నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.20 కోట్లు మంజూరు కాగా అందులో రూ.10 కోట్ల మేర పనులను సాగునీటి సంఘాల ద్వారా పూర్తి చేశారు. ఈ బిల్లులను అప్‌లోడ్ చేయాలంటే వీటికి బడ్జెట్ లేదు. దీంతో ఈ బిల్లులన్నీ జిల్లా అధికారుల వద్ద పెండింగ్ ఉన్నాయి. కాగా కొన్ని కోర్టు కేసులకు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.



డీఆర్సీలోనూ చర్చ

ఏడాది కాలంలో జరిగిన ఓఅండ్ఎం పనులన్నీ చాలా వరకూ కూటమి పార్టీల నేతలే చేశారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో వీరంతా ఆయా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో గత నెలలో జరిగిన డీఆర్సీ సమావేశంలో ఓఅండ్ఎం బిల్లుల పెండింగ్ అంశాన్ని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. బిల్లులు ఇవ్వకపోతే పనులు చేసిన వారు నష్టపోతారని, ఆ ప్రభావం అంతిమంగా రైతులపై పడుతుందని ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే మరో మూడు వారాల్లో రెండో పంట వరి కోతలు పూర్తవుతాయి. ఆ తర్వాత కీలకమైన రబీ సీజన్ మొదలవుతుంది. అప్పుడు కాలువల్లో ఓఅండ్ఎం పనులు చేయాల్సి ఉంటుంది. చేసిన పనులకే బిల్లులు రాకుంటే ఉంటే, మళ్లీ పనులు చేసేందుకు ఎవరు ముందుకొస్తారన్న ఆందోళన అధికార వర్గాల్లోనూ కనిపిస్తోంది. అప్పుడు మళ్లీ పనులు చేయించేందుకు తంటాలు పడాల్సి ఉంటుందని వాపోతున్నారు.

ఆ మహిళకు సిఫార్సు లేఖ ఇవ్వలేదు!

- ఫొటో వేసినందుకు జగన్‌రెడ్డి రోత పత్రికకు థ్యాంక్స్
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా తమ ముఖాలు మాత్రమే చూపించే జగన్‌రెడ్డి రోత పత్రికలో ఇప్పుడు తన ఫొటోను ప్రచురించినందుకు ఆ పత్రికకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి థాంక్స్ చెప్పారు. మండలంలోని ఎర్రగుంటలో జరిగిన ఓ కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. మీడియాలో వైరల్ అవుతున్న తన ఫొటోకు సంబంధించి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు క్లారిటీ ఇచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన ఓ సంస్థ చైర్మన్ సిఫార్సుతో ఓ మహిళ తన వద్దకు వచ్చారన్నారు. తన కార్యాలయానికి వచ్చి రాగానే శాలువా కప్పి తన భర్త జైలులో ఉన్నాడని, పెరోల్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి సిఫార్సు లేఖ ఇవ్వాలని కోరారని చెప్పారు. వేరే నియోజకవర్గానికి చెందినవారి విష యంలో తాను జోక్యం చేసుకోనని స్పష్టం చేసినట్లు సోమిరెడ్డి పేర్కొన్నారు. ఆ మహిళ వెళ్లిపోయాక జైళ్ల శాఖ అధికారికి ఫోన్ చేస్తే జైలులో ఉన్న వ్యక్తి నేరచరిత్ర మొత్తం వివరించారని, ఆ తర్వాత మరో మూడుసార్లు ఆ మహిళ తన కార్యాలయానికి వచ్చినా సిఫార్సు లేఖ ఇవ్వలేదన్నారు. తన కార్యాలయానికి పరిచయం లేని వ్యక్తులు కూడా వచ్చి మర్యాద పూర్వకంగా శాలువాలు కప్పి బోకేలు ఇచ్చి వెళ్తుంటారని, అదే క్రమంలో ఓ మహిళ తనకు శాలువా కప్పిన ఫొటోను జగన్‌రెడ్డి రోత పత్రికలో ప్రచురించడం చూశానన్నారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి రోత పత్రికకు సోమిరెడ్డి థాంక్స్ చెప్పారు.

960.48 హెక్టార్లలో మొక్కల పెంపకమే లక్ష్యం

● డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

ఉదయగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు అటవీశాఖ కార్యాలయాల పరిధిలో 960.48 హెక్టార్లలో మొక్కల పెంపకమే లక్ష్యమని జిల్లా అటవీ శాఖా. దికారి (డీఎఫ్‌వో) మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో గల చెక్కనగిషీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ మహిళలు తయారు చేస్తున్న వస్తువులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నర్సరీల్లో 20.65 లక్షల మొక్కల చేపట్టామన్నారు. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఆయా రేంజ్‌ల పరిధిలో అధికారులు మొక్కలు నాటేందుకు ప్లాంటేషన్‌లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 60 హెక్టార్లలో మొక్కలు నాటామని తెలిపారు. అక్టోబరు నాటికి అన్నీ ప్లాంటేషన్లలో మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. చెక్కనగిషీ కేంద్రంలో వస్తువుల తయారీకి ఉపయోగించే నెర్థి, బిల్లనెర్థి, కలివి, వేప, దేవదారి కలప అందుబాటులో ఉండడంలేదన్నారు. వాటిని అటవీ శాఖ ప్లాంటేషన్లలో పెంచి, తయారీదారులకు కలపను సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని వివరించారు. అనంతరం మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ప్లాంటేషన్, దుర్గంపల్లి నర్సరీని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య, ఏబీవో బచ్చల వెంకటేశ్వర్లు, చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కనగిషీ కేంద్రంలో మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

ప్రధానోపాధ్యాయుడికి ట్రైబల్ ఫొటో అవార్డు

● జాతీయస్థాయి పోటీలో సూర్యప్రకాశరావు ప్రతిభ

లింగసముద్రం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్-2025 అవార్డును మండలంలోని మొగిలిచెర్లలోని జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే.సూర్యప్రకాశరావు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ సహకారంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటో గ్రాఫిక్స్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వారు ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు పోటీలను జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న పోటీదారులు కేవలం గిరిజనులకు సంబంధించిన ఫొటోలను మాత్రమే ఆన్‌లైన్‌లో డిజిటల్ కాపీలను పంపించాచారు. సుమారు 700 నుంచి 800 మంది వరకు ఈ పోటీలో పాల్గొనగా దేశ వ్యాప్తంగా 12 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి సూర్యప్రకాశరావు విజేతగా నిలిశారు. ఈ అవార్డు, బంగారు పతకం, ప్రశంసాపత్రంను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, పాయ్ వైస్ చైర్మన్ డాక్టర్ కొంపల్లి సుందర్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజులు చేతుల మీదుగా అందుకున్నారు.



విజయవాడలో ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డును పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ నుంచి అందుకుంటున్న హెచ్ఎం సూర్యప్రకాశరావు